మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 55 • పేజీలు:12+16 • వెల: రూ.5 | బుధవారం • 24-1-2018 | www.manamnews.com | /manamnews



షట్ 'డౌన్'

అమెరికా సంక్షోభానికి తెర

స్వల్పకాలిక బిల్లుకు ఆమోదం

సంతకం చేసిన ట్రంప్

ప్రభుత్వ సేవలు పునఃప్రారంభం

ఫిబ్రవరి 8 వరకూ కాలపరిమితి

అక్రమ వలసలపై చర్చకు ఓకే

బిల్లుకు సహకరించిన డెమోక్రాట్లు

7లో..



రేపిస్టులకు శిక్ష పడాలి

- రక్తంతో ప్రధానికి లేఖ
- లేదంటే ఆత్మహత్యే శరణ్యం
- అత్యాచార బాధితురాలి ఆవేదన



నేడు శ్రీవారి సప్తవాహన విహారం

రథసప్తమి పర్వదినానికి తిరుమల ముస్తాబు

సూర్యప్రభతో మొదలు.. చంద్రప్రభతో ముగింపు


పుష్పాలంకారంతో శోభిల్లుతున్న స్వామి ఆలయం

తిరుమల, జనవరి 23 (మనం న్యూస్):

రథసప్తమి పర్వదినం నేపథ్యంలో తిరుమల సర్వాలంకార శోభితంగా ముస్తాబైంది. ఈ మేరకు బుధవారం ఉభయ నాంచారీ సమేతుడైన శ్రీనివాసుడు సప్త వాహనాలపై ఊరేగుతూ భక్తులను కటాక్షిస్తాడు. బ్రహ్మోత్సవాలలో స్వామివారి దర్శనభాగ్యం లభించని భక్తులు రథసప్తమి రోజున శ్రీవారిని దర్శించుకుని పులకిస్తారు. ఈ మేరకు ఉదయం సూర్యప్రభ వాహనంపై బయలుదేరే తిరుమలేశుడు రాత్రి చంద్రప్రభ వాహన సేవతో తిరిగి ఆలయానికి చేరుకుంటాడు. ఈ వేడుకల కోసం టీటీడీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇందులో భాగంగా శ్రీవారి సేవకోసం సంబంధిత వాహనాలను ఇప్పటికే వాహన మంటపానికి చేర్చి అలంకరించారు. మరోవైపు శ్రీవారి ఆలయం నానావిధ పుష్పాలంకరణతో శోభిల్లుతోంది. తిరుమాడ వీధుల్లో భక్తుల కోసం ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేయడంతోపాటు ఆహార పొట్లాలు, మంచినీరు, మజ్జిగ, పాలు నిరంతరం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మంగళవారం తిరుమల జేఈవో శ్రీనివాసరాజు, ముఖ్య భద్రతాధికారి రవికృష్ణ సిబ్బందితో కలసి తిరుమాడ వీధుల్లో తనిఖీ చేశారు. సాయంత్రం కార్యనిర్వహణాధికారి మిగతా 6లో..

'మూడు' ముఖ్యం

సవాళ్లకు పరిష్కారం.. ప్రగతి.. క్రియాశీలత



- ప్రకృతి వనరుల వాడకంలో స్వార్థపరత్వం
- అవసరం హద్దు కావాలి.. అత్యాశ వద్దేవద్దు
- మా జాతిపిత బాపూజీ చూపిన మార్గమిది
- ఆరోగ్యంతో సౌభాగ్యం భారత్‌లోనే సాధ్యం
- స్వస్థత.. సంపూర్ణత కోసం మా దేశం రండి
- పారదర్శకత.. ప్రగతిశీలత సదా యథాతథం



దావోస్, జనవరి 23:

ప్రపంచానికి కావాల్సినవి శాంతి, సుస్థిరత, భద్రత...

ప్రపంచాన్ని నడిపిస్తున్నవి శాస్త్ర పరిజ్ఞానం, సాంకేతికత, ఆర్థిక ప్రగతి...

ప్రపం చానికి అతిపెద్ద సవాళ్లు వాతావరణ మార్పు, ఉగ్రవాదం, స్వార్థపరత్వం...

అంటూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రపంచ దేశాల అధినేతల 'మూడ్' (మనోభావాల)ను తన ప్రసంగంతో ఆకట్టుకున్నారు. ఈ మూడు ముఖ్యాంశాలపై అంతర్జాతీయ సమాజం ప్రధానంగా దృష్టిసారించాలని పిలుపునిచ్చారు. "భిన్న ధ్రువ ప్రపంచం కోసం ఉమ్మడి భవిష్యత్ సృష్టి" ఇతివృత్తంగా ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) మిగతా 6లో..

దావోస్ వేదికపై రామచంద్రులు



ఇదీలోకం!



మీ కోసం వేసిన రెడ్ కార్పెట్ కాదు సార్, ధర లేక రైతులు రోడ్లపై పారబోసిన టమాటాలు

మేడారం.. ముస్తాబు

- భక్తులకు విస్తృత ఏర్పాట్లు
- రెండ్రోజుల్లో పూర్తిస్థాయిలో..
- డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి
- మంత్రులతో మేడారంలో పర్యటన
- పలు సదుపాయాలు ప్రారంభం



వరంగల్, జనవరి 23 (మనం బ్యూరో): అతిపెద్ద గిరిజన జాతర మేడారంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేశామని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి తెలిపారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, చందూలాల్, మహేందర్‌రెడ్డిలతో కలసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జంపన్నవాగు వద్ద నూతనంగా నిర్మించిన కల్యాణకట్టలను, మేడారంలో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన హరిత హోటల్‌ను, గిరిజన మ్యూజియంను, బస్‌స్టేషన్లను మంత్రులు ప్రారంభించారు. అనంతరం అమ్మవార్లను మిగతా 6లో..



పనులన్నీ చకచకా

- మెట్రో పనులు పూర్తిచేయండి
- చివరి మైలు వరకు అనుసంధానం
- ఫీడర్ బస్సుల ఏర్పాటు మాటేంటి?
- ప్రయాణికుల ఫీడ్‌బ్యాక్ ముఖ్యం
- మెట్రో రైలుపై సమీక్షలో సీఎస్

హైదరాబాద్, జనవరి 23(మనం ప్రతినిధి):

మెట్రోరైలు పనులను చకచకా పూర్తిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ అధికారులకు సూచించారు. సచివాలయంలో మంగళవారం ఆయన పలువురు ఉన్నతాధికారులతో మెట్రోరైలు పురోగతిపై సమీక్ష సమావేశం మిగతా 6లో..

విమానంలో 'వై-ఫై' మోత!

గంటకు రూ.500-1000 చార్జి

టికెట్‌పై అదనంగా 20-30 శాతం భారం



6లో..

వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో బుధవారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలలో మార్పులేదు. చలి తీవ్రత కొంత తగ్గుతుంది. గంటకు 11 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 31 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 15 డిగ్రీలు

గాలిలో తేమ: 56 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి: సప్తమి సా. 4.17 తదుపరి అష్టమి; నక్షత్రం: రేవతి ఉ.8.32 తదుపరి అశ్విని; వర్జ్యం: తె.4.21- 5.57; దుర్ముహూర్తం: మ.12.06 - 12.51; రాహుకాలం: మ.12.28 - 1.52; అమృతఘడియలు: ఉ. 6.08 - 7.46; శుభసమయం: మ.1.55 - 3.00.

సూర్యోదయం: 6.53

సూర్యాస్తమయం: 6.03

మందకృష్ణకు బెయిల్



షరతులతో మంజూరు చేసిన కోర్టు

ఉత్తర్వులు ఆలస్యం.. నేడు విడుదల

హైదరాబాద్, జనవరి 23 (మనం ప్రతినిధి):

ఎస్సీ వర్గీకరణ పోరాటంలో భాగంగా అనుమతి లేకుండా దీక్షా దివస్ నిర్వహించినందుకు అరెస్టైన మందకృష్ణ మాదిగకు ఊరట లభించింది. సికింద్రాబాద్ సివిల్ కోర్టు మంగళవారం ఆయనకు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. ఇద్దరు వ్యక్తులతో రూ.10 వేలకు పూచీకత్తుతోపాటు పదిరోజులకోసారి రాంగోపాల్ పేట, కార్ఖానా పీఎస్‌లలో హాజరు కావాలని కోర్టు షరతులు విధించింది. ఈ నెల రెండో తేదీ నుంచి చంచల్‌గూడ జైలులో మందకృష్ణ రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే. అయితే, మందకృష్ణతోపాటు అరెస్టయిన మరో ఐదుగురికి గత వారమే కోర్టు బెయిల్ మంజూరు చేసింది. మందకృష్ణ మంగళవారం షరతులతో బెయిల్ ఇవ్వడంతో కొంత ఊరట లభించింది. కోర్టు ఉత్తర్వులు అందడం ఆలస్యం కావడంతో ఆయన జైలు నుంచి బుధవారం విడుదల కానున్నారు. అయితే మందకృష్ణ అరెస్టు మిగతా 6లో..

సీట్ల పెంపు ఖాయమేనా?

తెలంగాణలో 153.. ఏపీలో 225

పునర్విభజనకు కేంద్రం ఓకే?

రాష్ట్రాలకు సానుకూల సూచనలు.. ఫలించిన ముఖ్యమంత్రుల చర్చలు

అసెంబ్లీ సీట్లు పెరగక తప్పదు.. పార్టీ సమావేశాల్లో అంతర్గత వ్యాఖ్యలు

వలస నేతల ఆశలు సజీవం.. అధికార పార్టీలకు తప్పిన సర్దుబాట్లు



హైదరాబాద్, జనవరి 23 (మనం ప్రతినిధి):

అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్రం సానుకూలంగా ఉందని, ఈ మేరకు త్వరలో బిల్లు కూడా తేనుందని రాజకీయ పక్షాలలో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. అంతర్గత సంభాషణలలో పునర్విభజన విషయమై నేతలు సీరియస్‌గా చర్చిస్తున్నట్లు సమాచారం. పునర్విభజన విషయంపై కేంద్రం అధికారికంగా ఎలాంటి సూచన చేయకపోయినా.. ఆ దిశగా ఏర్పాట్లు ఇప్పటికే జరిగిపోతున్నాయని తెలిసింది. నియోజకవర్గాల సంఖ్యను పెంచుతూ... వాటిని పునర్విభజించేందుకు సూత్రప్రాయంగా ఆమోదం కూడా లభించిందని మిగతా 6లో..,



గణతంత్ర దినోత్సవం రోజు హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహ హారతి కార్యక్రమం నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న భరత మాత భారీ విగ్రహం



గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లలో ఢిల్లీలో యుద్ధ ట్యాంకర్ల రిహార్సల్స్



సుభాష్ చంద్రబోస్ 121వ జయంతిని పురస్కరించుకుని సికింద్రాబాద్‌లోని ఆయన విగ్రహానికి పూల దండలతో నివాళులు అర్పిస్తున్న యువకులు

ఏసీబీకి చిక్కిన ఆర్డీవో

40 వేలు లంచం తీసుకుంటూ దొరికిన అధికారి

ఇంట్లో సోదాలు, విలువైన పత్రాలు స్వాధీనం



మోర్తాడ్ (ఆర్మూర్), జనవరి 23(మనం న్యూస్): వాటర్‌ప్లాంట్ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న వ్యక్తి నుంచి రూ.40 వేలు లంచం తీసుకుంటూ ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ అధికారి ఏసీబీకి పట్టుబడ్డాడు. ఆర్మూర్‌లో మంజీరా వాటర్ ప్లాంట్ అనుమతి కోసం రాజకుమార్ అనే వ్యక్తి వారం రోజులు క్రితం దరఖాస్తు చేసుకున్నాడు. అనుమతి కోసం ఆర్మూర్ ఆర్డీవో శ్రీనివాస్‌గౌడ్ రూ.40 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో రాజకుమార్ ఏసీబీని ఆశ్రయించాడు. ఈ మేరకు ఏసీబీ అధికారులు పథకం ప్రకారం ఆర్డీవో శ్రీనివాస్‌గౌడ్‌ను మంగళవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే ఆరోపణలపై శ్రీనివాస్‌గౌడ్ ఇంట్లో ఏసీబీ అధికారులు తనిఖీలు చేశారు. జగిత్యాలలో 3 ప్లాట్లు, హైదరాబాద్‌లో 2 ప్లాట్లు, మరికొన్ని ఆస్తులకు సంబంధించిన పత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఎఫ్‌డీసీతో 123 కోట్ల ఆదాయం

- **అటవీ శాఖ మంత్రి జోగు రామన్న**

హైదరాబాద్, జనవరి 23 (మనం ప్రతినిధి): ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా ఎఫ్‌డీసీ(ఫారెస్ట్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా రూ. 123 కోట్ల ఆదాయం లభించినట్టు అటవీ శాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో యూకలిప్టస్, వెదురు చెట్ల పెంపకం గణనీయం పెరిగిందని, దాదాపు 33,743 హెక్టార్లలో సాగు చేసినట్టు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎకో టూరిజంను నిర్లక్ష్యం చేశారని, ఇప్పుడు ఎకో టూరిజం ద్వారా రూ. 13.5 కోట్ల ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. పర్యాటకానికి సంబంధించి బొటానికల్ గార్డెన్స్ ఏర్పాటు చేశామని, నెలకు దాదాపు 66 వేలకు పైగా పర్యాటకులు సందర్శించినట్టు తెలిపారు. దీంతోపాటు బోటింగ్, కాటేజ్‌ల వంటి సౌకర్యాలను పెంచడానికి, రాష్ట్రంలో పర్యాటక శాఖ ద్వారా ఆదాయం పెంచుటకు ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. ఆదిలాబాద్ కుంటాల జలపాతం అభివృద్ధిపై చర్చించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఎఫ్‌డీసీ, అటవీశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ నెల 27, 29 తేదీల్లో ఇంటర్ పర్యావరణ పరీక్ష

హైదరాబాద్, జనవరి 23 (మనం ప్రతినిధి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు 27న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, 29న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలను నిర్వహించనున్నట్టు తెలంగాణ ఇంటర్ బోర్డు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. హాల్‌టికెట్స్‌ను ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్ ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. బ్యాక్‌లాగ్ విద్యార్థులు ఏలాంటి ఫీజు చెల్లించకుండా పాత హాల్‌టికెట్స్ నంబర్లతో అదే కాలేజీలో రాసుకోవచ్చని పేర్కొంది. ఈ పరీక్షల్లో పాసయితేనే ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత సాధించినట్టు సర్టిఫికేట్ ఇస్తారని, లేకపోతే ఇంటర్ ఫెయిల్ అయినట్టేనని వివరించింది. ఇంటర్ కళాశాలలు తప్పనిసరిగా ఈ పరీక్షలను నిర్వహించాలని ఇంటర్ బోర్డు ఆదేశించింది.


జై తెలంగాణ.. మరో వందేమాతరం

ఏపీ జన్మనిస్తే.. తెలంగాణలో పునర్జన్మ

- తుదిశ్వాస వరకూ రుణపడి ఉంటా
- ఉద్యమ స్ఫూర్తితో జనసేన పయనం
- ఆశయ సాధనలో రాజీలేని పోరాటం
- కరీంనగర్‌లో జనసేనాని పవన్ కల్యాణ్



కరీంనగర్, జనవరి 23 (మనం న్యూస్ బ్యూరో): 'ఆంధ్రప్రదేశ్ జన్మనిస్తే తెలంగాణ పునర్జన్మనిచ్చింది. తుదిశ్వాస విడిచే వరకూ ఈ నేలకు రుణపడి ఉంటా.. ఉద్యమగడ్డగా పేరొందిన కరీంనగర్ నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించడం ఆనందంగా ఉంది' అని జనసేనాని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. జై తెలంగాణ మరో వందేమాతరమని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ ఆశయాల సాధనకోసం నేను కూడా మీలో ఒకడిగా పోరాడతానని స్పష్టం చేశారు. ఆశయాల సాధన కోసం కాన్షీరాం, అంబేడ్కర్, పూలే విధానాలతో, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో జనసేన ముందుకు నడుస్తుందని చెప్పారు. ఈమేరకు కరీంనగర్‌లోని శుభం గార్డెన్స్‌లో మంగళవారం నాడు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల కార్యకర్తలతో పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. బుద్ధుడు చెప్పిన విధంగా ద్వేషించే వారికి తన వద్ద సమయంలేదని, ఉన్న సమయం మొత్తం ప్రేమించేవారితో గడిపేందుకే సరిపోతోందన్నారు. తన జీవితం ఎక్కువగా తెలంగాణతోనే ముడిపడి ఉందని, ఇక్కడే పెరగడంతో ఈ నేల భావోద్వేగాలు తనలో ఉన్నాయని చెప్పారు. తెలంగాణ యాసకు, భాషను సంస్కృతికి గౌరవం దక్కాలన్నారు. ఆశయ సాధనలో రాజీపడబోనని పవన్ స్పష్టం చేశారు. ఇచ్చిన మాట తప్పనని, జనసేనను ఏ పార్టీలో వీలినం చేయబోనని చెబుతూ.. 2019లో తెలంగాణలో ఎన్నికల బరిలో నిలబడతామని స్పష్టతనిచ్చారు. తెలంగాణలో ఉన్న స్నేహితులు, కార్యకర్తల ప్రోత్సాలంతోనే పోటీకి సిద్ధపడుతున్నట్లు వివరించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు తాను అడ్డుపడలేదని, తెలంగాణ యాసను, భాషను సంస్కృతిని తన సినిమాల్లో ప్రోత్సహించానని పేర్కొన్నారు. బతుకమ్మ, సమ్మక్క-సారలమ్మ పండుగలు తెలంగాణకు ఎంతో ప్రత్యేకమైనవన్నారు. తనకు పునర్జన్మ ఇచ్చిన తెలంగాణ తల్లికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాని తెలిపారు. కేసీఆర్ స్మార్ట్ సీఎంగా పని చేస్తున్నారని తాను వ్యాఖ్యానిస్తే.. కొందరు తప్పుబట్టారన్నారు. తన వ్యాఖ్యలు కొంతమంది నేతలకు ఇబ్బంది కలిగించాయన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ పసిబిడ్డను జాగ్రత్తగా కాపాడుకోవాలంటూ కాంగ్రెస్ నేతలకు పవన్ హితవు పలికారు. రాజకీయాల్లో తనకెవరితోనూ శత్రుత్వం లేదని, విధివిధానాలపైనే తన పోరాటం కొనసాగుతుందన్నారు. విమర్శించే వారిని పట్టించుకునే సమయం కూడా తనకు లేదన్నారు. తెలుగు రాష్ట్రాల్లో నిబద్ధత, విజ్ఞతతో కూడిన రాజకీయం చేస్తానని పేర్కొన్నారు. అవినీతిపై రాజీలేని పోరాటం చేస్తామని ఉద్ఘాటించారు. సంస్కృతులను కాపాడే సమాజం కోసం జనసేన పని చేస్తుందన్నారు. పార్టీ పూర్తిస్థాయి ప్రణాళికను మార్చి 14లోపు ప్రకటిస్తామని పవన్ కల్యాణ్ తెలిపారు.



ఖమ్మం చేరుకున్న పవన్..

జనసేనాని బుధవారం ఖమ్మంలో పర్యటించనున్నారు. కరీంనగర్‌లో జరిగిన కార్యకర్తల సమావేశం తర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి జూలూరుపాడు, తల్లాడ మీదుగా ఖమ్మం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఉదయం ఎంబీ గార్డెన్స్‌లో జరిగే పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పవన్ ప్రసంగిస్తారు.

వరంగల్ డిక్లరేషన్ సభపై పెచ్చరిల్లిన రాజ్యహింస

- రాష్ట్రంలో ప్రజాస్వామిక హక్కుల అణిచివేత
- మరో లాటిన్ అమెరికాగా తెలంగాణ మారే ముప్పు
- మంద కృష్ణ అరెస్ట్ ప్రభుత్వ ద్వంద్వ నీతికి నిదర్శనం
- విరసం నేత వరవర రావు

హిమాయత్‌నగర్, జనవరి 23(మనం న్యూస్): వరంగల్ డిక్లరేషన్ 20 ఏళ్ల సభలో ప్రభుత్వం హింసను అమలు చేసిందని విరసం నేత వరవర రావు అన్నారు. హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆధ్వర్యంలో ఈ నెల 21న వరంగల్‌లో నిర్వహించిన వరంగల్ డిక్లరేషన్ సభకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్టే ఇచ్చి, పోలీసులతో సభను అడ్డుకునేందుకు కుట్ర చేసిందన్నారు. సభకు హాజరైన కళాకారులు, మహిళలు, విద్యార్థులపై పోలీసులు చేసిన దాడికి తాను ప్రత్యక్ష సాక్షి ని అని వరవరరావు అన్నారు. కాళోజీ సెంటర్‌లోని అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పించాడినికి వెళ్లిన విద్యార్థులు, మహిళలు, కళాకారులను విచక్షణారహితంగా కొట్టి, పోలీసుస్టేషన్‌లో నిర్బంధించారని ఆయన ఆరోపించారు. ఏసీపీ శోభన్ కుమార్ అసభ్య పదజాలంతో మహిళలను దూషించడమే కాకుండా, మహిళలను ఎక్కడపడితే అక్కడ తాకి వారిని అవమానించారన్నారు. మహిళలపై హింస జరుగుతుంటే షీ టీమ్స్ ఎక్కడికి పోయాయని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఏసీపీలు శోభన్ కుమార్, రాజేంద్రప్రసాద్, సీఐ సదయ్యను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిర్బంధం వల్ల వరంగల్ డిక్లరేషన్ 60 డిమాండ్ల నుంచి 120 డిమాండ్లకు చేరిందన్నారు. ప్రభుత్వం మావోయిస్టులను ఎన్‌కౌంటర్‌ల పేరుతో చంపడం మొదలుకొని వరంగల్ డిక్లరేషన్ ప్రాతిపదికగా పాఠ్యపుస్తకాల్లో పొందుపరిచి ఆ డిక్లరేషన్ ప్రకటించిన ప్రజాస్వామిక తెలంగాణపై దాడి చేస్తుందన్నారు. ప్రజలంతా ఒక్కటై ప్రతిఘటించకపోతే తెలంగాణ మరో లాటిన్ అమెరికా దేశంగా మారిపోయే ప్రమాదం ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం శాంతియుతంగా దీక్ష చేపట్టిన మంద కృష్ణ మాదిగ అరెస్టు పాలక వర్గాల ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు. చట్టాలకు లోబడే ఎమ్మార్పీస్ పోరాటం చేస్తోందని, ఆ కార్యకర్తలపై దాడులు ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం నాయకులు గడ్డం లక్ష్మణ్, ఎన్. నారాయణ రావు, రఘునాథ్, పోలీసుల దాడిలో గాయపడ్డ స్వామి, సమీర్, మమత తదితరులు పాల్గొన్నారు.



హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో మాట్లాడుతున్న వరవర రావు

రాష్ట్రం బాగుంటే పర్యటనలెందుకు?

'భజన సేన'గా మార్చుకోండి.. పవన్‌కు కాంగ్రెస్ నేతల హితవు



హైదరాబాద్, జనవరి 23 (మనం ప్రతినిధి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ సీఎం కేసీఆర్‌కు భజన చేస్తున్నారని కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తంచేసింది. కేసీఆర్ పాలనలో అంతాబాగుంటే పర్యటనలు ఎందుకని పవన్‌ను ప్రశ్నించింది. పార్టీ పేరును భజనసేనగా మార్చుకుంటే తమకు అభ్యంతరంలేదని కాంగ్రెస్ నాయకులు, రాజ్యసభ మాజీ సభ్యులు వి.హన్మంతరావు, ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మంగళవారం నాడు గాంధీభవన్‌లో విలేకరులతో చెప్పారు. తెలంగాణ కోసం పోరాడిన కోదండరామ్ పర్యటనలకు, మందకృష్ణ దీక్షలకు అనుమతించని ప్రభుత్వం పవన్ పర్యటనలకు ఎలా అనుమతించిందని ప్రశ్నించారు. పవన్ తన పార్టీని టీఆర్ఎస్‌లో విలీనం చేసుకోవడం మంచిదన్నారు. పవన్‌కు నిబద్ధత లేదని, తెలంగాణ సమస్యల పట్ల అవగాహనలేదని వీహెచ్ విమర్శించారు. ఉద్యమ సమయంలో పవన్, కేసీఆర్ పరస్పరం తిట్టుకున్నారని గుర్తుచేశారు. అక్కడ చంద్రబాబుతో, ఇక్కడ కేసీఆర్‌తో పవన్ సర్దుబాటు చేసుకున్నారని, ఆయన ఆటో మీటర్ కేసు లాంటిదే పవన్ కేసు అని ఎద్దేవా చేశారు. పవన్ వ్యక్తిగత జీవితంపై మహేష్ కత్తి చేసిన ఆరోపణలు నిజమో, కాదో పవన్ చెప్పాలని డిమాండ్ చేశారు. పరోక్షంగా టీఆర్ఎస్‌కు సహకరించేందుకే పవన్ పర్యటిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో ఎలాంటి సమస్యలు ఉన్నాయో తనతో వస్తే పవన్‌కు చూపిస్తానని వీహెచ్ చెప్పారు. వర్గీకరణపై అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని కోరుతూ మందకృష్ణ ఇంట్లోనే దీక్ష చేస్తున్నా, అనుమతి లేదన్న సాకుతో జైలుకు పంపించారని జీవన్ రెడ్డి విమర్శించారు. అజ్ఞాతవాసి సినిమాకు 5 షోలకు అనుమతించినందుకే పవన్ కేసీఆర్‌కు భజన చేస్తున్నారని జీవన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో చేసిన ఏ ఒక్క హామీని నెరవేర్చనందుకు పవన్‌కు కేసీఆర్ బెస్ట్ సీఎంగా కనిపించారా? అని ప్రశ్నించారు. దళితుల సంక్షేమానికి కేటాయించిన నిధులు కూడా ఖర్చు చేయలేదని, మూడెకరాల భూమి ఇవ్వలేదని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టించడంలేదని, ఓబీసీ కార్పొరేషన్‌కు పైసా ఇవ్వలేదని విమర్శించారు. మైనారిటీలకు కేటాయించిన నిధులు ఖర్చు చేయడంలేదని, గిరిజనుల రిజర్వేషన్ల విషయం మరిచిపోయారని చెప్పారు. పవన్‌కు ఇవన్నీ కనిపించడలేదా అని ప్రశ్నించారు. వాగ్దానాలను అమలు చేయకుండా అన్ని అబద్దాలు చెబుతున్నందుకు కేసీఆర్ స్మార్ట్ సీఎం అన్నారు. కేవలం మూడున్నరేళ్లలోనే తెలంగాణ అప్పును 69 వేల కోట్ల నుంచి 1.35 లక్షల కోట్లకు పెంచడంలో కేసీఆర్ నిజంగానే గ్రేట్ సీఎం అని విమర్శించారు.

పోలీసుల అనైతిక వ్యవహారంపై చర్యలు

- ఆ ఇద్దరు పోలీసులపై సస్పెన్షన్ వేటు



కూకట్‌పల్లి, జనవరి 23(మనం న్యూస్): పోలీసు శాఖలో అనైతిక వ్యవహారంపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఏసీబీ ఎఎస్పీ సునితా రెడ్డి, కల్వకుర్తి సీఐ మల్లిఖార్జున రెడ్డి సస్పెన్షెన్‌కు గురయ్యారు. ఎఎస్పీ సునితారెడ్డి, సీఐ మల్లిఖార్జునరెడ్డి వివాహేతర బంధం బహిర్గతం కావడంతో మాదాపూర్ డీసీపీ విశ్వప్రసాద్ ఆదేశాల మేరకు కేపీహెచ్‌బీ పీఎస్ వీరిపై కేసు నమోదు అయ్యింది. సునితారెడ్డికి, మల్లిఖార్జునరెడ్డికి ఐదేళ్లుగా పరిచయం ఉంది. వీరి పరిచయం వివాహేతర సంబంధంగా మారింది. సునితారెడ్డి భర్త అమెరికాలో ఉద్యోగం చేస్తుంటారు. ఆమె కేపీహెచ్‌బీ కాలనీలో నివాసముంటున్నారు. భార్య వివాహేతర సంబంధం విషయం తెలియడంతో సురేందర్‌రెడ్డి రెండేళ్ల క్రితం విషయాన్ని పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. పెద్దలు మందలించడంతో సునితారెడ్డి, మల్లిఖార్జునరెడ్డికి కొద్ది రోజులుగా దూరంగా ఉంది. మళ్లీ మూడు నెలలుగా వీరు సఖ్యతగా ఉండడాన్ని సునిత సురేందర్‌రెడ్డి గమనించారు. సునిత, మల్లిఖార్జున్‌తో కలిసి ఇంట్లో ఉన్నారని తెలిసి విషయాన్ని ఇరువురి కుటుంబసభ్యులకు తెలిపి వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సునీత తల్లి, అత్త మల్లిఖార్జున్‌రెడ్డిని రోడ్డుపై చెప్పులతో కొట్టారు. సునీత భర్త సురేందర్‌రెడ్డి ఈ విషయంపై డీసీపీ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యమంతోనే రిజర్వేషన్లు: జాజుల

హైదరాబాద్, జనవరి 23(మనం ప్రతినిధి): బీసీ ఉద్యోగులు ఐక్యంగా ఉద్యమించి ప్రమోషన్లలో రిజర్వేషన్లు సాధించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. బీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 28న హైదరాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో రాష్ట్ర మహాసభను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

ఏఐవైఎఫ్ అధ్యక్షుడిగా కరుణకుమార్



హైదరాబాద్, జనవరి 23(మనం ప్రతినిధి): అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షునిగా సిద్ధినేని కరుణ కుమార్ ఎన్నికయ్యారు. మంగళవారం ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ నూతనంగా ఎన్నికైన వారి వివరాలను వెల్లడించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మారుపాక అనిల్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పంజాల శ్రీనివాస్, నెర్లకంటి శ్రీకాంత్, పొసిరిగిరి శ్యామల, తోటవిజయ్, సహాయ కార్యదర్శులుగా కొత్తపల్లి చిరంజీవి, తదితరులు ఎన్నికైనట్టు ప్రకటించారు. యువజనులకు, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తిరుమలై సూచించారు.



ప్రజలకు చేరువైన 'మనం'

- మనం పత్రిక క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి

నిజామాబాద్, జనవరి 23(మనం న్యూస్): దినదినాభివృద్ధి చెందుతూ, మెరుగైన కథనాలతో అనతి కాలంలోనే మనం తెలుగు దినపత్రిక ప్రజలకు చేరువయ్యిందని కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని సదాశివనగర్ మండలానికి మంగళవారం వచ్చిన ఎమ్మెల్యేను నిజామాబాద్ మనం పత్రిక ప్రతినిధులు కలిశారు. మనం-2018 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే చేతులమీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అట్టడుగున ఉన్న సమస్యలను వెలుగులోకి తెచ్చి, వాటిని పరిష్కరింపజేయడంలో పత్రిక పాత్ర కీలకమన్నారు. మనం పత్రిక ప్రజలకు ఉపయోగపడే వార్తలను అందిస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ లింగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ శ్యాంరావు, ఎంపీపీ బంజవిజయ, వైస్ ఎంపీపీ రూపేందర్‌రెడ్డి, సర్పంచ్ గంగామణి, ఎంపీటీసీ లక్ష్మి, గొల్లకుర్మ సంఘం జిల్లా డైరెక్టర్ చంద్రయ్య, తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణను ప్రపంచానికి చూపిస్తాం

- **తొలిసారి 'దావోస్'లో రాష్ట్రానికి అవకాశం: కేటీఆర్**
- **పలు కంపనీల ప్రతినిధులతో భేటీ**



హైదరాబాద్, జనవరి 23 (మనం ప్రతినిధి): దావోస్ సదస్సులో తొలిసారి పాల్గొనే అవకాశం తెలంగాణకు వచ్చిందని, రాష్ట్ర ముఖచిత్రం ఏమిటో ప్రపంచానికి చూపిస్తామని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాల్లో పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. మంగళవారం జరిగిన ప్రారంభోత్సవ ప్లీనరీ సమావేశంలో కేటీఆర్‌తోపాటు దేశ ప్రధాని నరేంద్ర మోడీ, పలు దేశాల అధినేతలు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రపంచంలోని ప్రముఖ కంపెనీల సీఈవోలు, చైర్మన్లు పాల్గొన్నారు. 26వ తేదీ వరకు జరగనున్న ఈ సమావేశాల్లో మంత్రి పలు సెషన్లలో ప్రసంగించనున్నారు. 25న జరగనున్న సెషన్‌లో లివరేజింగ్ డిజిటల్ టూ డెలివర్ వాల్యూ టూ సొసైటీ అనే అంశంపైన ప్రసంగిస్తారు. దీంతోపాటు కేంద్ర మంత్రి సురేశ్‌ప్రభు పాల్గొననున్న రౌండు టేబుల్ సమావేశాల్లో ఫ్రాంటింగ్ డిజైన్ ఇన్ ఇండియా అనే అంశంపైన ప్రసంగించనున్నారు. కాగా, ఫోరం ప్రారంభ ప్లీనరీ అనంతరం ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్, ఎంపీ గల్లా జయదేవ్, ముకేశ్ అంబానీతోపాటు పలువురు పారిశ్రామికవేత్తలను కలిశారు. ఈ సందర్భంగా పలు కంపెనీలతో సమావేశమయ్యారు. థాయ్‌లాండ్ దేశానికి చెందిన ఈ గ్రూపు తెలంగాణలో ఉన్న పెట్టుబడుల అవకాశాలను పరిశీలిస్తామని గ్రూపు చైర్మన్ లోహియా తెలిపారు.



దావోస్ అందాలకు కేటీఆర్ ఫిదా..

మచ్చుదుప్పటి పరుచుకున్న స్విట్జర్లాండ్ అందాలకు మంత్రి కేటీఆర్ ఫిదా అయ్యారు. ఇంకేముంది అక్కడే ఓ సెల్ఫీ కూడా దిగారు. కోడి కూత లేని ఆ పట్టణంలో.. సూర్యుడు అప్పుడే ప్రపంచానికి గుడ్ మార్నింగ్ చెప్పిన తరుణంలో కేటీఆర్ తను బస చేసిన హోటల్ నుంచి ఓ సెల్ఫీకి పోజు ఇచ్చారు. ఆ తర్వాత ఈ రమణీయ అందాలను చూడటానికే త్వరగా నిద్ర లేచాను అని కేటీఆర్ ట్విటర్‌లో పేర్కొన్నారు.

టీఆర్ఎస్ ఎమ్మెల్యేలపైనా వేటు వేయండి

- **తొమ్మిది మందిపై చర్యలు తీసుకోండి**
- **రాష్ట్రపతి, ఈసీకి రేవంత్‌రెడ్డి ఫిర్యాదు**



హైదరాబాద్, జనవరి 23 (మనం ప్రతినిధి): ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలపై తీసుకున్న తరహాలోనే టీఆర్ఎస్‌కు చెందిన 9 మంది ఎమ్మెల్యేలపైనా చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతికి, కేంద్ర ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. తెలంగాణ ప్రభుత్వంలో పార్లమెంట్ సెక్రటరీలుగా ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్యేలు కూడా లాభదాయకమైన పదవుల్లో కొనసాగారని రాష్ట్రపతి దృష్టికి రేవంత్‌రెడ్డి తీసుకువెళ్లారు. ఆప్‌కు చెందిన 20 మంది ఎమ్మెల్యేలపై చర్య తీసుకున్నట్లుగా చట్ట ప్రకారం టీఆర్ఎస్ ఎమ్మెల్యేలపైనా వేటు వేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన 6 మంది ఎమ్మెల్యేలను గతంలో పార్లమెంటు కార్యదర్శులుగా నియమించడం జరిగిందని ,వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే డి.వినయ్ భాస్కర్, కొత్తగూడెం ఎమ్మెల్యే జలగం వెంకట్రావు సీఎం కార్యాలయంలోనూ,మహబూబ్ నగర్ ఎమ్మెల్యే వి.శ్రీనివాస్ గౌడ్, తుంగతుర్తి ఎమ్మెల్యే జి.కిశోర్ కుమార్ డిప్యూటీ సీఎం కార్యాలయంలోనూ, హుస్నాబాద్ ఎమ్మెల్యే వి.సతీష్ కుమార్ విద్యాశాఖామంత్రి కార్యాలయంలోనూ, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవాలక్ష్మి వ్యవసాయ శాఖ మంత్రి కార్యాలయంలోనూ పార్లమెంటరీ కార్యదర్శులుగా రాష్ట్ర ప్రభుత్వం 2014లో నియమించిందని గుర్తు చేశారు. ఈ నియామకాలను హైకోర్టు 2015లో రద్దు చేసిందన్నారు. 2014, డిసెంబర్ నుంచి కోర్టు ఉత్తర్వులు జారీ చేసే దాకా కూడా వారు ఆ పదవుల్లో కొనసాగారని చెప్పారు. ఈ వ్యవహారంలో తీర్పు ఇచ్చినప్పుడే ఇకపై తమకు తెలియకుండా ఇలాంటి రాజ్యాంగ విరుద్ధమైన నియామకాలను చేపట్టవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించిందన్నారు. అయితే ఈ వ్యవహారం తర్వాత కూడా తెలంగాణ ప్రభుత్వం కొత్తవిధానంలో మరో ముగ్గురు ఎమ్మెల్యేలను కేబినెట్ హోదా ఇచ్చి, కొత్త పదవుల్లో నియమించిందని వెల్లడించారు. మానకొండూరు ఎమ్మెల్యే ఈర్పుల బాలకిషన్ అలియాస్ రసమయి బాలకిషన్‌ను తెలంగాణ సాంస్కృతిక సారథిగానూ, రామగుండం ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణను ఆర్టీసీ చైర్మన్‌గా, బాల్కొండ ఎమ్మెల్యే వి.ప్రశాంత్ రెడ్డిని మిషన్ భగీరథ చైర్మన్‌గా నియమించారని తెలిపారు. ఈ పదవులకు కేబినెట్ హోదా ఇవ్వడంతోపాటు అన్ని సౌకర్యాలు కల్పించారని చెప్పారు. 'లాభదాయక పదవుల' చట్టం కింద వీరిని అనర్హులను చేయాలని రాష్ట్రపతికి, ఈసీకి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర ప్రభుత్వంపై 'మహిళా యుద్ధ భేరి'

- **బీజేపీ మహిళా మోర్చ అధ్యక్షురాలు ఆకుల విజయ**

హైదరాబాద్, జనవరి 23 (మనం న్యూస్): మహిళల పురోగతిపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, బతుకమ్మ ఆడటానికి మాత్రమే ఆడబిడ్డలు కనిపిస్తున్నారని బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు ఆకుల విజయ అన్నారు. బీజేపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో 'మహిళా యుద్ధ భేరి' గోడపత్రికను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటనలకే పరిమితం అయ్యారన్నారు. మహిళలకు వడ్డీలేని రుణాలిస్తానన్న కేసీఆర్, ఒక్క మహిళా సంఘానికైనా రుణాలిచ్చారా అని ప్రశ్నించారు. మహిళలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, వడ్డీ లేని రుణాల సాధన కోసం బీజేపీ మోర్చ ఫిబ్రవరి రెండో తేదీన 'నారీ భేరీ' మోగించనుందని ఆమె తెలిపారు. బీజేపీ కార్యకర్తలందరూ ఇంటింటికీ వెళ్లి వీటి గురించి మహిళలకు వివరిస్తామన్నారు. డ్వాక్రా మహిళలను ప్రభుత్వం టీఆర్ఎస్ కార్యకర్తలుగా ఉపయోగించుకుంటోందని ఆమె విమర్శించారు. మహిళలంటే టీఆర్ఎస్ నేతలకు చిన్నచూపు అని అన్నారు.

తెలంగాణ సర్కారు పనితీరు అద్భుతం

- **నేపాల్ బృందం ప్రశంసలు**
- **మండలి చైర్మన్, విప్‌తో సమావేశం**



హైదరాబాద్, జనవరి 22(మనం ప్రత్యేక ప్రతినిధి): తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాల అధ్యయనానికి నేపాల్‌కు చెందిన బృందం రాష్ట్రానికి వచ్చింది. ఆస్మాన్ నేపాల్ సంస్థ ప్రతినిధులు రాష్ట్రంలోని పరిగి, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, ప్రభుత్వ చీఫ్ విప్ పాతూరి సుధాకర్ రెడ్డితో నేపాల్ బృందం వేర్వేరుగా మంగళవారం సమావేశమయ్యింది. తెలంగాణ ప్రభుత్వ పని తీరు, కౌన్సిల్‌లో జరిగే చర్చలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తదితర వివరాలను స్వామిగౌడ్ నేపాల్ బృందానికి వివరించారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలతో బాల్యవివాహాలను నిరోధిస్తున్నామని, త్వరలోనే తెలంగాణలో బాల్యవివాహాలను శతశాతం రూపుమాపుతామన్నారు. రాష్ట్రం తరపున నేపాల్‌లో పర్యటించి అక్కడి పరిస్థితులు అధ్యయనం చేస్తామన్నారు. పరస్పర పర్యటనలు కొత్త విషయాలు తెలుసుకోవడానికి ఉపయోగ పడతాయని చైర్మన్ నేపాల్ బృందానికి తెలిపారు. గడిచిన మూడున్నరేళ్లలో వివిధ రంగాల్లో రాష్ట్రం సాధించిన ప్రగతిని చీఫ్ విప్ పాతూరి నేపాల్ బృందానికి వివరించారు. విద్యావ్యవస్థ, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం అనుసరిస్తున్న మార్గాలను వారికి వివరించారు. అభివృద్ధిని ఉరుకలెత్తించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకొని చొరవను ఆయన నేపాల్ బృందానికి వివరించారు. విద్యతో పాటు మిగిలిన రంగాల్లో తెలంగాణ, నేపాల్ మధ్య సహాయ సహకారాలు పెరగాలని పాతూరి కోరారు. మండలి చైర్మన్ స్వామిగౌడ్, చీఫ్ విప్ పాతూరి సుధాకర్ రెడ్డితో భేటి అనంతరం తెలంగాణ ప్రభుత్వ పనితీరుపై నేపాల్ ప్రతినిధులు ప్రశంసల జల్లు కురిపించారు. విద్యావ్యవస్థ బలోపేతానికి తెలంగాణ విధానాలను తమ దేశంలోను అవలంభించాలని తమ ప్రభుత్వానికి సూచిస్తామని తెలిపారు.

'టూరిస్ట్' పవన్‌కు వీసా ఎలా ఇచ్చారు?

- **కాంగ్రెస్ నేత విజయశాంతి ప్రశ్న**

హైదరాబాద్, జనవరి 23 (మనం ప్రతినిధి) : సకల జనుల సర్వే సమయంలో పవన్ కల్యాణ్ ఓ టూరిస్ట్ అంటూ విమర్శించిన సీఎం కేసీఆర్... ప్రస్తుతం ఆయన యాత్రకు వీసా ఎలా జారీ చేశారో సమాధానం చెప్పాలని ప్రముఖ నటి, కాంగ్రెస్ నేత విజయశాంతి డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. పవన్ లాంటి టూరిస్ట్ నేతకు ఇచ్చిన స్వేచ్ఛ.. ఉద్యమ నేతలకు ఇవ్వకపోవడం శోచనీయమని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన తెలంగాణ ఉద్యమ, జేఏసీ నేతలకు కూడా పవన్ మాదిరిగానే వీసాలిస్తే తాము కూడా తెలంగాణలో ఉన్నామన్న భావన వారిలో కలుగుతుందని వ్యాఖ్యానించారు. జేఏసీ నేతలను నిర్బంధిస్తున్న తీరును చూస్తుంటే తెలంగాణ బిడ్డల పరిస్థితి ఎంత దయనీయంగా మారిందో అర్థమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. యాత్రను అడ్డుకుంటామని అన్నారు.

భూప్రక్షాళన ఆధారంగానే 'పెట్టుబడి'

- **అమలుకు భూముల డాటా కీలకం**
- **వ్యవసాయ శాఖ కార్యదర్శి సి.పార్థసారథి**

హైదరాబాద్, జనవరి 23(మనం ప్రతినిధి): భూప్రక్షాళన ఆధారంగానే పంటకు పెట్టుబడి పథకాన్ని అమలు చేయనున్నట్టు రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సి.పార్థసారథి తెలిపారు. రైతు పంటకు పెట్టుబడి పథకం అమలు నేపథ్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్లు, ఆర్డీఓలు, జిల్లా వ్యవసాయ అధికారులతో మంగళవారం నిర్వహించిన ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. రెవెన్యూ శాఖ ఇచ్చే భూ సమాచారాన్ని అనుసరించే రైతులకు పాస్ పుస్తకాలు అందజేస్తారన్నారు. అలాగే భవిష్యత్తులో రైతులకు అందజేయనున్న ఎటువంటి పథకాల అమలుకైనా ఈ సమాచారాన్నే ప్రమాణికంగా తీసుకుంటారని తెలిపారు. రైతులకు పంట పెట్టుబడి పథకాన్ని చెక్కుల రూపంలోనే అందించనున్నట్టు చెప్పారు. పాస్ బుక్కుల్లోని సమాచారం, రైతులకు చెక్కులు అందజేసిన ప్పుడు దానిపై ఉన్న సమాచారానికి ఎటువంటి తేడా ఉండొద్దన్నారు. ఈ పథకం వైపు కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, విధానకర్తలు ఆసక్తితో గమనిస్తున్నారని, రెవెన్యూ శాఖ అందించే భూమి సమాచారమే కీలకం కానుందన్నారు. అధికారులు భూవిస్తీర్ణం, మండలాలు, గ్రామాల సంఖ్య, రైతు ఖాతాల సమాచారాన్ని పక్కాగా తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. గ్రామసభలను త్వరగా పూర్తి చేసి వంద శాతం డాటాను కరెక్టుగా పొందుపర్చాలని పేర్కొన్నారు. ఈ డాటా ఆధారంగానే బడ్జెట్ కూడా రూపొందనున్నట్టు చెప్పారు. ఏఈఓ స్థాయి నుంచి డీఏవో స్థాయి వరకు వ్యవసాయ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు పనిలో భాగస్వామ్యం అయ్యేలా చూడాలని జాయింట్ కలెక్టర్లను కోరారు. భూపరిపాలన డెరెక్టర్ వి.కరుణ మాట్లాడుతూ భూసమగ్ర సర్వేకు సంబంధించిన డాటా సేకరణలో సిబ్బంది అంతా చాలా కృషి చేశారని అభినందించారు. సమావేశంలో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విద్యారంగం నిర్వీర్యం

- **ఇప్పటికీ ఒక్క డీఎస్సీ వేయలేదు: ఉత్తమ్**

హైదరాబాద్, జనవరి 23 (మనం ప్రతినిధి): ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో విద్యారంగాన్ని నిర్వీర్యం చేశారని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. కేజీ టూ పీజీ విద్యను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. మంగళవారం గాంధీభవన్‌లో తెలంగాణ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ముద్రించిన డైరీని ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. అన్ని రంగాల్లో కలిపి రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగ ఖాళీలు ఉంటే, ఇప్పటి వరకు కేవలం ఏడు వేలు మాత్రమే భర్తీ చేశారని చెప్పారు. మూడున్నర సంవత్సరాల్లో ఒక్క డిఎస్సీ కూడా వేయని అసమర్ధ ప్రభుత్వం ఇదని ఉత్తమ్ ధ్వజమెత్తారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉపాధ్యాయుల సమస్యలను కేసీఆర్ పరిష్కరించడంలేదన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానం రద్దు కోసం పోరాడుతున్న ఉపాధ్యాయులకు కాంగ్రెస్ అండగా ఉంటుదని హామి ఇచ్చారు. ఉద్యోగులకు ఇచ్చిన హెల్త్ కార్డులు కార్పొరేట్ ఆసుపత్రుల్లో పని చేయకున్నా పట్టించుకోవడంలేదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు నెలకు మూడు వేల రూపాయల భృతి ఇస్తామని ఉత్తమ్ ప్రకటించారు. సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయులు చేస్తున్న ఆందోళనను కాంగ్రెస్ పూర్తి మద్దతు ఇస్తుందని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే జీవన్ రెడ్డి , టీఎస్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ మాణయ్య తదితరులు పాల్గొన్నారు.

పవన్ గురించి మాట్లాడటం వేస్ట్

- **ఏపీ కాంగ్రెస్ నేత తులసిరెడ్డి**

హైదరాబాద్, జనవరి 23 (మనం ప్రతినిధి): ప్రశ్నిస్తానంటూ వచ్చిన పవన్ కళ్యాణ్ ఏపీలో చంద్రబాబుకు, తెలంగాణలో కేసీఆర్‌కు చెక్కభజన చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ నాయకుడు తులసీరెడ్డి ఆరోపించారు. ఇద్దరు సీఎంలకు భజన చేసేందుకు జనసేన పార్టీ, యాత్ర అవసరంలేదని మంగళవారం ఇందిరా భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఎద్దేవా చేశారు. పవన్ తన ఇంట్లోనే ఓ భజన బృందాన్ని ఏర్పాటుచేసుకుంటే సరిపోతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలు కాపాడటంతో సీఎం చంద్రబాబు నాయుడు, ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. 2019 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, వైసీపీ కలిసి పోటీ చేసేలా ఉన్నాయని ఆరోపించారు.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..

బుధవారం, జనవరి 24

మరో మహాపరాధమా?

లక్ష్యం, పద్ధతి అనే రెండు పరస్పరపూరక, పరస్పర ఆధారిత అంశాలపై కమ్యూనిస్టు పార్టీల జాతీయ మహాసభల్లో తరచూ అంతర్మథనం జరుగుతూ ఉంటుంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో జరుగబోతున్న భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 22వ జాతీయ కాంగ్రెస్‌లో చర్చకోసం ముసాయిదా రాజకీయ తీర్మానాన్ని కోల్‌కతాలో జరిగిన పార్టీ కేంద్ర కమిటీ సమావేశం జనవరి 21న ఆమోదించింది. అయితే సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రతిపాదించిన అధికారిక ముసాయిదా తీర్మానం కాకుండా, ప్రకాశ్ కారత్ ప్రత్యామ్నాయ రాజకీయ తీర్మానం నెగ్గడం విశేషం. దీర్ఘకాలిక రాజకీయ/సైద్ధాంతిక ప్రయోజనాలను తాత్కాలిక ఎన్నికల లబ్ధి కోసం బలి చేయకూడదనే అవగాహన నేపథ్యంలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌తో ఎలాంటి ఎన్నికల పొత్తుగానీ, ఒప్పందాన్నిగానీ చేసుకోరాదన్న ప్రత్యామ్నాయ రాజకీయ తీర్మానాన్ని కేంద్ర కమిటీ ఆమోదించింది. దాంతోపాటు పార్టీ కాంగ్రెస్‌లో రెండు తీర్మానాలనూ చర్చ కోసం ప్రవేశపట్టాలని కోరిన ఏచూరి చివరి ప్రయత్నాన్ని పొలిట్‌బ్యూరో తిరస్కరించింది. 1975లో పుచ్చలపల్లి సుందరయ్య రాజకీయపంథా మాదిరిగానే నేడు ఏచూరి ఎన్నికల పంథానూ సీపీఎం కేంద్ర కమిటీలోని మెజారిటీ తిరస్కరించింది. ప్రత్యామ్నాయ ముసాయిదా రాజకీయ తీర్మానాన్ని సీపీఎం కేంద్ర కమిటీ ఆమోదించడం ఆ పార్టీ చరిత్రలో ఇది రెండవసారి. 'నిరంకుశత్వ' పాలనగా కారత్ అభివర్ణించినా, ఫాసిస్టు పార్టీగా ఏచూరి అంచనా వేసినా, బీజేపీ మతవిద్వేష పాలనను వ్యతిరేకించడమే ఇద్దరి లక్ష్యం. ఏచూరిది పొత్తుల బాట, కారత్‌ది స్వతంత్ర బాట.

ఉదార ఆర్థిక విధానాలను అమలు చేయడంలో కేంద్రంలో ఇప్పుడు అధికార పక్షం ఎన్డీఏ కూటమికిగానీ, అంతకుముందు అధికారంలో ఉన్న యూపీఏ కూటమికిగానీ తేడా లేదని కేంద్ర కమిటీ తీర్మానించింది. ఉదార ఆర్థిక విధానాలను దూకుడుగా అమలు చేస్తున్న బీజేపీ హిందుత్వ ఎజెండాకు వ్యతిరేకంగా లౌకిక శక్తులన్నిటితో ఐక్యసంఘటన ఏర్పరచాల్సిన అవసరాన్ని రెండు ముసాయిదాలు గుర్తించినా కారత్ మద్దతుదారులు, కేరళ నాయకత్వ ఫాక్షన్‌కు ఆమోదయోగ్యంగా లేకపోవడం వల్ల పార్టీలో అంతర్గత సంక్షోభం పరాకాష్ఠకు చేరుకోనుందా? పార్టీలో గత కొన్నేళ్ళనుంచి కేరళ, పశ్చిమ బెంగాల్ సీపీఎం నాయకత్వ కేంద్రాలు/కూటముల మధ్య రాజకీయ పంథా విషయంలో పోటీ కొనసాగుతున్న విషయం విదితమే. అది కారత్, ఏచూరిల వ్యక్తిత్వాల మధ్య పోరాటంగా ముందుకు రావడం వెనుక అంతస్సారాన్ని అర్థంచేసుకోవాలి. సంకీర్ణ రాజకీయాల యుగం ప్రారంభమైనప్పటి నుంచి జాతీయ రాజకీయాలపై ప్రాంతీయ పార్టీల ప్రాబల్యం పెరిగినట్లే జాతీయ పార్టీల్లోనూ ప్రాంతీయ పార్టీలు నిర్ణయాత్మక పాత్ర పోషించే స్థాయికి ఎదిగాయి. అందుకు వామపక్షాలు కూడా మినహాయింపు కాదు. అధికారం కొనసాగినంత కాలం సీపీఎంలో పశ్చిమ బెంగాల్ శాఖ, దాని మద్దతుదారుల (కేరళ సీపీఎం నేత వీఎస్ అచ్యుతన్) పట్టుకొనసాగగా, అధికారం పోయిన తర్వాత క్రమంగా కేరళ శాఖలోని పినరయ్ విజయన్, దాని మద్దతుదారుల (ఉత్తరాదిన కారత్) ప్రాబల్యం పెరిగిందని విశ్లేషకుల అంచనా. ఈ రెండు అంతర్గత కూటములు తమ ప్రయోజనాలకు అనుగుణంగా ఎన్నికల పొత్తుపై బూర్జువా పార్టీ మద్దతు తీసుకోవాల్నా, వద్దా? అనే పరస్పర విరుద్ధ వైఖరులతో అంతర్గత పోరాటానికి సిద్ధమైనాయి.


ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ సమయంలో ప్రతిపక్షాలతో కలసి ఉద్యమించిన వామపక్షాలు ఆ తర్వాత జరిగిన సాధారణ ఎన్నికల్లో జనసంఘ్ (నేటి బీజేపీ) ఉన్న ప్రతి కూటమితో కలసి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోరాడాయి. ఆనాడు జనసంఘ్ వంటి మతతత్వశక్తులతో ఎన్నికల పొత్తుపెట్టుకోవడం సైద్ధాంతికంగా దివాళా తీయడమేనని సుందరయ్య తీవ్రంగా ఆక్షేపణ తెలిపారు. ఆనాడు పార్టీలోని సీనియర్లందరూ సుందరయ్య పంథాను పక్కన బెట్టారు. ఆ క్రమంలో కేంద్ర పెత్తనాన్ని ధిక్కరిస్తూ తెలుగునాట ఎన్టీఆర్ ప్రాంతీయాభిమానాన్ని సంఘటితం చేసి, ప్రభంజనంలా ముందుకు రావడాన్ని ఆహ్వానించడంతో వామపక్షాల ఎన్నికల పొత్తులు వేగం పుంజుకున్నాయి. 1992లో బాబ్రీ మసీదు విధ్వంసానంతర మత విద్వేషకాండల నేపథ్యంలో మొట్టమొదటగా 'కాంగ్రెస్, బీజేపీలు రెండూ ఒక్కటే' అనే విధానాన్ని విడిచిపెట్టి, కాంగ్రెస్‌తో ఎన్నికల పొత్తుకు సీపీఎం సిద్ధమైంది. 1990 తర్వాత సంకీర్ణ రాజకీయ యుగంలో కాంగ్రెస్ సారథ్యంలో యూపీఏ, బీజేపీ సారథ్యంలో ఎన్డీఏ ఎన్నికల కూటములు కేంద్రంలో అధికారం కోసం ప్రాంతీయ పార్టీలను బుజ్జగిస్తూ పోటీపడ్డాయి. లౌకికవాద పార్టీలతో పొత్తు పెట్టుకునే వైఖరితో కూడిన ఎత్తుగడలను వామపక్షాలు అనుసరించాయి. ఇన్నేళ్ల బూర్జువా పార్టీలతో ఎన్నికల పొత్తులు వామపక్షాల బలాన్ని పూర్తిగా పీల్చివేశాయి. జాతీయ రాజకీయాల్లో తమదంటూ ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకొని కొనసాగుతున్న వామపక్షాలు అనేక రాష్ట్రాల్లో నామమాత్రపు స్థాయిలో మిగలడం ఒక చారిత్రక విషాదం. పార్లమెంటరీ రాజకీయాల్లోనూ, వర్గపోరాటంలోనూ అనుసరించే ఐక్య సంఘటన ఎత్తుగడలు పార్టీ అస్తిత్వాన్ని బలోపేతంచేసే విధంగా ఉండాలే తప్ప మనబలాన్ని హరించే ఆత్మహనన పద్ధతులుగా ఉండకూడదు.

కాంగ్రెస్ మద్దతుతో 1996-98 మధ్యకాలంలో ఏర్పడిన థర్డ్ ఫ్రంట్ ప్రభుత్వ హయాంలో జ్యోతిబసును ప్రధానిగా ఎంపిక చేయాలన్న భాగస్వామ్య పక్షాల ప్రతిపాదన అప్పటి ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్ గట్టిగా వ్యతిరేకించడంతోనే వీగిపోయింది. ఆ అవకాశాన్ని జారవిడుచుకోవడం 'మహాపరాధం'అని జ్యోతిబసు ఒక ఇంటర్వ్యూలో బహిరంగంగా విమర్శించారు కూడా. ఒక ఐక్యసంఘటనలో బలమైన నిర్ణయాత్మకశక్తిగా లేకపోతే ఎంతో మంచి అవకాశాలుగా పైకి కనిపించేవన్నీ వాస్తవంలో స్వయం వినాశకాలుగా మిగులుతాయి. ఈ నేపథ్యంలో సైద్ధాంతిక వైఖరి దృష్ట్యా భారత్ అమెరికా పౌర అణు ఒప్పందం సందర్భంలో కూడా మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించడం సీపీఎం ఉనికిని నిలబెట్టింది. అయితే దేశవ్యాప్తంగా మతతత్వ శక్తులు విద్వేషకాండకు పాల్పడుతూ, వారికి కేంద్రం ప్రత్యక్షంగా, పరోక్షంగా అండదండలు అందిస్తున్న తరుణంలో లౌకికశక్తులన్నీ సంఘటితం కావలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇలాంటి చారిత్రక సందర్భంలో లౌకిక శక్తులతో ఎన్నికల పొత్తు పెట్టుకోకుండా తిరస్కరించడం ఎంత వరకు సబబని ప్రజాస్వామికవాదులు సీపీఎం ప్రస్తుత తీర్మానాన్ని విమర్శిస్తున్నారు. అలాగని అధికారం కోసం అన్ని అడ్డదారులు తొక్కి కుల, మత, ప్రాంత తదితర ఉద్వేగాల ప్రాతిపదికతో నడిచే సంస్థలతో సూత్ర రహితంగా పెట్టుకునే ఎన్నికల పొత్తుల వల్ల వామపక్షాలు కార్మిక వర్గ స్వభావాన్ని కోల్పోయి. ఇప్పుడున్న నామమాత్రపు ఉనికిని కూడా పోగొట్టుకుంటామని క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో బూర్జువా పార్టీలతో పొత్తురహిత ఎన్నికల ఎత్తుగడలు వామపక్షాల సోషలిస్టు స్వభావాన్ని నిలిపి ఉంచేందుకు, సామాజిక చారిత్రక కర్తవ్యాన్ని పరిపూర్తి చేయడానికి ఏ మేరకు ఉపకరిస్తాయో వేచి చూడాలి.

ఎడిట్ పేజీకి వ్యాసాలు, లేఖలు పంపేవారు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ రెండు ఫార్మాట్‌లలో పంపవలసిందిగా సూచన.
e-mail: manamlekhalu@gmail.com
చిరునామా : Manam Telugu Daily,
D.No. 6-3- 864/4/B, SBN Acrade 4th & 5th floor,
Green lands, opp. Green park Hotel,
Hyderabad, 500016, Telangana.



మంచిమాట



'శాంతి, సౌఖ్యం, విశ్రాంతి ఇవ్వలేని మతం కంటే ప్రకృతి ఆరాధనే ఉత్తమం.'


- విలియం వర్డ్స్‌వర్త్

అలసత్వానికి బాధ్యత ఎవరిది?

కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నాజూకు నగరాల బృహత్కార్యక్రమం (ఎస్.సి.ఎం) కింద నిధులు అందించనున్న మరో 10 నగరాల పేర్లను త్వరలో ప్రకటిస్తామని జనవరి 16న ప్రకటించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2015 జూన్ 25న ప్రారంభించిన ఈ కార్యక్రమం 2020 నాటికి దేశంలో 100 నాజూకు నగరాలను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకుంది. భారతీయ జనతా పార్టీ (బి.జె.పి) నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామిక కూటమి (ఎన్.డి.ఏ) ప్రభుత్వ కార్యక్రమాలలో ఇదొకటి. ఈ కార్యక్రమం కింద చేపట్టవలసిన పనులను అమలుచేసే నగరాలకు ఒక్కోదానికీ 500 కోట్ల రూపాయలు ఇస్తామని కేంద్రం వాగ్దానం చేసింది. దానితో సమానమైన మొత్తాన్ని అంటే మరో రూ. 500 కోట్లను ఆ నగరం ఏ రాష్ట్రంలో ఉందో ఆ రాష్ట్రప్రభుత్వం, సంబంధిత నగరపాలక సంస్థ సమకూర్చుకోవలసి ఉంటుంది. దాంతో దేశంలో చాలా నగరాలు కేంద్రం నిధులు చేజిక్కించుకునేందుకు ఎస్.సి.ఎంలో చేరాలని తహతహలాడుతున్నాయి. దేశంలో 2020 నాటికి 100 నగరాలలో సమర్థమైన మౌలిక వసతులు కల్పించాలన్నది ఈ స్మార్ట్ సిటీ కార్యక్రమం లక్ష్యం. హైస్పీడు ఇంటర్‌నెట్, అవిచ్ఛిన్నంగా విద్యుత్ సరఫరా, నిరంతరాయ నీటి సరఫరా, ఆధునిక ఆరోగ్య రక్షణ, మెరుగైన విద్య, ఎలక్ట్రానిక్ పరిపాలన, సుఖకరమైన ప్రజా రవాణా సదుపాయాలతో నగరాలను ఆధునికీకరించడం, జీవన ప్రమాణాలు ఐరోపా ఖండ దేశాలతో సమానంగా ఉన్నాయని అనిపించుకునేట్లు చేయడం ఈ కార్యక్రమ ఆశయం. అలా ఆశపడడంలో తప్పులేదుకానీ, ఈ కార్యక్రమం అమలులో ఎదురవుతున్న సవాళ్ళను సమీక్షించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. భారతదేశంలోని పట్టణ ప్రాంతాల సమస్యలను పరిష్కరించడానికి కేవలం టెక్నాలజీని అనుసరించడం ఒక్కటే సరిపోకపోవచ్చు.

ఈ కార్యక్రమం అమలులో నగర పాలనకు సంబంధించిన రెండు అధికార వ్యవస్థల మధ్య ఘర్షణ తలెత్తుతోందన్నది ప్రధాన విమర్శలలో ఒకటని నగర ప్రణాళికా వేత్తలు చెబుతున్నారు. వసతులు కల్పించవలసిన బాధ్యత ఉన్న నగర పాలక సంస్థలు ఉన్నాయి. అవి కాక, ఈ కార్యక్రమం కింద పనులు నిర్వహించడానికి ప్రత్యేక కర్తవ్య నిర్వహణ సంస్థలు (ఎస్.పి.విలు) ఉన్నాయి. అవి తప్పనిసరిగా ఉండాల్సిన ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు. ప్రైవేటు వనరుల నుంచి నిధులు సమీకరించడంలో ఎస్.పి.వి.లు నగర పాలక సంస్థలకు తోడ్పడితే ఆదర్శనీయంగా ఉంటుంది. కానీ, అవి తరచు స్థానిక స్వపరిపాలనా సూత్రాలకు విరుద్ధంగా నడచుకుంటున్నాయని నాజూకు నగరాలలో కొన్నింటిలోని కార్పొరేటర్లు వాదిస్తున్నారు. ఎస్.పి.వి.లతో కలసి పనిచేయడానికి పురపాలక సంస్థలు వెనుకాడుతున్నాయి. తమ విధులు, అధికారాల పరిధిలోకి అవి చొచ్చుకువస్తాయేమోనని వాటి భయం.

ఈ బృహత్కార్యక్రమానికి సమ్మిళిత స్వభావం లేదన్నది విమర్శకుల మరో వాదన. పౌరుల సంప్రదింపుల ప్రకియలో ప్రజల భాగస్వామ్యం కొరవడడం గురించి వారు ప్రస్తావిస్తున్నారు. సంప్రదింపులు నిర్వహించిన చోట కూడా, కొన్ని నగరాలు పౌరుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు సోషల్ మీడియాపై, టెలికాంపై ఎక్కువగా ఆధారపడ్డాయి. ఓ మోస్తరు అక్షరాస్యులై ఉండి, టెక్నాలజీ అందుబాటులో ఉన్నవారు మాత్రమే దానిలో పాల్గొనగలుగుతారని వేరే చెప్పనక్కరలేదు. దీనివల్ల సమాజంలోని అట్టడుగువర్గాల గొంతుకలు వినిపించకపోయే అవకాశం ఉంది. ఇండోర్, భువనేశ్వర్, ఢిల్లీ, కొచ్చిలలో మురికివాడల నుంచి ప్రజలను ఖాళీ చేయించడం వివాదాస్పదంగా మారింది. పేద మహిళలు, మైనారిటీలు, నగరాలకు వలస వచ్చిన వారు సహా బడుగు వర్గాల అవసరాలను ఈ కార్యక్రమం తీరుస్తుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రపంచంలోని అత్యంత కాలుష్య నగరాలలో సగం భారతదేశంలోనే ఉన్నాయి. నగరాల్లో నివసిస్తున్న ప్రతి ఆరుగురిలో ఒకరు సరైన సదుపాయాలు లేని చోట (మురికివాడ అనుకోవచ్చు) తలదాచుకుంటున్నారు. భారతదేశ నగర జనాభాలో మూడో వంతు మందికి కొళాయి నీరు అందుబాటులో లేదు. నగర భారతీయుల్లో 84 శాతం మందికి మరుగుదొడ్డి సదుపాయం లేదు. ఇవి ఢిల్లీ కేంద్రంగా చేసుకుని పనిచేస్తున్న ఒక స్వచ్ఛంద సంస్థ అధ్యయనంలో తేలిన విషయాలు. మన దేశంలో పట్టణాలు, నగరాల్లో ఫుట్‌పాత్‌లపైన, దుకాణాలు మూసిన తర్వాత వాటి చూరుల కింద నిద్రపోయేవారిని చాలా మందినే చూస్తూంటాం. ఈ నిరాశ్రయులను, పేదరికాన్ని, నగరాలలో పేదలను దృష్టిలో పెట్టుకుని, భారతదేశ స్థితిగతులకు తగ్గట్లుగా నాజూకు నగరాన్ని నిర్వచించుకోవాల్సిన అవసరం ఉంది. స్మార్ట్ సిటీల కార్యక్రమం విజయవంతం కావాలంటే, దానిలో పౌరులు, స్థానిక పాలనా సంస్థల అభిప్రాయాలను ఎక్కువగా ఇముడ్చుకోవాలి.



Rajesh

కేంద్రం ఇస్తున్న నిధులు అందిపుచ్చుకుని నగరాల్లో సదుపాయాలను మెరుగుపరచుకుందామనే వివేకం ఇటు నగరపాలక సంస్థలలోనూ కనిపించడం లేదు. వాటిలో ఉపేక్షా భావం రాజ్యమేలుతోంది. నాజూకు నగరానికి ఎంపికైన 90 నగరాలలో చాలా నగరాలు వాటికిచ్చిన నిధులను వెచ్చించనే లేదు. కేంద్రం ఈ కార్యక్రమం అమలుకు తనవంతు వాటాగా 2015-16 నుంచి రూ. 9,824 కోట్లను విడుదల చేసింది. కానీ, కేంద్ర నిధులలో అత్యధిక భాగం రాష్ట్రప్రభుత్వాల వద్ద ఖాళీగా పడి ఉన్నాయి. కార్యక్రమం అమలుకు ప్రతి నగరంలోను ఏర్పాటైన స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్.పి.వి)లు ఆ నిధులను మరింత వడ్డీ గడించే విధంగా, 'స్వీపింగ్' ఖాతాలలో పెడుతున్నట్లు తేలింది. 'స్వీపింగ్' ఖాతాలలో జమ చేసిన నగదు నిర్దిష్ట పరిమితిని దాటితే, ఆ మిగులు మొత్తం హెచ్చు వడ్డీ గడించిపెట్టే ఫిక్స్‌డ్ డిపాజిట్ వంటి మదుపు సాధనాలలోకి మళ్ళుతుంది. చాలా నగరాల్లో పనులు ఏమంత ముందుకు సాగలేదు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డి.పి.ఆర్)లు తయారు చేయడం, టెండర్లను ఆహ్వానించడం వంటి సన్నాహక పనులు మాత్రమే పూర్తయ్యాయి. పనులు వేగవంతం అయ్యేట్లు చూడవలసిందని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖకు 2017 సెప్టెంబర్ 13న ఒక లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ వంతువి లేదా కేంద్రం వాటావి చాలా నగరాల్లో ఎస్.పి.వి.లకు బదలీ చేయలేదని గృహ నిర్మాణ శాఖ సమీక్షలో తేలింది. ఫరీదాబాద్, ఉదయపూర్, జబల్పూర్ వంటి కొన్ని నగరాలను మాత్రం ఇందుకు మినహాయింపుగా చెప్పాలి. కేంద్రం రూ. 9,824 కోట్లు విడుదల చేస్తే వాటిలో రూ. 1797 కోట్లు ఎస్.పి.వి.ల ఖాతాలలోనే ఉన్నాయని పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టం (పి.ఎఫ్.ఎం.ఎస్) 2017 అక్టోబర్ 4 నాటి పరిస్థితిని వివరించింది. ఇది ఎలక్ట్రానిక్ ఫండ్ ట్రాకింగ్ యంత్రాంగం. కేంద్రం ఏర్పాటు చేసి న పి.ఎఫ్.ఎం.ఎస్. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలకు వచ్చిన నిధుల వ్యయ స్థితిగతులపై తక్షణ సమాచారాన్ని అందిస్తూ ఉంటుంది. స్మార్ట్ సిటీలలోని ఎస్.పి.వి.లు పి.ఎఫ్.ఎం.ఎస్ లో తప్పనిసరిగా రిజిస్టరు చేసుకోవాలి. తాజా సమాచారం ప్రకారం, 58 ఎస్.పి.వి.లు మాత్రమే పి.ఎఫ్.ఎం.ఎస్ వద్ద రిజిస్టరయ్యాయి. ఈ అల సత్వానికి ఎవరిని నిందించాలో పౌరులే తేల్చుకోవాలి. ఎక్కడో ఉన్నవారి ని కాక, స్థానిక ప్రజా ప్రతినిధులను ధైర్యంగా నిలదీయగలిగితేనే ప్రజాస్వామ్యంలో పనులు కొద్దిగానన్నా ముందుకు సాగుతాయి.

> స్మార్ట్ సిటీలలోని ఎస్.పి.వి.లు పి.ఎఫ్.ఎం.ఎస్ లో తప్పనిసరిగా రిజిస్టరు చేసుకోవాలి. తాజా సమాచారం ప్రకారం, 58 ఎస్.పి.వి.లు మాత్రమే పి.ఎఫ్.ఎం.ఎస్ వద్ద రిజిస్టరయ్యాయి. ఈ అలసత్వానికి ఎవరిని నిందించాలో పౌరులే తేల్చుకోవాలి. ఎక్కడో ఉన్నవారిని కాక, స్థానిక ప్రజా ప్రతినిధులను ధైర్యంగా నిలదీయగలిగితేనే ప్రజాస్వామ్యంలో పనులు కొద్దిగానన్నా ముందుకు సాగుతాయి.

◆ మల్లంపల్లి ధూర్జటి

పర్యావరణాన్ని పరిరక్షించండి

దేశంలో సంస్కృతి ఆచార వ్యవహారాలన్నీ పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని సమాజ ఆరోగ్యాన్ని కలుషితం చేస్తున్నాయి. నది వ్యవస్థ నాగరికత మూలాలకు చిరునామా. ఒకనాటి ప్రజల ఆచార వ్యవహారాలు సంప్రదాయాలు, పోరాటాలను వ్యక్తి ఆరా ధన రూపంలో దైవంశ సంభూతుడిగా నిలబెట్టడం జరిగింది. దానిని కొంతమంది స్వార్థపరులు వ్యవస్థీకృతం చేయడంతో ప్రపంచ వ్యాప్తంగా రోజురోజుకు పర్యావరణం క్షీణించి మనిషి బతకడం దుర్భరంగా తయారైంది. ఒకనాటి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ఈ ప్రపంచీకరణలో పెట్టుబడిదారీ విధా నం వ్యాపారంగా మార్చింది. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపకుండా, వారి విశ్వాసం ఇంకా మూర్ఖంగా ముందు కు తీసుకెళ్లే ప్రయత్నాల్లో భాగంగా దేశ ప్రాచీన చరిత్రలో జాతర ప్రస్థావన ఆది సభాపర్వాల్లో వివరించబడ్డాయి. ఒకనాటి స్థానిక సంస్కృతులు, చరిత్రలు ఒక పండుగలా మొదట జాతర రూపంలో వచ్చాయి. నిజాం, కొమరంభీం, సహజ వనరుల విధ్వాంసాన్ని అడ్డుకొన్నందుకు పర్యావరణ రక్షణ అడ్డుకున్నందుకు నిర్దాక్షిణంగా చంపించి తరువాత ఐటీడీఏ లు ఏర్పరచిన కుట్రలో దాగివున్న అంశం ఇవాళ పర్యావరణాన్ని పాడు చేచడానికి కారణంగా నిలుస్తోంది. 1770 వరకు హైదరాబాద్ హుస్సేన్‌సాగర్ ప్రశాంతంగా ఉండేది. తరువాత వ్యక్తిగత విశ్వాసమైన మతాన్ని సామూహికం చేయడం వల్ల హుస్సేన్‌సాగర్ ఈ రోజు పనికి రాకుండా తయారైంది. కాబట్టి పర్యావరణం విధ్వంసం అవసరమైతే ఏ దేవుడైనా, ఏ మతమైనా చెప్పింది ఒకటి మానవసేవే మాధవసేవ అనే! పర్యా వరణాన్ని రక్షిస్తే దేవుడు నిన్ను రక్షిస్తాడు. అందుకు మన మందరం కలిసి నదులు, సరస్సులు, గుట్టలు, చెట్లను కాపాడాలి. పర్యావరణం క్షీణించడం వల్ల కింది జీవులన్నీ కుప్ప కూలిపోతే మనిషి కూడా కుప్పకూలిపోతాడు. అందువల్ల పర్యావరణాన్ని రక్షించండి... భావితరాలకు భవిష్యత్‌ను ఇవ్వండి.

- ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి
9908240768

మన లేఖలు

రాచకొండ వారోత్సవాలు నిర్వహించాలి

హైదరాబాద్‌కు అత్యంత సమీపంలో యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి జిల్లాల సరిహద్దుల్లో సంస్థాన్ నారాయణపురం మండలంలో ఉన్న రాచకొంచ గుట్టలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. యాంత్రిక జీవనానికి, కాలుష్యానికి దూరంగా విశ్రాంతిగా గడపాలనుకునే వారికి చక్కటి విడిది రాచకొండ. చుట్టూ ఉన్న గుట్టల మధ్య ప్రయాణిస్తే ఇక్కడి ప్రకృతి సౌందర్యం ఆహ్లాదం కలిగిస్తాయి. కొండలపై నుంచి జాలువారే చిన్నచిన్న జలపాతాలు, సెలయేర్లు, కోనేర్లు కనువిందు చేస్తాయి. హరిత వర్ణాన్ని కప్పుకున్న కొండలు, పక్షులు కిలకిలరాగాలు, వన్యప్రాణుల అరుపులు ఆనంద డోలికల్లో ముం చెత్తుతాయి. గత చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన రాచకొండ కోట ముఖద్వారం స్వాగతం పలుకుతుంది. గత చరిత్రలోకి మనల్ని లాక్కెళ్తుంది. బలిష్టమైన బండరాళ్లతో శత్రు దుర్భేధ్యంగా నిర్మించిన ప్రాకారాలు ఆనాటి రక్షణ వ్యవస్థను మన కళ్లముందుంచుతుంది. ఆ కొండ చుట్టూ దుర్భేధ్యమైన బలిష్ఠ ప్రాకారం మధ్యమధ్య ఎత్తయిన బురుజులు వాటిపై పేల్చడానికి సిద్ధంగా ఉన్న ఫిరంగుల అమరికలు కన్పిస్తాయి. వాటి చుట్టూ ఆరు (6) సింహద్వారాలు దాటితే కొండపైకి చేరవచ్చు. ఈ కొండపైనే మండపాలు రాజప్రసాదాలు, తటకాలు, జలాశయాలు కన్పిస్తాయి. రెండు పెద్ద బండరాళ్ల చీలిక మధ్య సంకెళ్లబావి ఉంది. అందులో అన్ని కాలాల్లో నీళ్లు ఉండడం విశేషం. కాకతీయ రాజ్య పతనానంతరం రేచర్ల పద్మనాయకుల పాలన రాచకొండ కేంద్రంగా సుమారు 110 ఏళ్లు కొనసాగింది. వారు 1361లో ఆమనగల్లు నుంచి రాజధానిని రాచకొండకు మార్చా రు. నేటి తెలంగాణ అంతటికీ తమ రాజ్యాన్ని విస్తరించారు. రేచర్ల పద్మనాయకుల వంశీయులైన ఆనపోత నాయుడు 1361 నుంచి 1384 వరకు రాచకొండను పాలించాడు. అతడి కాలంలోనే ఈ దుర్గాన్ని నిర్మించాడు. కొంతకాలం తర్వాత బహ్మనీ సుల్తానుల ధాటికి రాచకొండ రాజ్యం పతనమైంది. నేటికీ ఆనాటి రాచరిక అవశేషాలు విధ్వంసపు చిహ్నాలు రాచకొండను దర్శించే పర్యాటకులకు స్పష్టంగా కనిపిస్తాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా తానే రాచకొండ ప్రాంతాన్ని సందర్శించి కనుమరుగవుతున్న రాచకొండ చరిత్రకు పూర్వవైభవం తీసుకురావాలని సంకల్పించి రాచకొండ ప్రాంతాన్ని నిత్యం ప్రజలందరు స్మరించుకునే విధంగా దేశంలోనే అత్యంత పెద్ద కమిషనరేట్‌ను ఏర్పాటుచేసి దానికి రాచకొండ కమిషనరేట్‌గా నామకరణం చేశారు. అయితే రాచకొండ చరిత్రను ఇప్పటి విద్యార్థులకు, యువతకు, రాష్ట్ర ప్రజలందరికీ తెలియజేసేందుకు ఈ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ కృషితో ప్రభుత్వ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో 2017లో మూడు లక్షల రూపాయలతో 'రాచకొండ వారోత్సావాలు' వారం రోజుల పాటు నిర్వహించారు. స్థానిక 'రాచప్ప' స్వచ్ఛంద సంస్థ పూర్తిగా సహరించారు. అయితే రాచకొండ ప్రాంత విశిష్టతను, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని 150 పైచిలుకు దేవాలయాలు, నిత్యం వందల సంఖ్యలో స్మరించుకునే శివాలయం, ప్రతియేటా శివరాత్రికి జరిగే గాలిసాబ్ ఉర్స్ ఉత్సవాలు ఇలా రాచకొండ ప్రాంత చరిత్రను తెలియజేసేందుకు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం 'రాచకొండ వారోత్సవాలను' నిర్వహించాలి, పర్యాటకశాఖ ఆధ్వర్యంలో స్థానికులకు భాగస్వామ్యం కలిస్తూ అధికారికంగా కమిటీని నియమించాలని ఈ ప్రాంత గిరిజనుల, సంస్థాన్ నారాయణ పురం మండల ప్రజలు కోరుకుంటున్నారు.

- గుండమల్ల సతీష్‌కుమార్
సంస్థాన్ నారాయణపురం
9493155522

వివక్షను పెంచిన అసమతుల్యత

మన సమాజంలో పుట్టుకకు ముందే వివక్షకు గురయ్యేది ఆడపిల్లే. అందుకే ఎవరేనా ఆడపిల్ల ఆడపిల్లే కానీ ఈడపిల్ల కాదను కుంటారు. అదే వివక్షకు ప్రత్యేక కారణం. ఏనాటికైనా అత్తవారింటికి వెళ్లిపోయేదే కదా ! అనే చిన్నచూపు మరొక కారణం. సమాజ ఆలో చనా పరిణామ క్రమంలో కుటుంబ వ్యవస్థలో ఆడపిల్ల పుడితే అభద్రతకు దారితీస్తుందనుకునే కన్నతండ్రులెంతో మంది ఉన్నారు. అలా అని కూతుర్ని దగ్గరకు తీసుకోని వారుంటారని కాదు. అమ్మాయి పుట్టిందంటే ముఖం మాడ్చుకునేవారూ ఉన్నారు. మా ఇంటి మహాలక్ష్మి పుట్టిందని సంబరపడిపోయే వారూ ఉంటారు. సమాజ కుటుంబ వ్యవస్థ ఆలోచనల్లో ఉన్న హెచ్చుతగ్గులు అమ్మాయి, అబ్బాయి విషయం లోనూ కనబడ్తాయి. ఆడపిల్ల పుడితే ఈ సమాజంలో అభద్రతాభావం వల్ల నిత్యం సమస్యలేనని భావించే తల్లితండ్రులు లేకపోలేదు. ఆడపిల్లకు జన్మనిచ్చిందని భార్యను నిలువునా కాల్చేసి చంపిన దురదృష్ట ఘటనలూ తెలుసు. ఈ నేపథ్యంలో లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని ప్రభుత్వాలు శాసనాలు చేశా యి. ఏ ఆసుపత్రిలో చూసినా లింగ నిర్ధారణ కోసం గర్భిణులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు నిషేధమంటూ హెచ్చరిక బోర్డులు కనిపిస్తాయి. కేవలం తల్లి ప్రాణాలకు గండమని తెలిస్తేనే అబార్షన్‌లకు ప్రభుత్వం అనుమతిస్తుంది. సామాజిక సమతుల్యత కోసం స్త్రీ, పురుష సమాన నిష్పత్తికై ప్రజలు కూడా తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించాల్సిన బాధ్యత తీసుకోవాలి. ఏటా దేశంలో 7.5 లక్షల మంది ఆడపిల్లలు గర్భస్థ పిండ దశలోనే చంప బడుతున్నారు. 2001 జనాభా లెక్కల ప్రకారం ప్రతి 1000 మందికి 927 మంది స్త్రీలున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం చూస్తే అభివృద్ధి చెందు తున్న చిన్న దేశాల కంటే మన దేశంలో బాలికల నిష్పత్తి తక్కువగా ఉండటంపై ప్రభుత్వాలు దృష్టిపెట్టాయి. ప్రతి వెయ్యిమంది మగ పిల్లలకు శ్రీలంక (1034), నేపాల్ (1014), అమెరికా (1025), ఇండోనేసియా(988), పాకిస్తాన్ (943), బంగ్లాదేశ్ (978) బాలి కలున్నా రు. ఈ లెక్కన పెళ్లి కొడుకులకు వధువులు కరువయ్యే రోజులొస్తున్నాయన్న మాటే. మానవాళి మనుగడకు ఉత్పత్తికి ఆడదే మూలాధారం. ఢిల్లీలో ప్రతి 1000 మందికి 850 మంది స్త్రీలున్నారు. ఆధునిక సమాజంలో జనజీవన వైవిద్యాలు నానాటికీ కొత్తపుంతలు తొక్కుతున్నా ఆడపిల్లల జన్మకు శాపనార్థాలుగా ఉన్న అంశాలపై ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరించాలి. మగపిల్లల కన్నా ఆడపిల్లలు తమ ప్రతిభా పాటవాలలో ముందడుగువేస్తున్నారు. వంటింట్లో ఉన్నా, నట్టింట్లో ఉన్నా, ఇంటి పనుల్లో మునిగి తేలుతున్నా చదువుల్లో అత్యున్నతస్థాయి నందుకుంటున్నది ఆడవారే. ఈ విషయాన్ని గమనించి మార్పులు తీసుకురావల్సిన అవసరం సమాజం మీద ఉంది. ఇలాంటి అవసరాలను నొక్కి చెబుతూ 2009 జనవరి 24న జాతీయ ఆడపిల్లల దినోత్సవం తొలిసారిగా నిర్వహించారు. ఒకప్పుడు మగపిల్లాడంటే 'ప్లస్' గానూ, ఆడపిల్లంటే మైనస్ గానూ చెప్పుకునేవారు. ఇపుడైతే అలాంటి భావన రానురాను దూరమవడం స్వాగతించదగిన పరిణామం. ఇలాంటి భావన ఆడవారిలోనుంచి పూర్తిగా తుడిచి పెట్టినపుడే సమాజం కొత్త దారిలో పయనిస్తుంది. ఇలా ఆధునిక సమాజానికి బాటలు వేద్దాం.



◆ వరిగొండ కాశీ విశ్వేశ్వర రావు

(నేడు జాతీయ ఆడపిల్లల దినోత్సవం)



పదం

'సెక్స్', 'సెక్సువాలిటీ', 'జెండర్ డిస్క్రిమినేషన్' (లైంగిక వివక్ష), సెక్సువల్ డిస్క్రిమినేషన్ (శృంగారపరమైన వివక్ష) అనే పదాల్ని దాదాపు ఒకే అర్థంతో ఉపయోగించడం సర్వసాధారణమై పోయింది. కానీ సెక్సువల్ డిస్క్రిమినేషన్ అనే పదమే తప్పని, ప్రకృతి సహజమైన లైంగిక వేధింపుల్ని మాత్రమే సెక్సువల్ డిస్క్రిమినేషన్ అని భావించవచ్చునని నిపుణులు అంటున్నారు. నిజానికి సెక్సువల్ డిస్క్రిమినేషన్ అనేది ఉండదని, సెక్సువల్ హరాజ్‌మెంట్ (వేధింపులు) సరైన పదమని వారు వివరిస్తున్నారు. జెండర్ డిస్క్రిమినేషన్‌లో వ్యక్తి లైంగికత ఆధారంగా జరిగే వివక్ష గురించి మాట్లాడతారు.

పథం

ఒక నైతికపరమైన జీవిగా కంటే ఒక లైంగికపరమైన జీవిగా మనిషిని గుర్తించడమే అర్థవంతమైంది.

– హెన్రీ మిల్లర్,
అమెరికన్ రచయిత



నగ్న 'సత్యం'?



రామ్‌గోపాల్ వర్మ 'జిఎస్‌టి' అంటూ మరో సంచలనానికి తెరతీశారు. ఇదేమీ మోడీ మార్కు జిఎస్‌టి కాదు, ఇది వేరే జిఎస్‌టి... 'గాడ్, సెక్స్ అండ్ ట్రూత్' అనే నీలిచిత్రాన్ని ఈసారి వర్మ మనకు అనుగ్రహించారు. ఈ చిత్రంలో మియా మల్కొవా అనే ప్రఖ్యాత అమెరికన్ పోర్న్‌స్టార్ లైంగికత గురించి, శృంగారం గురించి తన భావనల్ని ప్రేక్షకులతో పంచుకుంటుంది. నగ్నంగా మియా మల్కొవా కూర్చున్న పోస్టర్‌ను విడుదల చేశారు. దాంతో నిప్పు రాజుకుంది. భారతీయ సంస్కృతికి పట్టిన గ్రహణాన్ని పారద్రోలేందుకు సంప్రదాయవాదులు ఓవైపు కత్తులు నూరుతుంటే, దీని ద్వారా ఆర్‌జివి సమాజానికి ఏం సందేశాన్ని ఇస్తున్నారంటూ మరోవైపు మేధావులు, ఉద్యమకారులు కన్నెర్ర చేస్తున్నారు. కోరికల్ని అణచుకుని అల్లాడుతున్న భారతీయ శృంగార కరవు పీడితులకు ఇదొక వరంలాంటిదని భావిస్తున్న వారు కూడా ఉన్నారు. 'పోర్న్'ని మనం అశ్లీల చిత్రాలు అని పిలుస్తుంటాం. కానీ అదేమీ అశ్లీలం కాదని, సహజమైన లైంగిక వాంఛను ఇంతలా అవమానించడం అజ్ఞానం అని వర్మ ఉవాచ. 'పోర్న్' అనే మాట ఆర్‌జీవీ నాలుక మీదికి వచ్చిందో, లేదో ప్రసారమాధ్యమాలు మరో కొత్త 'పండుగ'కి తెరతీశాయి. రామ్‌గోపాల్ వర్మ ఓపిగ్గా ఉద్యమకారుల్ని, వారి అజ్ఞానాన్ని ఉతికి ఆరేస్తున్నారు. అదే సమయంలో ప్రగతిశీలవాదులు, మహిళోద్యమకారులు కూడా వర్మకు దీటైన జవాబు చెబుతున్నారు. వెరసి ఈ చర్చ అంతా 'పోర్న్', దాని తాలూకు మంచి, చెడుల గురించిన వివరాల చుట్టూ తిరుగుతోంది. రామ్‌గోపాల్ వర్మ 'జిఎస్‌టి'ని సమర్థిస్తూ కొందరు, వ్యతిరేకిస్తూ మరి కొందరు.... వీరందరి అభిప్రాయాల్ని ఇవాళ **'ముద్ర'** మీ ముందుకు తెస్తోంది.

తూణీరం

అశ్లీలం కాదు!

సురేంద్రరాజు, కవి, విమర్శకుడు, సీనియర్ జర్నలిస్టు



ముద్ర: రామ్‌గోపాల్ వర్మ తాజాగా విడుదల చేయబోతున్న 'గాడ్, సెక్స్ అండ్ ట్రూత్' చిత్రంలో ఆయన చూపించబోతున్న నగ్నత్వాన్ని అశ్లీలతగా భావించవచ్చా?

సురేంద్ర రాజు: అది అశ్లీలత కాదు. ఈ సినిమాపై జరుగుతున్న రగడంతా వామపక్ష 'నీతిమంతుల' గొడవ మాత్రమే. రామ్‌గోపాల్ వర్మ తన సినిమాలో అసహజమైనదేదీ చూపించడం లేదు. సెక్స్ అనేది చాలా సహజమైంది. సినిమాలో పోర్న్‌స్టార్ మియా మల్కొవాను మాత్రమే చూపించే వీలు లేదు. ఆమెతో పాటు పురుషుణ్ణి కూడా చూపించాలి కదా! పురుషుణ్ణి చూపించకుండా ఇలాంటి సినిమా తీయడం సాధ్యం కాదు. అలాంటపుడు ఈ గొడవంతా దేనికి? అది సహజమైన ఒక ప్రక్రియను అభినయించి చూపడమే అవుతుంది. ఇవాళ రామ్ గోపాల్ వర్మ సినిమా మీద జరుగుతున్న గొడవకు మూలాలు ఈ దేశంలోకి క్రిస్టియన్ భావజాలాన్ని దింపిన అలనాటి సంస్కర్తల పుణ్యమే! అదంతా ఆర్ఎస్ఎస్ భావజాలమే. సెక్సువాలిటీని ప్రాచీన భారతదేశం ఎన్నడూ కించపరచలేదు. ఆ గొడవంతా క్రిస్టియానిటీకి సంబంధించింది. ఆర్‌జీవీ ప్రయత్నం మంచిదే! గ్రామీణ భారతీయులు లైంగిక పరమైన విషయాల పట్ల పూర్తి అవగాహనతోటే ఉన్నారు. సెక్స్‌స్టార్వ్‌డ్ భారతీయులకు రామ్‌గోపాల్ వర్మలాంటి వాళ్ళు కొంత ఉపకారమే చేస్తున్నారని భావించాలి.

నేరస్వభావానికి కారణం కాదు

కత్తిమహేష్, చలనచిత్ర విమర్శకుడు



ముద్ర: మహిళలు, ట్రాన్స్‌జెండర్లు వంటి వారు సామాజికంగా లైంగికపరమైన అణచివేతకు గురవుతున్న ప్రస్తుత తరుణంలో ఇలాంటి వారి జీవితాల్ని 'పోర్న్' (అశ్లీల చిత్రాలు) ఏ విధంగా ప్రభావితం చేస్తుంది?

కత్తి మహేష్: పోర్న్‌కు, నేరస్వభావానికి ఎలాంటి సంబంధం లేదు. సంబంధం ఉందన్న భావన ఇంతవరకు నిరూపితం కాలేదు. అసలే కోరికల్ని అణచుకుని బతకాల్సిన సమాజంలో పోర్న్ వల్ల కొందరికైనా కాసింత మేలు జరుగుతుందనే చెప్పాలి. నిజానికి మహిళలు ఎక్కువగా నీలిచిత్రాల్ని చూస్తున్నట్టు తెలుస్తోంది. మహిళలు, ఇతర వర్గాల మీద అణచివేత అన్నది పోర్న్ ఈ ప్రపంచానికి పరిచయం కాక ముందు కూడా ఉంది. ఏదైనా నేరం జరిగిందీ అంటే అది సినిమాలు, టీవీలు, మరేదో చూసే చేశారనుకోవడం సరికాదు. అదంతా సామాజిక ఒత్తిడి ఫలితమే. నిజానికి పోర్న్ వల్ల సమాజానికి కొంతమేరకైనా ఒక విశాల దృక్పథాన్ని అలవరిచే అవకాశం ఉంటుంది.

ఆయనకు స్పష్టత ఉంది

వేణు ఊడుగుల, చలనచిత్ర దర్శకుడు (నీదీ, నాదీ ఒకే కథ)



ముద్ర: నగ్నత్వానికి, అశ్లీలతకు మధ్య ఉన్న సన్నటిరేఖను రామ్‌గోపాల్ వర్మ ఏ మేరకు అర్థం చేసుకున్నారని మీరు భావిస్తున్నారు?

వేణు ఊడుగుల: అశ్లీలత, నగ్నత్వం అనే వాటికి నిర్వచనాలు వ్యక్తిగత దృక్కోణాన్ని బట్టి ఉంటాయి. ఆర్‌జీవీ విషయానికి వస్తే ఆయన మీడియాను వాడుకుంటున్నారు, మీడియా ఆయనను వాడుకుంటోంది. నిజానికి ఓపెన్ ఫోరమ్‌లో బోలెడంత పోర్న్ (నీలిచిత్రాలు) అందుబాటులో ఉంది. ఆయన తీసే 20 నిమిషాల సినిమాలో చెప్పడానికి ఎక్కువ ఏమీ ఉండదు. సాధారణంగా ఆర్‌జీవీ తన సినిమాల్లో ఏ విషయాన్నీ పూర్తిగా ఎక్స్‌ప్లోర్ చేయరు. దేని గురించీ లోతైన విశ్లేషణ ఉండదు. ఆయన తన జిఎస్‌టి సినిమాలో అందమైన కొటేషన్లు చెప్పారు, మియా మల్కొవా తన లైంగికత గురించి, అందం గురించి చెప్పి ఉండవచ్చు. ఆమె దాన్ని అందంగానే చెప్పి ఉంటుంది. ఆర్‌జీవీకి స్పష్టత ఉంది. ఆయనకి అన్నీ తెలుసు. ఇతర మాధ్యమాల్లో పోర్న్ అందుబాటులో ఉన్నప్పుడు, ఈ సినిమా ఒక్కటే పోర్న్ అనుకోవడం, దాని వల్ల ఏదో పెద్ద నష్టం జరిగి పోతుందని బాధ పడడం అనవసరం. దేవాలయాల మీద బూతు బొమ్మల్ని సెక్స్ ఎడ్యుకేషన్‌గా భావించినపుడు, ఈ సినిమాని కూడా సెక్స్ ఎడ్యుకేషన్‌గా ఎందుకు భావించకూడదు? మహిళల్ని కించపరచడాన్ని ఎవరూ హర్షించరు. దీన్ని వ్యతిరేకిస్తున్న స్త్రీలకి కూడా తెలుసు, అందులో ఆందోళన పడాల్సినంత ప్రమాదమేమీ లేదని, కానీ వాళ్ళు కూడా హిపోక్రాటిక్‌గా ఉండితీరాల్సిన అగత్యంలో పడి ఇలా మాట్లాడుతున్నారు.

అందం మానసికమైంది

కె. కాత్యాయని విద్మహే, సాహిత్య పరిశోధకురాలు, కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి గ్రహీత



ముద్ర: తాను నగ్నత్వాన్ని కళాత్మకంగా కాకుండా, పోర్న్ (అశ్లీలం)గానే చూపించానని చెబుతున్నారు ఆర్‌జీవీ. మహిళల జీవితం మీద పోర్న్ ప్రభావం ఎలా ఉంటుంది? అందం అనేది కేవలం స్త్రీ శరీరానికి మాత్రమే సంబంధించిందా?

కాత్యాయని విద్మహే: కాదు, అందాన్ని మంచి కార్యక్రమాల్లో, పిల్లల్లో, సందర్భాల్లో చూస్తాం. అందం భౌతికం మాత్రమే కాదు. అది మానసికం. నాకు కాళోజీ ఎన్నో సార్లు అందంగా కనిపించేవారు. తాను అనుకున్నది మాట్లాడడం, ఏ కష్టానికైనా నేను ఉన్నానని అందరికీ అండగా నిలవడం వంటివి ఆయనలో కనిపించే అందం. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర చేసినపుడు ఎంతో అందంగా కనిపించారు. రైతులతో, సమస్యల్లో ఉన్న వాళ్ళతో మాట్లాడడం ఆ సందర్భంలో ఆయనలో కనిపించిన అందం. అయితే పదవిని చేపట్టాక ఆయన అందంగా కనిపించలేదు. మానవీయ సందర్భాలు, విలువలతో కూడిన సందర్భాలు వంటివి అందరినీ దగ్గర చేస్తాయి. అంతే తప్ప భౌతికమైనదే అందం అనడం కన్నా అధ్వాన్నమైంది మరొకటి లేదు. యవ్వనం మాత్రమే అందం కాదు. చలనం, చైతన్యమే అసలైన అందం. అందాన్ని శారీరక పరమైందిగా చూసే ధోరణి తప్పు. దాని వల్లే అన్ని అనర్థాలు జరుగుతున్నాయి. పోర్న్ కామోద్రేకాల్ని రెచ్చగొడుతుంది.

పోర్న్ అంటే అసహజ శృంగారమే!

గీతాంజలి, సెక్సాలజిస్ట్, విరసం సభ్యురాలు



ముద్ర: మన దేశంలోని సాంస్కృతిక పరమైన, మతపరమైన విశ్వాసాలు, సామాజిక కట్టుబాట్ల నేపథ్యంలో వ్యక్తుల ఆరోగ్యం మీద పోర్న్ (అశ్లీలత) ఎలాంటి ప్రభావాన్ని కలిగి ఉంటుంది?

గీతాంజలి: సాంస్కృతిక, మత, సామాజిక కట్టుబాట్ల రీత్యా చూస్తే ఆయా సమాజాల్లో శృంగారానికి సంబంధించి సాంస్కృతిక పరమైన, మతపరమైన నమ్మకాలు, అపోహలు, మూఢ విశ్వాసాలు చాలానే ఉంటాయి. అవి వ్యక్తుల లైంగిక జీవితాన్ని శారీరకంగా, మానసికంగా శాసిస్తూనే ఉంటాయి. ఈ కట్టుబాట్ల మూలంగా వివాహేతర సంబంధాలు, అశాస్త్రీయమైన, అనారోగ్యకరమైన శృంగార ధోరణులు, అపోహల వల్ల ఎయిడ్స్ వ్యాధి దగ్గర్నుంచీ మనోలైంగిక సమస్యలకు మనుష లు గురవుతూనే ఉంటారు. చదువుకున్న యువత కూడా దీనికి మినహాయింపు కాదు. పోర్న్‌సైట్స్‌లో ఎక్కువగా అసహజమైన లైంగిక కార్యకలాపాల్నే చూపిస్తారు. ఉదాహరణకు కుటుంబ సభ్యుల మధ్య లైంగిక సంబంధాలు, ఫిడోఫీలియా - చిన్న పిల్లలతో లైంగిక కార్యకలాపాలు, జూషీలియా - జంతువులతో శృంగారం, సాడో మాసోచిసమ్ - శృంగారంలో హింసాత్మక పద్ధతులు, త్రీసమ్ -ఒకేసారి ముగ్గురితో సెక్స్, ఇలాంటివి వందల సంఖ్యలో పోర్న్‌సైట్స్‌లో ఉంటాయి. వీటిని చూడడం వల్ల సహజ శృంగార పద్ధతులు అసహజంగా మారి పోవడమే గాక, కుటుంబాలలో పిల్లలు, ముఖ్యంగా ఆడపిల్లలు బలై పోతుంటారు. భర్తల పోర్న్ వ్యసనానికి బలైన భార్యలు విడాకుల దాకా వెళ్ళి పోయే ఎన్నో కేసులు నాకు తెలుసు. నా దగ్గరికి ఇలాంటి కేసులు ఎక్కువగా వస్తున్నాయి.

మెరుపు



తూణీరం

బాధ్యత లేని వ్యక్తి

పిఒడబ్ల్యు సంధ్య, ప్రోగెసివ్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఉమెన్ రాష్ట్ర కార్యదర్శి, మహిళోద్యమ నాయకురాలు



ముద్ర: లైంగిక స్వేచ్ఛకు, లైంగిక విశృంఖలతకు మధ్య తేడా ఏమిటి? రెండింటిని అర్థం చేసుకోవడంలో రామ్ గోపాల్ వర్మ వంటి వాళ్ళు గందరగోళంలో పడుతున్నారని మీరు భావిస్తున్నారా?

పిఒడబ్ల్యు సంధ్య: రామ్ గోపాల్ వర్మ జిఎస్‌టి పేరుతో మరో సంచలనానికి తెరతీశారు. ఆయన ఇది వరకు దేవతలు, దేవుళ్ళ మీద కొన్ని ప్రశ్నల్ని లేవనెత్తారు. దాన్ని కొందరు హిందుత్వవాదులు వ్యతిరేకించారు. ఆయనలోని ప్రశ్నించే తత్వాన్ని మేము తప్పుబట్టడం లేదు. ప్రశ్నలు లేవనెత్తడం అభ్యంతరకరం కాదు. తాపీ ధర్మారావు 'దేవాలయాలపై బూతు బొమ్మలెందుకు' అనే పుస్తకాన్ని రచించినపుడు చాలా పెద్ద చర్చ జరిగింది. ఆ చర్చ అంతా ఒక నిర్మాణాత్మక విధానంలో జరిగింది. ఒక ఆలోచనా స్రవంతికి సంబంధించిన చర్చ అది. అయితే రామ్‌గోపాల్ వర్మ లేవనెత్తే చర్చలు నిర్మాణాత్మకంగా ఉండవు. తాను మాట్లాడడానికి ఆయన జవాబుదారీగా ఉండరు. ఏదైనా చెప్పేటప్పుడు ఆయన ఆ విషయానికి సంబంధించిన మూలాల్లోకి వెళ్ళి, అధ్యయనం చేసి చెప్పడం వంటివి చేయరు. ఆర్‌జీవీ స్త్రీలను వస్తువులుగానే చూస్తారు. సెక్స్ ఆబ్జెక్ట్స్‌గానే చూస్తారు. ఒక పోర్న్‌స్టార్‌ని తీసుకొచ్చి, సెక్స్ గురించి మాట్లాడించి, తానేదో ఘనకార్యం చేసినట్టు చెబుతున్నారు. అంతకన్నా ఆత్మవంచన మరొకటి లేదు. సెక్స్ గురించి అందరికీ తెలుసు. అది అందరి జీవితాల్లో నిత్యం జరిగేదే. దాన్ని తెర మీద చూపించడం ఒక పర్వర్షన్. అదొక హిపోక్రసీ. వాత్స్యాయన కామసూత్రాల నుంచి ఇప్పటి సమరం వరకు మనదేశంలో సెక్స్ గురించి చాలా మాట్లాడారు. అయితే అదంతా సెక్స్ ఎడ్యుకేషన్‌కి సంబంధించింది. ఆర్‌జీవీ మీ సినిమా ఏం చెబుతోంది, ఏ సత్యాన్ని చెబుతోంది? నగ్నంగా చూపిస్తాను, మాట్లాడతాను అంటున్నారు, నగ్నత్వం అన్నది శరీరానికి మాత్రమే సంబంధించింది కాదు. సమాజంలో ఎన్నో మార్మికతలున్నాయి. వాటి గురించి విడమరచి మీరెప్పుడైనా మాట్లాడారా? ముంబయి బాంబుపేలుళ్ళలో శరీరాలు ఛిద్రం కావడం ఆయనను ఆకర్షించింది. దాని వెనుక ఉన్న పెట్టుబడిదారీ సంస్కృతి, ఫాక్షనిజం వెనుక ఉన్న ఫ్యూడల్ సంస్కృతి గురించి ఆయన మాట్లాడలేదు. శాస్త్రీయత లేకుండా, విద్యాపరమైన కోణం లేకుండా ఆయన తన సొంత వికృత భావాల్నే తెర మీద చూపిస్తారు.

పాతతరమే ముందుంది

కొండవీటి సత్యవతి, భూమిక సంపాదకురాలు, మహిళోద్యమ నాయకురాలు



ముద్ర: లైంగిక విజ్ఞానం, వికాసం లోపించిన మన సమాజం మీద 'పోర్న్' ప్రభావం ఎలా ఉంటుంది?

కొండవీటి సత్యవతి: నాకు అర్థమైనంత వరకు లైంగిక విజ్ఞానాన్ని అందించడంలో ఆధునిక యుగానికన్నా ప్రాచీన యుగమే ముందుంది. ఆ కాలంలో దేవాలయాల మీద శృంగారభంగిమల్ని శిల్పాలుగా చెక్కేవారు. మా ఊరిలో కోవెల ఉంది. దాని మీద శృంగార భంగిమలతో పాటు, స్వలింగసంపర్కుల భంగిమలు కూడా ఉంటాయి. ఇవాళ స్వలింగసంపర్కం మీద ఎన్నో అపోహలున్నాయి, కానీ ఆకాలంలోనే అలాంటి విషయాల్ని సహజమైన అంశాలుగా అంగీకరించారనడానికి అదే చిహ్నం. లైంగిక విజ్ఞానంలో ఆధునిక సమాజమే దురభిప్రాయాలతో ఉంది. తప్పు, తప్పు అంటూ ఆపినా, ఇవాళ పెళ్ళికి ముందే లైంగిక సంబంధాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. లైంగిక ప్రవర్తన మీద సమాజం, సినిమాలు, సంఘటనల ప్రభావాలు ఉంటాయి. లైంగిక విజ్ఞానాన్ని తల్లిదండ్రులు, సమాజం అందివ్వడం లేదు. అందుకే యువత పోర్న్ వెంట పడుతోంది. పోర్న్‌ని చీప్‌సెక్స్ అంటాం. చీప్‌సెక్స్ వేరు, లైంగిక విజ్ఞానం వేరు. తరగతి గదిలో లైంగిక విజ్ఞానాన్ని అందిస్తే పిల్లలు కచ్చితంగా దాని జోలికి వెళ్ళరు. సెక్స్ అంటే బూతు పదమేననుకుంటున్నారు. వివాహసంబంధాన్ని ఖైదుగా మార్చేశారు. ఇష్టంలేని సంబంధం నుంచి సులభంగా విడిపోవడానికి చట్టాలు అనుమతించడం లేదు. అలాంటి సంబంధాల నుంచి వెంటనే విముక్తి లభించడం లేదు. అందుకే భర్తల్ని భార్యలు, భార్యల్ని భర్తలు చంపే వరకు వెళుతున్నారు. లైంగిక విజ్ఞానం అందుబాటులో ఉంటే అవాంఛిత గర్భాలు ఉండవు. గోప్యత వల్ల అనర్థం జరుగుతుంది. విడమర్చి చెప్పడం వల్ల సమాజం బాగు పడుతుంది. ఆర్‌జీవీ చెబుతున్నది లైంగిక విజ్ఞానం కాదు. లైంగిక విజ్ఞానాన్ని చెప్పదలచుకుంటే నగ్నంగా చూపనక్కర్లేదు. ఆర్‌జీవీ ఒక పర్వర్టెడ్ పర్సన్. హింస, సెక్స్, వీటిలో ఏది మార్కెట్‌లో సులభంగా అమ్ముడైతే దాన్నే చూపిస్తాడు. ఆన్‌లైన్‌లో పెడితే లక్షలు వస్తాయి కాబట్టే ఆ సినిమాను తీస్తున్నాడు. అతను సమాజానికి బాధ్యత వహించడు.

మానవ జీవితానికే వ్యతిరేకం

దేవి, సామాజిక కార్యకర్త



ముద్ర: లైంగిక వివక్షను, లైంగిక అత్యాచారాలను నిరోధించడమన్నది సాధ్యమవుతుందా? అత్యాచారాల వంటి నేరప్రవృత్తికి సినిమాలు, ఇతర మాధ్యమాలు కారణం కాదంటున్న రామ్‌గోపాల్ వర్మ అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తారా?

దేవి: బూతును సమర్థించుకుంటున్నారు, బూతును అమ్ముకుంటున్నారు. పోర్న్ వల్ల అత్యాచారాలు తగ్గుతాయని అంటారు, అది తప్పు. నిర్భయ సంఘటన జరిగిన తరువాత ఢిల్లీలో ఐదేళ్ళ పాపను రేప్ చేసి, చంపేశారు. ఆ నేరానికి పాల్పడడానికి ముందు తాను నీలిచిత్రాల్ని చూసినట్టు నేరస్తుడు ఒప్పుకున్నాడు. సినిమాల ప్రభావం లేకుంటే ఇవాల్టి యువత మాట్లాడుతున్న భాషలో సినిమా పరిభాష ఎందుకు అంతగా వచ్చి చేరింది. స్త్రీ శరీరాన్ని సరుకుగా చేసుకుని అమ్మేవాళ్ళు ఆర్‌జీవీలా మాటలు చెబుతారు. పోర్న్ నిద్రాణంగా ఉన్న నేరప్రవృత్తిని రెచ్చగొడుతుంది. లైంగిక జీవితం వేరు, నీలిచిత్రాల్లో చూపించే సెక్స్ వేరు. అది కృత్రిమ ప్రేరణ అవసరమైన వారికి మాత్రమే పనికి వస్తుంది. నిజంగా స్త్రీ, పురుషుల మధ్య అనుబంధంతో జరిగే సెక్స్‌కి ఇలాంటి ప్రేరణలు అవసరం లేదు. పోర్నోగ్రఫీ, సెక్స్ ఒకటి కాదు. మగవాడి కోరిక నుంచి ఆడదాన్ని చూడడం వంటి కుసంస్కృతికి ఇది పనికి వస్తుంది. భార్య రక్తం చూడకపోతే లైంగిక ఆనందం కలగదని భావించే భర్తలకు ఇది ప్రేరణనిస్తుంది. హింసను ప్రేరేపిస్తుంది. నేనేమీ సొంత ఫాంటసీ నుంచి ఇదంతా చెప్పడం లేదు. మా దగ్గరికి ఇలాంటి ఎన్నో కేసులు వస్తుంటాయి. ప్రత్యక్ష అనుభవంతో చెబుతున్నాను. పోర్న్ అన్నది మానవ జీవితానికి, ఆరోగ్యకరమైన లైంగిక జీవితానికి వ్యతిరేకమైంది.

ఇంటర్వ్యూలు : పసుపులేటి గీత

విమానంలో 'వైఫై' మోత!

గంటకు రూ.500-1000 చార్జి.. టికెట్‌పై అదనంగా 20-30 శాతం భారం

చెన్నై, జనవరి 23: విమానంలో వైఫై సదుపాయాన్ని త్వరలో కల్పించనున్నట్టు ప్రకటన వచ్చీరాగానే ఇందుకు అదనపు చార్జీలు వడ్డించేందుకు విమాన సంస్థలు సిద్ధమయ్యాయి. దీంతో విమాన ప్రయాణంలో ఉండగానే సెల్ఫీ పెడదామనుకున్నవారి ఆశలపై నీళ్లు చల్లినట్టైంది. కనీసం 20-30 శాతం అదనపు చార్జీలు చెల్లిస్తేనే విమాన ప్రయాణంలో వైఫై సదుపాయాన్ని వినియోగించుకునే అవకాశం లభించనుంది. ట్రాయ్ ఆదేశాలతో ఇదికూడా విమాన సర్వీసులకు అదనపు ఆదాయాన్ని ఆర్జించిపెట్టే వనరుగా మారనుంది. కాగా బిజినెస్ క్లాస్ ప్రయాణికులకు ఇంటర్నెట్ అత్యవసర సర్వీసుగా మారడంతో, అరగంట నుంచి గంట వరకూ నెట్ సేవలు పొందాలంటే రూ.500-1000 చెల్లించాల్సి రావచ్చని విమాన సంస్థలు లెక్కలేస్తున్నాయి. కాగా ఇన్‌ఫ్లైట్ నెట్‌కోసం ఎయిర్‌లైన్స్ సంస్థలు ఇన్మర్సాట్ వంటి ఉపగ్రహాలకు ఎక్కువ మొత్తంలో చార్జీలు చెల్లించాల్సి వస్తుంది కనుక వీటిని ప్రయాణికులపై మోపే ఆలోచనలో సంస్థలున్నాయి.

భారం కానున్న దేశీ ప్రయాణం..

ముందస్తు దేశీ ప్రయాణం కోసం విమాన టికెట్లు బుక్ చేసుకున్నవారికి రూ. 1,200-2,500 మధ్య టికెట్లు లభిస్తుండగా, ఇంటర్నెట్ కోసం చెల్లించే రుసుములు తడిసి మోపెడయ్యే అవకాశాలుండడంతో ప్రస్తుతానికి ఇన్‌ఫ్లైట్ ఇంటర్నెట్ సదుపాయం ఖరీదైన వ్యవహారంగా మారనుంది. మరోవైపు గుప్పెడు మంది వ్యాపారస్థులైన ప్రయాణికులకు తప్పితే మిగతా వారికి దేశీ విమాన ప్రయాణంలో నెట్ అవసరం అంతగా ఉండదని తరచూ విమాన ప్రయాణం చేసేవారు అభిప్రాయపడుతున్నారు. అంతర్జాతీయ విమానాల్లోకూడా ఎక్కువమందికి నెట్ సేవలు అవసరం లేదనే వాదన కూడా గట్టిగా వినిపిస్తోంది. 'సుదీర్ఘ ప్రయాణం చేసే ఇంటర్నేషనల్ ప్యాసింజర్లకు మినహాయిస్తే మిగతావారికి నెట్‌తో పని పెద్దగా ఉండదు, అత్యవసర సేవలకోసం నెట్ ఉపయోగపడుతుంది కానీ అంతర్జాతీయ మార్గాల్లో ప్రయాణిస్తున్నవారెవరూ ఇంటర్నెట్ సర్వీసులు అడిగినట్టు నేను చూడలేదు, తక్కువ ధరకే విమాన ప్రయాణాన్ని కల్పిస్తున్న సంస్థలకు ఇది మరింత భారమవుతుంద'ని భారత విమాన ప్రయాణికుల సంఘం జాతీయ అధ్యక్షుడు డీ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు.



ఈ ఎయిర్‌లైన్స్‌లో ఫ్రీ వైఫై

వాట్సప్ వంటి మెసేంజర్ల సర్వీసులను ఉచితంగా అందించేందుకు వైఫై సదుపాయాలను విమాన ప్రయాణికులకు అదనపు సర్వీసుగా అందించే అంతర్జాతీయ విమాన సంస్థల సంఖ్య ఇటీవల పెరుగుతోంది. తక్కువ బ్యాండ్ విడ్త్‌తో వాట్సప్ మెసేంజర్ల సేవలు అందించే అవకాశం ఉండడంతో, లుఫ్తాన్సా, ఎమిరేట్స్, బ్రిటీష్ ఎయిర్‌వేస్, డెల్టా వంటి ఎయిర్‌లైన్స్ ఫ్రీ వైఫై ఇప్పటికే ఇస్తున్నాయి. వీటిమధ్య విపరీతమైన పోటీ నెలకొనడంతో నాణ్యమైన, అదనపు సేవలు కల్పించడంలో కూడా ఈ విమాన సంస్థలు పోటీ పడుతున్నాయి.



పనులన్నీ చకచకా

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. మెట్రో ఫీడర్ సర్వీసులకు గాను కాలుష్యానికి తావులేకుండా ఎలక్ట్రిక్ వాహనాలు తీసుకొచ్చే ఆలోచనలు చేయాలని పేర్కొన్నారు. ఈ కాలుష్య రహిత వాహనాల ఏర్పాటుపై తెలంగాణ ఆర్టీసీ ఉన్నతాధికారులకు ప్రతిపాదన ఇవ్వాలని సూచించారు. ఈ ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, ఆర్టీసీ ఉన్నతాధికారులకు తెలిపారు. అలాగే.. మెట్రో స్టేషన్ల వారీగా ఏ స్టేషన్‌లో ఎంతమంది ప్రయాణికులు రైళ్లు ఎక్కుతున్నారో లెక్కలు తీయడంతోపాటు.. ప్రయాణికుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలన్నారు. మెట్రో రైళ్లకు - ఆర్టీసీ ఫీడర్ సర్వీసుల ఫ్రీక్వెన్సీ ఎంతుందో కూడా చూడటం ద్వారా చిట్టచివరి మైలు వరకు కనెక్టివిటీ కల్పించాలని తెలిపారు. మెట్రో మొదటి దశలో మిగిలి ఉన్న మార్గాలు... అమీర్‌పేట-ఎల్బీనగర్ (16 కిలోమీటర్లు), అమీర్‌పేట-హైటెక్‌సిటీ (10 కి.మీ.), జేబీఎస్-ఎంజీబీఎస్ (9 కి.మీ.)మార్గాలను ఈ సంవత్సరం జూన్ నుంచి దశలవారీగా పనులు మొదలుపెట్టాలని చెప్పారు. ఇక రెండోదశ విస్తరణకు సంబంధించి ఆయా మార్గాలలో సర్వేలు చేపట్టడం, డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టులు సిద్ధం చేయడం లాంటి పనులు ప్రారంభించాలని హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డికి సీఎస్ ఎస్పీసింగ్ సూచించారు. ఇందుకోసం జీహెచ్‌ఎంసీ కమిషనర్, హెచ్‌ఎండీఏ కమిషనర్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు, సంబంధిత ఇతర సీనియర్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, హెచ్‌ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ చిరంజీవులు, హైదరాబాద్ కలెక్టర్ యోగితా రాణా, మేడ్చల్ కలెక్టర్ ఎంవీ రెడ్డి, ఎల్‌అండ్‌టీఎంఆర్‌హెచ్‌ఎల్ సీఈ, ఓడీ కేవీబీ రెడ్డి తదితరులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రతి స్టేషన్లో మెట్రో రైలులో ప్రయాణించిన వారి సంఖ్యను లెక్కించాలని, దీంతోపాటు వారి అభిప్రాయాన్ని కూడా తీసుకోవాలని సూచించారు. మెట్రో రెండో దశకు కూడా డీపీఆర్, సర్వే సిద్ధం చేసే ప్రక్రియ ప్రారంభించాలన్నారు. ఈ మేరకు హైదరాబాద్ పరిసర జిల్లాల కలెక్టర్లు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, మెట్రో పాలిటన్ కమిషనర్ చిరంజీవులు, హైదరాబాద్ కలెక్టర్ యోగితా రాణా, మేడ్చల్ కలెక్టర్ ఎంవీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీవారిసప్తవాహన విహారం

(మొదటిపేజీ తరువాయి)

అనిల్‌కుమార్ సింఘాల్ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. కాగా, బుధవారం తెల్లవారుజామున 5:30 గంటలకు (సూర్యోదయ ముహూర్తం 6:45 గంటలు) దేవేరులతో కలసి స్వామివారు సూర్యప్రభ వాహనంపై బయల్దేరి ఉదయం 8:00 గంటలదాకా ఊరేగుతారు. ఆ తర్వాత 9 నుంచి 10దాకా చిన్నశేష, 11 నుంచి 12వరకూ గరుడ, మధ్యాహ్నం ఒంటి గంటనుంచి 2దాకా హనుమంత వాహనాలపై విహరిస్తారు. అటుపైన 2 నుంచి 3 గదాకా చక్రస్నానం నిర్వహిస్తారు. ఇది పూర్తయ్యాక సాయంత్రం 4:00 నుంచి 5:00 గంటల వరకూ కల్పవృక్ష, 6 నుంచి 7దాకా సర్వభూపాల వాహనాల్లో ఊరేగుతారు. చివరగా రాత్రి 8:00 నుంచి 9:00 గంటలదాకా చంద్రప్రభ వాహనంపై విహరించి ఆలయానికి చేరుకుంటారు. రథసప్తమి సందర్భంగా ఆలయంలో సహస్ర కలశాభిషేకం, కల్యాణోత్సం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్‌సేవ, వసంతోత్సవం, సహస్ర దీపాలంకార సేవ తదితర ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. అయితే, సుప్రభాతంతోపాటు తోమాల-అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు.

మందకృష్ణకు బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

వ్యవహారం మూడు వారాలుగా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకొంది. ఇప్పటికే పలుపార్టీల నేతలతో పాటు గుజరాత్ ఎమ్మెల్యే, దళిత నేత జిగ్నేష్ మేవాని, సినీ విశ్లేషకుడు కత్తి మహేశ్ జైలులో ఆయనను కలిసి సంఘీభావం తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి గతంలో అకస్మాత్తుగా ర్యాలీ నిర్వహించారనే నెపంతో మందకృష్ణను అరెస్టు చేశారు. ఈ కేసులో ఆయనకు తొలిసారి బెయిల్ మంజూరైంది. అయితే.. ఎస్సీ వర్గీకరణకోసం పార్శీగుట్టలోని కార్యాలయంలో దీక్షకు దిగడంతో మరోసారి ఆయన్ను పోలీసులు అరెస్టు చేశారు. అనుమతి లేకుండా ఉపవాస దీక్షకు దిగడంతో పోలీసులు మందకృష్ణని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో గతంలో బెయిల్ పిటిషన్ దాఖలు చేసినప్పటికీ కోర్టు తిరస్కరించింది. తాజాగా బెయిల్ మంజూరు చేసింది.

మందకృష్ణకు పలువురి పరామర్శ..

చంచల్‌గూడ్ జైలులో ఉన్న ఎమ్మార్పీస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను మంగళవారం పలువురు పరామర్శించారు. మహబూబ్‌నగర్ టీజేఏసీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ వేర్వేరుగా ఆయనను పరామర్శించారు. మంద కృష్ణను కలిసిన తర్వాత టీజేఏసీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో నియంత పాలన కొనసాగిస్తున్న కేసీఆర్ 8వ నిజాంలా తయారయ్యాడని రాజేందర్ రెడ్డి ఆరోపించారు. మంద కృష్ణ అరెస్టు అప్రజాస్వామికమన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ పాలనకు చమరగీతం పలుకుతారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మంద కృష్ణను పరామర్శించిన అనంతరం ఉప్పల్ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. తెలంగాణ బీజేపీ పక్షాన తామంత త్వరలోనే ప్రధాని మోదీని కలిసి పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును వేగవంతం చేయిస్తామని వెల్లడించారు.

'మూడు' ముఖ్యం

(మొదటిపేజీ తరువాయి)



స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో నిర్వహిస్తున్న 48వ వార్షిక సదస్సులో మంగళవారం ఆయన కీలకో పన్యాసం చేశారు. ఇంతకుముందు 1997లో దేవెగౌడ హాజరైన నేపథ్యంలో 20 ఏళ్ల తర్వాత ఈ సదస్సులో తొలిసారి పాల్గొన్న భారత ప్రధాని మోదీ కావడం గమనార్హం. సుమారు 70 దేశాల అధినేతలతోపాటు డబ్ల్యూటీవో, ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంకువంటి 38 అంతర్జాతీయ సంస్థల అధిపతులు దీనికి హాజరయ్యారు. అలాగే భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న 100 మందిసహా వివిధ దేశాల నుంచి వచ్చిన 2 వేల మంది వివిధ పరిశ్రమల సీఈవోలనుద్దేశించి మోదీ ఉత్తేజపూర్వకంగా ప్రసంగించారు. కీలకోపన్యాసకర్తగా తన పేరు ప్రకటించగానే 'నమస్కార్' అంటూ హిందీలో ఆయన ఉపన్యాసం ప్రారంభించారు.

రండి... మనమంతా ఏకమై సాగుదాం

''మిత్రులారా! మానవాళిని పీడిస్తున్న సవాళ్లు అనేకం.. విస్తృతం. కానీ, సమయాభావం దృష్ట్యా మూడు అతిపెద్ద సమస్యలను ఉటంకిస్తాను. మొదటిది వాతావరణ మార్పు... హిమనదాలు తరిగిపోతున్నాయి. ఉత్తరధ్రువంలో మంచు కరిగిపోతోంది. ద్వీపాలు నీట మునుగుతున్నాయి. ఉష్ణోగ్రత, అతి శీతలత్వం, అతివృష్టి, కరువు తదితర ప్రకృతి వైపరీత్యాలు మన అనుభవంలోనివే. అంతెందుకు... ఇప్పుడిక్కడ 20 ఏళ్లుగా ఎరుగని రీతిలో అత్యధిక హిమపాతాన్ని మనం చూస్తున్నాం'' అని వాతావరణ ముప్పు గురించి ప్రధాని హెచ్చరించారు. దీన్ని ఎదుర్కొనాలంటే విభేదాలను వీడి ప్రపంచం ఒక్కటి కావాలని పిలుపునిచ్చారు. మానవాళి మొత్తం భూమాత సంతానమని వేల ఏళ్లకిందట అందరి పవిత్ర గ్రంథాలూ ఘోషించినా, ప్రకృతితో మానవుడు యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఎందుకు దాపురించిందని ప్రశ్నించారు. అవసరమే హద్దుగా వినియోగం సాగాలి తప్ప అత్యాశ పనికిరాదన్న భారత జాతిపిత మహాత్మాగాంధీ ప్రబోధాన్ని ఈ సందర్భంగా ఉటంకించారు. ఇందుకు భిన్నంగా ప్రపంచం ప్రకృతిని విపరీతంగా దోచుకుంటూ వచ్చిందని వివరించారు. దీన్ని 'ప్రగతి'గా భావించాలో 'పతనం'గా పరిగణించాలో మనను మనం ప్రశ్నించుకోవాలన్నారు. భారత తత్త్వవేత్తలు 'వసుధైవ కుటుంబకం' (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అన్న భావనను అనాదిగా బోధిస్తున్నారని పేర్కొన్నారు. విభేదాలకు అతీతంగా ఉమ్మడి ప్రయోజనం పరమార్థంగా ఏకాభిప్రాయంతో ముందడుగు వేద్దామని పిలుపునిచ్చారు.

ప్రగతి కారకాలే... పతన ప్రేరకాలై...

మానవాళిని నడిపిస్తున్నవి శాస్త్ర పరిజ్ఞానం, సాంకేతికత, ఆర్థిక ప్రగతేనని ప్రధాని చెప్పారు. అయితే, వీటివల్ల సంభవిస్తున్న అనేక మార్పులు సృష్టించే అడ్డుగోడలు శాంతిపథంలో మన పయనాన్ని కష్టతరం చేస్తున్నాయని స్పష్టం చేశారు. ప్రపంచ ఏకీకరణ, విచ్ఛిన్నం, విభజనలకు సామాజిక మాధ్యమాలను ఉపయోగిస్తున్న తీరే ఇందుకు నిదర్శనమన్నారు. సమాచార నిధి కోసం పరుగుపందెం సాగుతున్నదని, దీన్ని నియంత్రించేవారే ప్రపంచాన్ని శాసించగలగడం ఇందుకు కారణమని విశ్లేషించారు. ''భారత స్థూల దేశీయోత్పత్తి 1997లో 40వేల కోట్ల డాలర్లు కాగా, ఇప్పుడు ఆరు రెట్లు అధికం. అప్పట్లో 'యూరో' లేదు... 'బ్రెగ్జిట్' చోటుచేసుకోలేదు... ఒసామా బిన్ లాడెన్ లేదా హ్యారీ పోటర్ గురించి ప్రపంచం వినలేదు... చదరంగం ఆటగాళ్లు కంప్యూటర్ల చేతిలో ఓడే పరిస్థితి లేదు... గూగుల్ లేదు... ఉన్నా- అప్పట్లో 'అమెజాన్' కోసం శోధించి ఉంటే అడవులు, నదుల సమాచారం మాత్రమే దొరికేది. ఆనాడు పక్షుల కిలకిలారావాలు (ట్వీట్) మాత్రమే వినిపించేవి. అయితే- ఒక్క 20 ఏళ్లలో ప్రపంచం, సమాజం రెండు సంక్లిష్ట పార్శ్వాలుగా ఆవిర్భవించాయి'' అని మోదీ విశదీకరించారు.

యువత పెడమార్గం పడుతోంది

అంతర్జాతీయంగా రెండో పెద్ద సవాలు ఉగ్రవాదమేనని ప్రధాని స్పష్టం చేశారు. దీని ప్రభావమేమిటో ప్రపంచ వ్యాప్తంగా చోటుచేసుకుంటున్న మానవ హననమే చెబుతున్నదని గుర్తుచేశారు. ఇందులో మంచి-చెడులు ఎంచే అవాస్తవిక ధోరణి తగదన్నారు. పైగా ఉన్నత కుటుంబాల యువత దుర్బోధలతో పెడదోవ పట్టి ఉగ్రవాదంవైపు మళ్లుతోందని పేర్కొన్నారు.

ప్రపంచీకరణ కుదించుకుపోతోంది

ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోతున్న 'స్వార్థపరత్వం' మూడో అతిపెద్ద సమస్యని మోదీ పేర్కొన్నారు. దీనివల్ల ప్రపంచీకరణ కాస్తా కుదించుకుపోతున్నదని చెప్పారు. ప్రతి ఒక్కరూ అంతర్గత సంధానం గురించి మాట్లాడుతున్నా ప్రపంచీకరణ ప్రకాశం సన్నగిల్లుతోందని స్పష్టం చేశారు. 'రెండో ప్రపంచయుద్ధం తర్వాత ఉనికిలోకి వచ్చిన ప్రపంచ సంస్థలు నేటి ప్రపంచపు కొత్త కోణాలను ప్రతిబింబిస్తున్నాయా?' అని ప్రశ్నించారు. అగ్రదేశాలకు ప్రపంచీకరణ అనవసరమని భావిస్తున్నాయని, వాణిజ్యపరమైన పన్ను విధాన అడ్డంకులే ఇందుకు నిదర్శనమని కుండబద్దలు కొట్టారు. ''నా ప్రపంచపు గోడలు, కిటికీలు మూసేయాలని నేను భావించడం లేదు. ప్రపంచ పవనాలు నాఇంట్లోకి రావాలిగానీ, అవి నా నివాసాన్నే కూల్చేవి కారాదు'' అని బాపూజీ అభిలషించారని గుర్తుచేశారు. భారత్ నేటికీ ఇదే సిద్ధాంతాన్ని అనుసరిస్తున్నదని, భిన్నత్వంలోని విలువతోపాటు స్వేచ్ఛ, ప్రజాస్వామ్యాల ప్రాముఖ్యాన్ని తాము అవగతం చేసుకున్నామని పేర్కొన్నారు. దేశంలో తొలిసారిగా 2014 ఎన్నికల్లో 60 కోట్ల మంది ఓటర్లు ఒకే పార్టీకి ఆధిక్యం కట్టబెట్టారని గుర్తుచేశారు. 'అందరి తోడ్పాటుతో అందరి అభివృద్ధి' సూత్రంతో తాము ముందడుగు వేస్తున్నామని చెప్పారు. కాగా, సోమవారం రాత్రి సీఈవోలతో 'ఇండియా అంటే వాణిజ్యం' పేరిట నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రధాని ప్రసంగించారు. ''మేమిప్పుడు వాణిజ్య సౌలభ్యం నుంచి జీవన సౌలభ్యంవైపు పయనిస్తున్నాం. 'ప్రభుత్వంతో కనిష్ఠ వైరుధ్యం'పైనే ప్రధానంగా దృష్టి సారించాం'' అని వివరించారు. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లసహా 18 దేశాల్లోని అంతర్జాతీయ కంపెనీలకు చెందిన 40 మంది, భారత్‌కు చెందిన 20 మంది ఇందులో పాల్గొన్నారు.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు పెద్దపీట

భారతదేశ ప్రగతి మార్గం 'సంస్కరణ... ఆచరణ... పరివర్తన' ప్రధానమైనదని ప్రధాని మోదీ చెప్పారు. అందుకే భారత్‌లో పెట్టుబడులు, భారత్‌కు ప్రయాణం, భారత్‌లో తయారీ మునుపటికన్నా మరింత సులభమని వివరించారు. 'రెడ్ టేప్ స్థానంలో రెడ్ కార్పెట్ పరుస్తున్నామని, విదేశీ పెట్టుబడులకు కొత్తదారులు ఏర్పరచామని వివరించారు. అభివృద్ధికి ఆటంకంగా ఉన్న 1400 కాలంచెల్లిన చట్టాలను ఏరిపారేశామని చెప్పారు. 'ఒకే దేశం.. ఒకే పన్ను' ప్రాతిపదికన వస్తుసేవల పన్ను (జీఎస్టీ)ని ప్రవేశపెట్టామని తెలిపారు. ''మా భవిష్యత్ నిర్మాణ శక్తులు ప్రజాస్వామ్యం, జనశక్తి, క్రియాశీలతలే... ఆరోగ్యంతో సౌభాగ్యం, స్వాస్థ్యంతో సంపూర్ణత కావాలంటే భారత్ రండి... అనిశ్చిత ప్రపంచంలో సార్వత్రిక, పారదర్శక, ప్రగతిశీల భారతం ఇక ముందు కూడా యథాతథంగానే పయనిస్తుంది. మీకందరికీ మా దేశం ఎల్లవేళలా ఆహ్వానం పలుకుతుంది'' అని మోదీ ప్రకటించారు. అన్నిటినీ సమగ్రంచేసే సమైక్య, సామరస్యీకరణ శక్తిగా తన పయనాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ప్రపంచ ఆర్థిక భద్రత వ్యవస్థలలో సంస్కరణలు అవశ్యమని, ప్రపంచ ఆర్థిక ప్రగతి మరింత వేగం అందుకోవాలని ఆకాంక్షించారు. సవాళ్లను ఎదుర్కొనడంలో భారత్ ఎల్లప్పుడూ తనవంతు సహకారం అందిస్తున్నదని పేర్కొన్నారు. స్నేహసంబంధాలున్న దేశాల్లో ప్రకృతి విపత్తులుసహా ఎలాంటి సంక్షోభాలు తలెత్తినా తొలుత స్పందించేది భారతదేశమేనని గుర్తుచేశారు. అంతర్జాతీయ శాంతి కోసం ఐక్యరాజ్యసమితి శాంతి సేనలకోసం అధికసంఖ్యలో దళాలను పంపింది భారతేనని పేర్కొన్నారు.

కెనడా ప్రధానితో మోదీ భేటీ

ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో తన ప్రసంగం అనంతరం ప్రధాని మోదీ మంగళవారం సాయంత్రం కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోతో సమావేశమయ్యారు. తన ఆహ్వానం మేరకు వచ్చేనెల 17 నుంచి 23వరకూ ట్రూడో భారత్‌లో పర్యటించనున్న నేపథ్యంలో ఆయనతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ పర్యటనలో భాగంగా న్యూఢిల్లీ, ముంబై, ఆగ్రా, అమృతసర్ తదితర నగరాలను ట్రూడో సందర్శిస్తారు. అలాగే ద్వైపాక్షిక అంశాలకు సంబంధించి ఉగ్రవాదం, భద్రతసహా ఇతరత్రా ముఖ్య రంగాల్లో సహకారంపై వారిమధ్య చర్చలు సాగుతాయి.

సీట్ల పెంపు ఖాయమేనా?

(మొదటిపేజీ తరువాయి)

అంటున్నారు. ఇదే జరిగితే.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాలు భారీగా పెరగనున్నాయి. కొంతకాలంగా ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పునర్విభజన విషయమై కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్న విషయం తెలిసిందే! ఈ చర్చలు ఫలించి సీట్ల పెంపునకు కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చినట్లు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతోపాటు ప్రధాన ప్రతిపక్షాలు కూడా భావిస్తున్నాయి. అసెంబ్లీ స్థానాల పునర్విభజనతో తెలంగాణలో 119 స్థానాల నుంచి 153 వరకు పెరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది తమకు కలిసి వచ్చే అంశమని అధికార పార్టీ భావిస్తుండగా.. సీట్ల పెంపును లాభదాయకంగా మార్చుకోవడంపై ప్రతిపక్షాలు వ్యూహరచన చేస్తున్నాయి. రాష్ట్రంలో అధికారం చేపట్టాక టీఆర్‌ఎస్‌లోకి నేతలు క్యూకట్టిన సంగతి తెలిసిందే.. ఏపీలోనూ ఇదే పరిస్థితి. వెల్లువెత్తిన ఈ వలసల నేపథ్యంలో ఇటు టీఆర్‌ఎస్.. అటు టీడీపీ రెండు పార్టీల కార్యాలయాలు నిండిపోయాయి. తెలంగాణలో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లోనూ టికెట్ ఇస్తామంటూ కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారు. దీంతో కొత్తగా పార్టీ సభ్యత్వం పుచ్చుకున్నవారి పరిస్థితి ఏంటనే సందేహాలు వ్యక్తమయ్యాయి. ఒకవైపు సిట్టింగ్ అభ్యర్థులకు టికెట్ కేటాయిస్తూనే.. కొత్తగా పార్టీ కండువా వేసుకున్న నేతలను సంతృప్తిపరిచేందుకు అసెంబ్లీ నియోజకవర్గాల పెంపు ఒక్కటే మార్గమని విశ్లేషకులతో పాటు నేతలు అభిప్రాయపడ్డారు. దీంతో నియోజకవర్గాల పునర్విభజన కోసం ఇటు కేసీఆర్, అటు చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో కొంతకాలంగా సంప్రదింపులు జరుపుతూ వస్తున్నారు.

లోక్‌సభ సీట్ల మాటేమిటి?

పునర్విభజన బిల్లుతో అసెంబ్లీ స్థానాల పెంపు ఖాయమేనని అనధికారికంగా వెల్లడైన క్రమంలో లోక్‌సభ స్థానాల మాటేమిటనే కొత్త సందేహం నేతలను పట్టిపీడిస్తోంది. శాసన సభ స్థానాలు పెంచుతున్నట్లే లోక్‌సభ స్థానాలనూ పెంచాలని రాజకీయ పక్షాలు కోరుతున్నాయి. రాష్ట్రంలోని నేతలకు ఈ విషయంలో అసంతృప్తి తప్పదనే వార్తలు వినవస్తున్నాయి. లోక్‌సభ స్థానాల పెంపునకు కేంద్రం సుముఖంగా లేదని సమాచారం. పార్లమెంటు స్థానాలను పెంచే ఆలోచన చేయడంలేదని తెలిసింది. ఈ స్థానాల సంఖ్యలో ఎలాంటి మార్పు ఉండకపోవచ్చని నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు.

ఏపీలో 225 స్థానాలు..

పునర్విభజన బిల్లుతో ఏపీ శాసన సభ నియోజకవర్గాల సంఖ్య పెరగనుందని నేతలు అభిప్రాయపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ లో ప్రస్తుతం 175 గా ఉన్న అసెంబ్లీ స్థానాల సంఖ్య 225 స్థానాలకు పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అసెంబ్లీ స్థానాలను మాత్రమే పునర్విభజన చేయనున్నారని, పార్లమెంటు స్థానాల్లో మార్పు ఉండకపోవచ్చనే వాదన కూడా ఉంది. ఇటీవలి కాలంలో ఆయా పార్టీల్లో చేరిన నేతల భవిష్యత్తు అసెంబ్లీ స్థానాల పెంపుతోనే ముడి పడి ఉందనే విషయం తెలిసిందే! స్థానాల పెంపునకు సంబంధించి నమ్మకంగా తెలియడంతో భవిష్యత్తులో వలసలు మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఇప్పటి వరకు టికెట్ విషయంలో స్పష్టమైన హామీ దొరకక, ఇవ్వజూపిన టికెట్‌పై సందేహాలతో కొంతమంది పునర్విభజన జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి నర్మగర్భంగా పేర్కొన్నట్లు తెలిసింది. కాగా ప్రధాని నుంచి కూడా అసెంబ్లీ నియోజకవర్గాల పెంపు విషయమై గ్రీన్ సిగ్నల్ లభించినట్టుగా విశ్వసనీయ సమాచారం. కాగా పునర్విభజన జరిగితే లోక్‌సభ స్థానాలను పరిగణలోకి తీసుకుంటారా, ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలు, జిల్లాల వారీగా పునర్విభజన జరుగుతుందా అనే అంశంపై రాజకీయ పార్టీల్లో చర్చ సాగుతోంది.

మేడారం.. ముస్తాబు

(మొదటిపేజీ తరువాయి)

సందర్శించుకుని ఐటీడీఏ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. అనంతరం మీడియాతో వారు మాట్లాడారు. ఈ సారి జాతరకు 1.25 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా వేశామని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. గురువారం నాటికి నాటికి మిగిలిన పనులన్ని పూర్తవుతాయని అన్నారు. మేడారానికి వచ్చే మూడు రహదార్లను రెండు వరుసల రహదారులుగా చేసి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. మేడారం ప్రాంతంలో 200సీసీ కెమెరాలు, పెంబర్తి నుంచి మేడారం వరకు మరో 200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంవత్సరం పొడవునా భక్తులు మేడారానికి వస్తున్నందున మేడారానికి ఒక పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుటకు రూ.7.5 కోట్లతో హరితహోటల్‌ను, రెండుకోట్లతో గిరిజన మ్యూజియంను ప్రారంభించామని చెప్పారు. భక్తులకు మరుగుదొడ్ల నిర్మాణంతోపాటు వాటికి 24గంటలు నీటి సరఫరా ఉండేలా, 100ఎకరాల జాతర స్థలంలో పరిశుభ్రత కొరకు మూడువేల మంది వర్కర్లను నియమించామని అన్నారు. భక్తుల సౌకర్యార్థం సింగరేణి సంస్థ 10 లక్షల మినరల్ వాటర్ బాటిళ్లు, జెన్‌కో సంస్థ 10 లక్షల వాటర్ బాటిళ్లు అందించేందుకు సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో తాను జాతర పనులను పర్యవేక్షించానని, అధికారులు అద్భుతంగా కష్టపడి పనిచేస్తున్నారని ప్రశంసించారు. మంత్రి చందులాల్ మాట్లాడుతూ గతంలో జరిగిన లోటుపాట్లను సవరించుకుంటూ మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మేడారానికి 4,500 ప్రత్యేక బస్సుల నడుపుతున్నామని చెప్పారు. మేడారంలో 50.93 ఎకరాల విస్తీర్ణంలో తాత్కాలిక బస్‌స్టాండ్ ఏర్పాటు చేశామన్నారు.

ఆ పాపం ఇద్దరిదీ

- విద్యార్థుల ఆత్మహత్యలు దారుణం
- కాలేజీలు.. తల్లిదండ్రులూ బాధ్యులే: హైకోర్టు

హైదరాబాద్, జనవరి 23 (మనం లీగల్ ప్రతినిధి): ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన విద్యార్థులపై ర్యాంకుల ఒత్తిడి పెనుభారంగా మారుతోందని, దీని ఫలితంగానే కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి ఏర్పడిందని హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇందులో కాలేజీలతో పాటు తల్లిదండ్రుల పాపం కూడా ఉందని అభిప్రాయపడింది. 90 శాతం మార్కులు రావాలనే ఏకైక లక్ష్యంతో పిల్లలు ఏమవుతున్నారో కూడా చూడకుండా ఒత్తిడి చేస్తున్నారని ప్రధాన న్యాయమూర్తి రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని బెంచ్ మంగళవారం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రైవేటు విద్యాసంస్థల్లో, ఐఐటీలలో విద్యార్థులు తీవ్ర ఒత్తిళ్ల కారణంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఇందుకు కారణమైన కార్పొరేట్ కాలేజీలపై క్రిమినల్ కేసులు పెట్టాలని కోరుతూ లోక్‌సత్తా ఉద్యమ సొసైటీ ప్రకాశం జిల్లా కన్వీనర్ దాసరి ఇ మ్మాన్యుయేల్ రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించి విచారణ చేపట్టింది. సాక్షాత్తు ఏపీలో ఒక మంత్రికి చెందిన కార్పొరేట్ కాలేజీ ఉందని.. పలు కాలేజీలు, హాస్టళ్లకు అనుమతులు లేకుండా నడుపుతున్నారని పి టిషనర్ పేర్కొన్నారు. ఈ కేసును మంగళవారం విచారించిన హైకోర్టు.. నారా యణ, శ్రీచైతన్య కాలేజీ యాజమాన్యాలను, ఏపీ, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, విద్యా, హోం శాఖల ప్రధాన కార్యదర్శులు, ఇంటర్ బోర్డు కార్యదర్శులు, స్విమ్స్, నిమ్స్ డైరెక్టర్లను ప్రతివాదులుగా పేర్కొంది. వారందరికీ నోటీసులు జారీ చేస్తూ విచారణను మూడు వారాల పాటు వాయిదా వేసింది. ఎలాగైనా సరే మార్కులే కావాలనే పెద్దలు.. ర్యాంకులే ప్రధానంగా విద్యాసంస్థలు.. ఫలితంగా మాస్ కాపీయింగ్.. వీటి దుష్పరిణామాలే విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నాయని హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. విద్వత్తుతో పనిలేకుండా మార్కులు/ర్యాంకులే ప్రధానమనే దుస్థితి కారణంగానే చూచిరాత పరీక్షలు పెరిగిపోతున్నాయని అభిప్రాయపడింది. ఇలాంటి పరిణామాల వల్లే పిల్లల్లో క్రమశిక్షణ కొరవడి వారు దారితప్పే ప్రమాదం ఉందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని బెంచ్ ఆందోళన వెలిబుచ్చింది. మాస్‌కాపీయింగ్, పుస్తకాలు పెట్టి పరీక్షలు రాసే దుష్ట విధానాన్ని అడ్డుకునేందుకు పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఏలూరుకు చెందిన ప్రొఫెసర్ గుంటుపల్లి శ్రీనివాస్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు బెంచ్ మంగళవారం మరోసారి విచారించింది. తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల చూచిరాత పరీక్షలే జరుగుతున్నాయని, వీటి వల్ల విద్యా ప్రమాణాలు దిగజారిపోతాయని పిటిషనర్ పేర్కొన్నారు. పరీక్షలు ఒకదారికి రావాలంటే మండల/జిల్లా స్థాయి విద్యాధికారులను బాధ్యుల్ని చేయడమే సరైన విధానం అవుతుందనే అభిప్రాయాన్ని బెంచ్ వ్యక్తం చేసింది. ఈసారి టెన్త్ పరీక్షలు నిర్వహించే 405 పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు పెడతామని తెలంగాణ ప్రభుత్వ లాయర్ సంజీవ్‌కుమార్ చెప్పారు.


అవినీతిని అంచనావేసే రోబో!



లండన్, జనవరి 23: ప్రభుత్వ కార్యాలయాలలో అవినీతిని అంచనా వేసే సరికొత్త వ్యవస్థను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. కృత్రిమ మేధస్సు సాయంతో ఈ వినూత్న వ్యవస్థను రూపొందించిన ట్లు వారు తెలిపారు. మానవ శరీరంలోని నాడీ వ్యవస్థను ఆధారంగా చేసుకొని దీనిని తీర్చిదిద్దామని స్పెయిన్ యూనివర్సిటీ పరిశోధకులు పేర్కొన్నారు. ప్రభుత్వానికి చెందిన వివిధ విభాగాలు, కార్యాలయాలలో వేటిలో అవినీతికి ఆస్కారం ఉందనే విషయాన్ని దీంతో తెలుసుకోవచ్చన్నారు. కార్యాలయాల ఆకారాన్ని, అక్కడి వాతావరణాన్ని పరిశీలించి ఈ వివరాలను వెల్లడించడం ఈ వ్యవస్థ ప్రత్యేకత అన్నారు. రియల్ ఎస్టేట్ పన్నులు, హౌజింగ్ రంగాల్లో వేగంగా పెరుగుతున్న ధరలు, బ్యాంకు శాఖల సంఖ్య పెంపు, కొత్త కంపెనీల ఏర్పాటు తదితర అంశాలు ప్రజలను అవినీతివైపు తీసుకెళతాయని ఈ అధ్యయనంలో వెల్లడైందన్నారు. ఒక ఉద్యోగి ఒకే సీటులో ఎక్కువ కాలం ఉన్నపుడు అవినీతికి ఎక్కువ అవకాశం ఉంటుందని ఈ వ్యవస్థ తేల్చిచెప్పింది. ఒకే రాజకీయ పార్టీ ఎక్కువ కాలం అధికారంలో ఉన్నా అవినీతికి ఆస్కారం మరింత పెరుగుతుందని వెల్లడించింది. ఈ సందర్భంగా సదరు రాజకీయ పార్టీ పూర్తి మెజారిటీతో పాలన కొనసాగిస్తోందా.. పొత్తులతో నెట్టుకొస్తుందా అనేది ఇక్కడ అప్రస్తుతమని వర్సిటీకి చెందిన ఇవాన్ పాస్టర్ పేర్కొన్నారు. ఈమేరకు స్పెయిన్‌లో 2000-2012 వరకు ఈ వ్యవస్థ సాయంతో అధ్యయనం నిర్వహించి ఈ విషయాలను కనుగొన్నామని తెలిపారు. కాగా, అవినీతికి ఎక్కువ అవకాశం ఉన్నంత మాత్రాన నిజంగా ఆ ఆఫీసులు అవినీతి జరుగుతోందని చెప్పలేమన్నారు. భవిష్యత్తులో అవినీతిని అడ్డుకునేందుకు ఈ వ్యవస్థ తోడ్పడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

రోబోలు మనుషులను మించిపోతాయ్!

- నోబెల్ బహుమతి విజేత యూనస్



కోల్‌కతా, జనవరి 23: రాబోయే రోజుల్లో యంత్రాలు మనుషులను మించిపోతాయని నోబుల్ బహుమతి విజేత మహ్మద్ యూనస్ పేర్కొన్నారు. వచ్చే 25 నుంచి 30 ఏళ్లలో సామర్థ్యం లోనూ, ప్రయోజనాల పరంగానూ యాంత్రిక శక్తి మనుషులకన్నా మెరుగైన స్థితికి చేరుకుంటుందన్నారు. కృత్రిమ మేధస్సు విషయంలో శాస్త్రవేత్తలు సాధిస్తున్న ప్రగతి ఈ మార్పునకు దోహదపడుతుందని చెప్పారు. కోల్‌కతాలో జరిగిన టాటా స్టీల్ లిటరరీ మీట్ 2018లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనస్ మాట్లాడుతూ.. రోబోలలో అమర్చే కృత్రిమ మేధస్సు రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతోందని చెప్పారు. మానవ ప్రమేయం లేకుండానే రోబోలు స్వతంత్రంగా ఉత్పత్తి జరపడాన్ని త్వరలోనే మనమంతా చూస్తామని వివరించారు. అయితే, కృత్రిమ మేధస్సు విషయంలో అంతర్జాతీయంగా కొన్ని నియమనిబంధనలను ఏర్పాటు చేసుకొని, శాస్త్రవేత్తలందరూ వాటిని పాటించాల్సిన అవసరం ఉందని యూనస్ తెలిపారు. ఓ కొత్త ఔషధాన్ని కనుగొన్నపుడు ముందుగా దాని పనితీరు, ప్రభావాన్ని పరిశీలించేందుకు అనేక పరీక్షలు చేస్తారని.. కృత్రిమ మేధస్సు విషయంలోనూ ఈ తరహా నిబంధనలు ఉండాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

రేపిస్టులకు శిక్ష పడాలి

- **రక్తంతో ప్రధానికి లేఖ**
- **లేదంటే ఆత్మహత్యే శరణ్యం**
- **అత్యాచార బాధితురాలి ఆవేదన**



రాయ్‌బరేలి(యూపీ), జనవరి 23: తనపై అఘాయిత్యానికి ఒడిగట్టిన వారిని చట్టపరంగా శిక్షించాలని కోరుతూ ఓ బాధితురాలు ప్రధాని మోదికి రక్తంతో లేఖ రాసింది. అధికార మదంతో శిక్ష తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్న నిందితులకు శిక్ష పడేలా చూడాలని, అలా జరగని పక్షంలో తనకు ఆత్మహత్యే శరణ్యమని ఆ లేఖలో పేర్కొంది. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కూ లేఖ ప్రతిని పంపించింది. గత ఏడాది మార్చిలో దివ్య పాండే, అంకిత్ వర్మలు తనపై అత్యాచారానికి పాల్పడ్డారంటూ బారాబంకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని బాధితురాలు తెలిపింది. బాధితురాలి లేఖ స్థానికంగా సంచలనం సృష్టించడంతో స్థానిక ఏఎస్‌పీ శశి శేఖర్ సింగ్ స్పందించారు. గత ఏడాది మార్చి 24న దివ్య పాండే, అంకిత్ వర్మలపై ఎఫ్‌ఐఆర్ నమోదైందని తెలిపారు. కేసు విచారణలో ఉందని పేర్కొన్నారు. అయితే, బాధితురాలి తండ్రి మాత్రం ఈ కేసు విషయంలో పోలీసులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ఇంజనీరింగ్ చదువుతున్న తన కూతురిపై ఇద్దరు దుర్మార్గులు అత్యాచారానికి పాల్పడడంతో పాటు తర్వాత బ్లాక్‌మెయిల్ చేస్తూ మానసికంగా వేధించారని మండిపడ్డారు. ఫేస్‌బుక్‌లో తన కూతురి పేరుతో నకిలీ ఖాతా తెరిచి అసభ్యకరమైన పోస్టులు పెడుతూ వేధిస్తున్నారంటూ అక్టోబర్‌లో మరో కేసు పెట్టినా పోలీసులు స్పందించలేదని తెలిపారు. నిందితులకు రాజకీయంగా పలుకుబడి ఉందని, దానిని అడ్డుపెట్టుకుని కేసు నుంచి తప్పించుకోవాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీనికి తగ్గట్లే పోలీసులు కూడా వారిపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతున్నారని తెలిపారు. పైగా కేసు పెట్టినందుకు మమ్మల్ని భయాందోళనలకు గురిచేస్తున్నారని, కేసు వాపస్ తీసుకోవాలంటూ బెదిరిస్తున్నారని వాపోయారు. ప్రధాని మోదీ, సీఎం యోగి స్పందించి మాకు న్యాయం చేయాలంటూ అభ్యర్థిస్తున్నారు.

శివసేన ఒంటరి పోరు

బీజేపీతో పొత్తు వద్దని తీర్మానం.. లోక్‌సభ, మహారాష్ట్ర ఎన్నికలు

ముంబై, జనవరి 23: ఎన్డీయే భాగస్వామిగా ఉన్నా కీలక నిర్ణయాలను వ్యతిరేకిస్తూ వస్తున్న శివసేన.. చివరకు బీజేపీకి కటీఫ్ చెప్పేసింది. ప్రస్తుతానికి కూటమిలో కొనసాగినా వచ్చే ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకోరాదని నిర్ణయించింది. లోక్‌సభ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయనున్నట్టు ప్రకటించింది. శివసేన ఈ మేరకు తీర్మానాన్ని ఆమోదించింది. మూడేళ్లుగా బీజేపీ తమ పార్టీని నైతికంగా దెబ్బతీస్తోందని, ఆ పార్టీతో పొత్తు పెట్టుకోరాదని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ తీర్మానం ప్రవేశపెట్టారు. శివసేన జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. సంజయ్ రౌత్ ఈ విషయాన్ని వెల్లడించారు. మహారాష్ట్రలోని 48 లోక్‌సభ స్థానాల్లో శివసేన కనీసం 25 సీట్లను, 288 అసెంబ్లీ స్థానాల్లో 125 సీట్లను గెలుస్తుందని చెప్పారు. బీజేపీ హిందుత్వ పేరుతో శివసేనతో పొత్తుపెట్టుకుందని, హిందుత్వ కోసం తమ పార్టీ సహనంతో ఉందని అన్నారు. అయినా బీజేపీ అధికారాన్ని ఉపయోగించుకుని తమ పార్టీ ప్రతిష్టను



దెబ్బతీస్తోందని రౌత్ విమర్శించారు. ప్రస్తుతం శివసేనకు 18 మంది ఎంపీలు, 63 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. కాగా శివసేన అధ్యక్షుడిగా ఉద్ధవ్ థాకరే మరోసారి ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. పార్టీ అధ్యక్ష పదవి ఎన్నికలకు ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేసినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.



శివసేన నిర్ణయం హాస్యాస్పదం: ప్రతిపక్షాలు

వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలన్న శివసేన నిర్ణయం హాస్యాస్పదమని ప్రతిపక్షాలు విమర్శించాయి. బీజేపీతో పొత్తు పెట్టుకోనప్పుడు ఇంకా ఎన్డీయే ప్రభుత్వంలో ఎందుకు కొనసాగుతోందని కాంగ్రెస్, ఎన్సీపీ ప్రశ్నించాయి. ''ప్రభుత్వంలో శివసేన కొనసాగుతోంది. ప్రభుత్వ విధానాలపై విమర్శలు కొనసాగిస్తోంది. ప్రభుత్వం నుంచి వైదొలుగుతామని శివసేన వందసార్లు ప్రకటించి ఉంటుంది. ఇప్పటికీ వైదొలగలేదు. ఆ పార్టీని ప్రజలను పెద్దగా పట్టించుకోవడం లేదు. శివసేన నిర్ణయం హాస్యాస్పదం, తర్క విరుద్ధమైనది'' అని కాంగ్రెస్ ప్రతినిధి సచిన్ సావంత్ విమర్శించారు. ఎన్సీపీ ప్రతినిధి నవాబ్ మాలిక్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం నుంచి శివసేన వైదొలగి, మధ్యంతర ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. తాము ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.


‘చాయ్‌వాలా’లే అలా చెబుతారు

- ప్రధానిపై హార్దిక్ పటేల్ మండిపాటు

పాటీదార్ ఉద్యమనేత హార్దిక్ పటేల్..ప్రధాని మోదీపై మరోసారి మండిపడ్డారు. పకోడీలు అమ్ముకుంటూ రోజుకు 200 సంపాదించే వ్యక్తిని నిరుద్యోగి అనొచ్చా అంటూ ఇటీవల ప్రధాని చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. కేవలం ఒక ‘చాయ్‌వాలా’ మాత్రమే యువతను పకోడీ లు అమ్ముకునే పని చేసుకొమ్మని చెబుతారన్నారు. ఆర్థికవేత్తలు ఎవరూ అలా చెప్పబోరంటూ హార్దిక్‌పటేల్ ట్వీట్ చేశారు. ప్రధాని మోదీ ఇటీవల ఓ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడేటపుడు పకోడీలు అమ్ముకునే వ్యక్తిని నిరుద్యోగిగా భావించాలా.. వద్దా అన్న వ్యాఖ్య చేశారు.

పార్టీలకు నగదు రూపంలో 2 వేలుకు మించి విరాళం ఇవ్వొద్దు

- **ఇస్తే కఠిన చర్యలు: ఆదాయపుపన్ను శాఖ హెచ్చరిక**



న్యూఢిల్లీ, జనవర 23: రాజకీయ పార్టీలకు నగదు రూపంలో రెండు వేల రూపాయలకు మించి విరాళం ఇవ్వొద్దని ఆదాయపు పన్ను శాఖ ప్రజలను హెచ్చరించింది. అలాకాదని అధిక మొత్తంలో నగదు రూపంలో విరాళాలను అందజేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన జారీ చేసింది. రాజకీయ నిధుల సేకరణ విధానాన్ని ప్రక్షాళన చేయడానికి ప్రభుత్వం ఎలక్టోరల్ బాండ్ల విధానాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఐటీ శాఖ ఈ మేరకు ప్రకటనను విడుదల చేసింది. '' ఏ రాజకీయ పార్టీకి నగదు రూపంలో రూ.2వేలకు మించి విరాళం ఇవ్వొద్దు. అలాగే స్థిరాస్తుల కింద రూ.20వేలకు మించి నగదు ఇవ్వడం కానీ తీసుకోవడం కానీ చేయొద్దు. అలా చేస్తే భారీగా జరిమానా ఎదుర్కోవాల్సి ఉంటుంది'' అని ఐటీ శాఖ ప్రకటనలో పేర్కొంది. ‘గో క్యాష్‌లెస్, గో క్లీన్’ పేరుతో ఐటీ శాఖ ఈ ప్రకటనను విడుదల చేసింది. అలాగే నల్లధన, బినామీ లావాదేవీలకు సంబంధించిన సమాచారం ఏదైనా తెలిస్తే మెయిల్ చేసి వివరాలు అందజేయాల్సిందిగా సూచించింది. అలాగే, ఒక వ్యక్తి రూ.2 లక్షల నగదు కంటే ఎక్కువ తీసుకోకూడదని, అంతకన్నా ఎక్కువ మొత్తాన్ని ఎవరూ కూడా ఇవ్వకూడదని ఆ ప్రకటనలో ఐటీ శాఖ పేర్కొంది. రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాల్లో పారదర్శకత తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఎలక్టోరల రల్ బాండ్ల విధానాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చే దాతలు ఎస్‌బీఐ నుంచి ఈ బాండ్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబరు నెలల్లో ఎస్‌బీఐలోని ప్రత్యేక బ్రాంచీల వద్ద పది రోజుల పాటు ఈ బాండ్లను అమ్మడం జరుగుతోంది. పదిహేను రోజులు చెల్లుబాటు అయ్యే ఈ బాండ్లపై రుణదాత పేరు ఉండదు. కానీ రుణదాత ఆ బాండ్లను కొనుగోలు చేసే ముందు కేవైసీ పత్రాలను పూర్తి చేయాల్సి ఉంటుంది.

వైవాహిక స్థితిపై దర్యాప్తు వద్దు

- **లవ్ జీహాద్ కేసులో ఎన్ఐఏకి సుప్రీం ఆదేశం**

న్యూఢిల్లీ, జనవరి 23: కేరళ లవ్ జీహాద్ కేసులో ఎన్ఐఏ దర్యాప్తు కొనసాగించడంపై తమకు అభ్యంతరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే లవ్ జీహాద్ ద్వారా పెళ్లి చేసుకున్నారన్న జంట వైవాహిక స్థితిపై దర్యాప్తు చేయొద్దని సూచించింది. షఫిన్ జహాన్ అనే యువకుడు లవ్ జీహాద్ పేరుతో కేరళకు చెందిన హిందూ యువతి హదియా (25)తో మత మార్పిడి చేయించి పెళ్లి చేసుకొన్నాడన్న ఆరోపణలపై ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో గణనీయమైన పురోగతిని సాధించినట్లు ఎన్ఐఏ మంగళవారం సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనానికి వివరించింది. ఈ కేసు దర్యాప్తు కొనసాగించవచ్చని.. ఎవరినైనా అరెస్టు చేసుకోవచ్చని, దీనిపై తమకు అభ్యంతరం లేదని ఈ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. అయితే లవ్ జీహాద్ బాధితురాలిగా పేర్కొంటున్న హదియా తన ఇష్టపూర్వకంగానే పెళ్లి చేసుకున్నట్లు తెలిపిందని పేర్కొంది. ఈ నేపథ్యంలో వారి వైవాహిక స్థితిపై దర్యాప్తు చేయవద్దని కోర్టు ఆదేశించింది. ఆ యువతి ఎవరితో జీవించాలన్న విషయంలో ఆమెకు స్వేచ్ఛ ఉంటుందని, దీనిపై ఎవరూ కల్పించుకోరాదని స్పష్టం చేసింది. అనంతరం తదుపరి విచారణను ఫిబ్రవరి 22కు వాయిదా వేసింది.

ముస్లిం పురుషులను శిక్షించేందుకే ట్రిపుల్ తలాక్ బిల్లు

- **మహిళలను రోడ్డెక్కించాలని కేంద్రం వ్యూహం: ఓవైసీ**

ఔరంగాబాద్, జనవరి 23: ముస్లిం పురుషులను శిక్షించే వ్యూహంలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ట్రిపుల్ తలాక్ బిల్లును తీసుకొచ్చిందని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆరోపించారు. ముస్లిం మహిళలను రోడ్డెక్కించాలని, పురుషులను మాత్రం జైలుకు పంపాలనే కుట్రతోనే కేంద్రం ఈ బిల్లును తీసుకొచ్చిందని అన్నారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో నిర్వహించిన ఓ సభలో ఓవైసీ పాల్గొని ప్రసంగించారు. పద్మావత్ సినిమా వివాదం పరిష్కారానికి ఓ కమిటీని ఏర్పాటుచేశారు కానీ, ట్రిపుల్ తలాక్ బిల్లు విషయంలో మాత్రం ఎలాంటి కమిటీని వేయలేదని ఓవైసీ పేర్కొన్నారు. అయితే.. ఎవరైతే, తలాక్ ద్వారా విడాకులు కోరుకుంటారో వారిని సామాజిక బహిష్కరణ చేయాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో ముస్లిం మహిళల అభివ ద్ధికి రూ.2వేల కోట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు.



గవర్నర్‌గా ఆనందిబెన్ ప్రమాణం

భోపాల్, జనవరి 23: గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ బీజేపీ నేత ఆనందిబెన్ పటేల్ మధ్యప్రదేశ్ గవర్నర్‌గా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మధ్యప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి హేమంత్ గుప్త ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. లోక్‌సభ స్పీకర్ సుమిత్ర మహాజన్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, పలువురు రాష్ట్ర మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

షట్ ‘డౌన్’

- అమెరికా సంక్షోభానికి తెర
- స్వల్పకాలిక బిల్లు ఆమోదం
- సంతకం చేసిన డోనాల్డ్ ట్రంప్
- ప్రభుత్వ సేవలు పునఃప్రారంభం
- ఫిబ్రవరి 8 వరకూ కాలపరిమితి
- అక్రమ వలసలపై చర్చకు అంగీకారం
- బిల్లుకు సహకరించిన డెమోక్రాట్లు



వాషింగ్టన్, జనవరి 23: అమెరికాలో మూడు రోజులుగా నెలకొన్న ప్రతిష్టంభనకు తెరపడింది. ప్రభుత్వ కార్యకలాపాలకు నిధులు అందించడానికి స్వల్పకాలిక బిల్లును ఉభయ సభలు ఆమోదించాయి. దీనిపై అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. దీంతో షట్‌డౌన్ ముగియడంతో ప్రభుత్వ సేవలు మళ్లీ ప్రారంభమయ్యాయి. మంగళవారం నుంచి పూర్తి స్థాయిలో పనిచేస్తాయని వైట్‌హౌస్ ప్రకటించింది. ఈ స్వల్పకాలిక బిల్లు ప్రకారం ఫిబ్రవరి 8 వరకు ప్రభుత్వానికి నిధులు అందుతాయి. ఈ లోగా అధికార రిపబ్లికన్లు, ప్రతిపక్ష డెమోక్రాట్లు ఓ అంగీకారానికి వచ్చి ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించాల్సి ఉంది. అమెరికా కాంగ్రెస్‌లో ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం పొందకపోవడంతో సంక్షోభం ఏర్పడిన సంగతి తెలిసిందే. అక్రమ వలసదారులపై చర్చకు ట్రంప్ అంగీకరించకపోవడంతో డెమోక్రాట్లు ఈ బిల్లును వ్యతిరేకించాయి. ఈ బిల్లులో డ్రీమర్స్ భద్రతకు సంబంధించిన ప్రతిపాదనలు లేకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కాగా ట్రంప్ బెట్టు వీడటం, ప్రతిపక్ష డెమోక్రాట్లు సహకరించడంతో షట్‌డౌన్‌కు తెరపడింది. అక్రమ వలసదారుల భవిష్యత్‌పై చర్చకు అధికార రిపబ్లికన్లు అంగీకరించడంతో బిల్లుకు అనుకూలంగా డెమోక్రాట్లు ఓటు వేశారు. సోమవారం రాత్రి సెనెట్‌లో 81-18, ప్రతినిధుల సభ (హౌస్)లో 266-150 ఓట్ల తేడాతో స్వల్పకాలిక బిల్లు ఆమోదం పొందింది. దీంతో ఉద్యోగులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కాగా అమెరికాలో 1990 నుంచి నాలుగు ప్రభుత్వాలు మూతపడ్డాయి. 2013లో దాదాపు 8 లక్షల మంది ఉద్యోగులు తాత్కాలిక సెలవుపై వెళ్లారు.

వలసలపై దీర్ఘకాలిక విధానం: ట్రంప్

వలసలపై దీర్ఘకాలిక విధానం రూపొందిస్తామని, అమెరికాకు మంచి జరిగేలా మాత్రమే ఉంటుందని ట్రంప్ పేర్కొన్నారు. సమస్య పరిష్కారం దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు. ఈ విషయంలో డెమోక్రాట్లతో ఉన్న విభేదాలను పరిష్కరించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. రెండు వారాల్లో పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్వల్పకాలిక బిల్లు ఆమోదం పొందిన తర్వాత ట్రంప్ ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. తన విన్నపం మేరకు డెమోక్రాట్లు సహకరించడంతో షట్‌డౌన్ ముగిసిందని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యకలాపాలకు నిధులు అందుతాయని ట్రంప్ చెప్పారు. మొదట మిలటరీ, సరిహద్దు రక్షణ గస్తీ దళం, చిన్నారుల ఆరోగ్య బీమా కార్యక్రమానికి నిధులు విడుదల చేయనున్నట్టు తెలిపారు.

దిగుమతులపై సుంకం పెంపు

సోలార్ సెల్స్, వాషింగ్ మిషన్ల దిగుమతులపై సుంకం పెంచడానికి ట్రంప్ ఆమోదించారు. అమెరికా దేశీయ మార్కెట్‌ను కాపాడటంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. విదేశాల నుంచి ముఖ్యంగా చైనా నుంచి దిగుమతి అవుతున్న ఈ ఉత్పత్తుల వల్ల అమెరికా మార్కెట్ కుదేలు అవుతోందని వాణిజ్య వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. భారీగా దిగుమతి చేసుకోవడంతో అమెరికా దేశీయ మార్కెట్‌కు తీవ్ర నష్టం కలుగుతోందని పేర్కొన్నాయి. దీంతో దిగుమతులపై సుంకం పెంచాలని అమెరికా వాణిజ్య సంస్థ సిఫారసు చేయగా, ట్రంప్ ఇందుకు ఆమోదించారు.

కశ్మీర్‌పై మధ్యవర్తిత్వానికి నో

- **తేల్చిచెప్పిన ఐరాస కార్యదర్శి**

ఐక్యరాజ్యసమితి, జనవరి 23: కశ్మీర్ వివాదం విషయంలో ఐక్యరాజ్యసమితిలో భారత్‌కు ఘన విజయం దక్కింది. కశ్మీర్ విషయంలో మధ్యవర్తిత్వం జరిపే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. ''భారత్, పాకిస్థాన్ కోరుకుంటేనే కశ్మీర్ విషయంలో మధ్యవర్తిత్వం వహిస్తాం. ఏ ఒక్క దేశం అంగీకరించకపోయినా మేం ఆ పని చేయం'' అని ఐరాస సెక్రటరీ జెనరల్



ఆంటోనియా గుటెర్రస్ మంగళవారం పేర్కొన్నారు. భారత్-పాకిస్థాన్ తమ సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. అయితే సమస్య పరిష్కారానికి ఇరు దేశాలకు తమ వంతు సాయం చేస్తామని అన్నారు. దీనికి ఇరు దేశాలు అంగీకరించాల్సిన అవసరం ఉందని అన్నారు. గుటెర్రస్ స్పష్టీకరణతో పాకిస్థాన్‌కు పెద్ద ఎదురుదెబ్బ తగిలినట్లయింది. కశ్మీర్ విషయంలో ఐరాస జోక్యం చేసుకోవాలని కొంత కాలంగా ఆ దేశం కోరుతున్న విషయం తెలిసిందే.

‘పద్మావత్’కు లైన్‌క్లియర్

- నిషేధంపై స్టే కొనసాగింపు
- ఎత్తివేతకు సుప్రీం నో
- 25న చిత్రం విడుదల
- భద్రత ఏర్పాట్లలో రాజస్థాన్ పోలీస్
- సినిమాపై ప్రజా కర్ఫ్యూ: కర్ణిసేన



న్యూఢిల్లీ/జైపూర్/ముంబై, జనవరి 23: ‘పద్మావత్’కు ఇక అన్ని అడ్డంకులు తొలగినట్లే! సినిమా విడుదల నిషేధంపై విధించిన స్టే ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరుతూ రాజస్థాన్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టును కొట్టేసింది. బాలీవుడ్ నటి దీపికా పదుకొనే ప్రధాన పాత్రధారిగా ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించిన ‘పద్మావత్’ చిత్రం విడుదలైతే శాంతిభద్రతలకు సమస్య తలెత్తుతుందని నాలుగు బీజేపీ పాలిత రాష్ట్రాలు ఈ సినిమాను నిషేధించాయి. అయితే దీనిపై చిత్ర నిర్మాతలు సుప్రీం కోర్టును ఆశ్రయించగా.. నిషేధంపై స్టే విధిస్తూ ఈ నెల 18న ఉత్తర్వులిచ్చింది. శాంతి భద్రత పరిరక్షణ బాధ్యత రాష్ట్రాలదేనని కోర్టు వ్యాఖ్యానించింది. అయితే శాంతి భద్రతల దృష్ట్యా తమకు చిత్రాన్ని నిషేధించే హక్కు ఉందంటూ రాజస్థాన్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు సోమవారం రివిజన్ పిటిషన్ దాఖలు చేశాయి. దీన్ని మంగళవారం విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం రాష్ట్రాలే సమస్యను సృష్టించుకుని.. ఇప్పుడు నిషేధం కోసం కోర్టును ఆశ్రయించాయని వ్యాఖ్యానించింది. నిషేధంపై స్టే ఎత్తివేసేందుకు నిరాకరిస్తూ, శాంతి భద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో ఈ సినిమా దేశవ్యాప్తంగా ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. నిషేధం ఎత్తివేతకు సుప్రీం తిరస్కరించిన నేపథ్యంలో చిత్ర ప్రదర్శన సందర్భంగా ఎటువంటి అవాంఛిత ఘటనలు జరగకుండా చూసేందుకు రాజస్థాన్ పోలీసు శాఖ రంగంలోకి దిగింది. సినిమా విడుదలైతే థియేటర్లను దగ్ధం చేస్తామన్న కర్ణిసేన హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేస్తోంది. వరుసగా పద్మావత్ విడుదలతో పాటు ఆదే రోజు నుంచి జైపూర్ సాహిత్య ఉత్సవాలు, 26న గణతంత్ర వేడుకలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అన్ని జిల్లాల్లో అదనపు బలగాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఎస్పీలకు ఆదేశించినట్లు అదనపు డీజీపీ ఎన్. ఆర్కే రెడ్డి తెలిపారు. జైపూర్ సహా పలు ప్రాంతాలకు రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌ను పంపుతున్నామన్నారు.

ప్రజలే అడ్డుకుంటారు: కర్ణిసేన

‘పద్మావత్’ సినిమా రాజ్‌పుత్‌ల మనోభావాలను దెబ్బతీసేలా ఉందని వాదిస్తున్న కర్ణిసేన ఈ చిత్రాన్ని ప్రజలే అడ్డుకుంటారని చెబుతోంది. ఈ నెల 25న దేశవ్యాప్తంగా సినిమాపై ప్రజా కర్ఫ్యూ విధిస్తున్నట్లు కర్ణిసేన చీఫ్ లోకేంద్ర సింగ్ కల్వీ చెప్పారు. తాము ప్రజల్లోకి వెళ్తామని, స్వచ్ఛందంగా సినిమాను ప్రజలే నిషేధించేలా వారిని కోరుతామని తెలిపారు. సినిమాను చూడకుండా ఉండడం ద్వారా ప్రజలే దీన్ని అడ్డుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. థియేటర్ల యజమానులు, డిస్ట్రిబ్యూటర్లను కూడా ఈ సినిమా తీసుకోవద్దని కోరుతున్నామన్నారు.

సిద్ధి వినాయకుడిని దర్శించిన దీపిక

పద్మావత్ సినిమా విడుదలకు అడ్డంకులన్నీ తొలగిన నేపథ్యంలో ప్రధాన పాత్రధారి దీపికా పదుకొనే ముంబైలోని సిద్ధి వినాయక ఆలయాన్ని సందర్శించింది. భారీ పోలీసు భద్రత మధ్య ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించింది. చిత్ర ప్రదర్శన సందర్భంగా ఎటుంటి ఆటంకాలు కలగకూడదని విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు దీపిక తెలిపింది.



ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

- బాలకృష్ణ



నందమూరి బాలకృష్ణ, నయతార, హరిప్రియ, నటాషా దోషి నటించిన చిత్రం 'జై సింహా'. కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని సి.కల్యాణ్ నిర్మించారు. ఈ చిత్రం జనవరి 12న విడుదలైంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ సక్సెస్ మీట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్లు పార్థసారథిరెడ్డి, శివారెడ్డి, ఫణి, శక్తి పిక్చర్స్ రమేశ్, విజయ్, మహేశ్, కృష్ణ తదితరులు పాల్గొని సినిమా సక్సెస్ పట్ల తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ ''మన కల్యాణ్, సి.వి.రావుగారు నిర్మించిన 'జైసింహా' సినిమా 50 కోట్ల క్లబ్‌లో చేరింది. నేను మద్రాసులో ఉన్నప్పుడు సినిమా కొన్నవాళ్ల మధ్య ఫంక్షన్స్ ఎక్కువగా జరిగేవి. అలాంటి సిచ్యువేషన్ ఈరోజు కనపడుతుంది. ఈవాళ నిర్మాతల పరిస్థితి మనకు తెలుసు. కానీ నేను భిన్నంగా నా సినిమాల నిర్మాతలకు ఎక్కువ ప్రాధాన్యమిస్తాను. గతంలో నేను కల్యాణ్‌గారితో కలిసి పరమవీరచక్ర సినిమా చేశాను. ఆ సినిమాకు నేషనల్ ఇంటిగ్రిటీ అవార్డు కూడా వచ్చింది. ఇప్పుడు 'జైసింహా' మంచి సక్సెస్‌ను సాధించింది. ఈ సక్సెస్‌తో అందరూ సంతోషంగా ఉన్నారు. నాకు రికార్డులు ముఖ్యం కాదు. ఇండస్ట్రీ బావుండాలి. అందరి సినిమాలు బావుండాలని కోరుకునేవాడిని. అందరి బాగోగులను దృష్టిలో పెట్టుకునే సినిమాలు చేస్తాను. కె.ఎస్.రవికుమార్‌గారితో సినిమా చేయాలనే ఎనిమిదేళ్ల కల ఈ సినిమాతో నేరవేరింది. ఇందులో మంచి పాటలు, మాటలు, సంగీతం ఇలా అన్నీ చక్కగా కుదిరాయి.. అందుకే ఈ సినిమా ఘన విజయం సాధించింది. ఈ సినిమాలో భాగమైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు'' అన్నారు.

వెంకటేష్ గ్రీన్ సిగ్నల్



పూరి జగన్నాథ్ సినిమాల్లోని హీరోల క్యారెక్టరైజేషన్ చాలా విభిన్నంగా ఉంటుంది. హీరో లుక్‌గానీ, డైలాగ్స్‌గానీ కొత్తగా అనిపిస్తాయి. పూరి కాంబినేషన్‌లో ఇప్పటివరకు దాదాపు అందరు పెద్ద హీరోలు నటించారు. కానీ, వెంకటేష్ మాత్రం ఒక్క సినిమా కూడా చెయ్యలేదు. ఇప్పుడు పూరి మార్క్ క్యారెక్టరైజేషన్‌లో హీరో వెంకటేష్ నటించబోతున్నారని తెలుస్తోంది. పూరితో సినిమా చేసేందుకు వెంకటేష్ ఓకే చెప్పారట. ఓ కొత్త క్యారెక్టర్‌తో ప్రేక్షకుల్ని పలకరించనున్న వెంకటేష్ గెటప్ కూడా కొత్తగా వుండేలా ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ప్రస్తుతం తనయుడు ఆకాశ్ పూరీతో 'మెహబూబా' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు పూరి జగన్నాథ్. ఈ సినిమా పూర్తయిన వెంటనే వెంకటేష్ సినిమా సెట్స్‌పైకి వెళ్తుంది. వెంకటేష్, తేజ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనుందని ఆమధ్య వార్తలు వచ్చాయి. అయితే తేజ ప్రస్తుతం ఎన్టీఆర్ బయోపిక్‌ని చేసే పనిలో వున్నారు. వెంకీతో తేజ సినిమా చేసేందుకు సమయం ఉన్నందున్న ఈ గ్యాప్‌లో పూరితో సినిమా చెయ్యడానికి రెడీ అయ్యారని తెలుస్తోంది. ఫిబ్రవరిలో ఈ సినిమా ప్రారంభమయ్యే అవకాశం ఉంది.




శ్రద్ధా కపూర్

ప్రభాస్ లాంటి హీరోతో కలిసి నటించడం నిజంగా తన అదృష్టమని, ఇది గొప్ప అవకాశమని 'ఆషికి2' సుందరి శ్రద్ధా కపూర్ ఆనందంగా చెప్తోంది. యు.వి. క్రియేషన్స్ పతాకంపై సుజిత్ దర్శకత్వంలో తెలుగు, హిందీ భాషల్లో 'సాహో' చిత్రాన్ని వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటివరకు హిందీ చిత్రాలకే పరిమితమైన

రెట్టింపు సంతోషంలో...

శ్రద్ధా 'సాహో'తో తెలుగులో హీరోయిన్‌గా పరిచయం కావడంపై చాలా ఎగ్జయిటెడ్‌గా వున్నానంటోంది. తెలుగు, హిందీ భాషల్లోనే కాక ఈ సినిమా పలు భారతీయ భాషల్లో కూడా అనువాదం తనకు మరింత సంతోషాన్నిస్తోందని శ్రద్ధా మరింత సంతోషంగా చెప్తోంది. ఇటీవల ముంబయిలో వెడ్డింగ్ జంక్షన్ షోను ప్రారంభించిన శ్రద్ధా తన కొత్త సినిమాలు 'సాహో', 'ఖస్త్రీ'ల గురించి మీడియాతో మాట్లాడారు. 'ఖస్త్రీ' చిత్రం గురించి చెప్తూ ఇది హారర్ కామెడీగా రూపొందుతోందని, ఈ జోనర్‌లో తను ఇప్పటి వరకు నటించలేదంటోంది. నీల్ నితిన్ ముఖేశ్, జాకీ ష్రాఫ్, మందిరా బేడీ తదితరులు 'ఖస్త్రీ' చిత్రంలో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.



భావోద్వేగాలు కరువైన 'పద్మావత్'

బ్యానర్స్: భన్సాలీ ప్రొడక్షన్స్, వయాకామ్ 18 మోషన్ పిక్చర్స్
నటీనటులు: దీపికా పదుకొనే, రణవీర్ సింగ్, షాహిద్ కపూర్ తదితరులు
సంగీతం: సంజయ్ లీలా భన్సాలీ
సినిమాటోగ్రఫీ: సుదీప్ ఛటర్జీ
ఎడిటింగ్: జయంత్ జాదర్, సంజయ్ లీలా భన్సాలీ, అకివ్ అలీ
రచన: సంజయ్ లీలా భన్సాలీ, సంజయ్ కపాడియా
నిర్మాతలు: సంజయ్ లీలా భన్సాలీ, సుధాంశ్ వత్స్, అజిత్ అంధారే
దర్శకత్వం: సంజయ్ లీలా భన్సాలీ

ఈ మధ్య ఎక్కువ వివాదాలతో అసలు విడుదలవుతుందా? లేదా? అనే మీమాంసను ఎదుర్కొన చిత్రం 'పద్మావతి'. ఈ చిత్రానికి వచ్చినన్ని వివాదాలు మరే సినిమాకు రాలేదు మరి. ఎప్పుడో చరిత్రలో అల్లావుద్దీన్ ఖిల్జీ చిత్తోడ్ రాజు రావల్ రతన్ సింగ్‌ను చంపేస్తే.. ఆయన భార్య ఆత్మాహుతి చేసుకుందని చదువుకుని ఉంటాం. ఈ చరిత్రను కొందరు కల్పితం అని అన్న సందర్భాలు కూడా ఉన్నాయి మరి. ఇలాంటి కథ, కథనాలతో సంజయ్ లీలా భన్సాలీ నిర్మాణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పద్మావతి'. అయితే ఈ సినిమావిడుదలకు ముందే యూనిట్‌పై దాడులు జరిగాయి. సినిమా పూర్తయిన తర్వాత సినిమాను విడుదల చేయకూడదని రాజ్‌పుత్ కర్ణిసేనలు ఆందోళనలు చేపట్టడం సహా కేంద్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు కొందరు సినిమా విడుదలపై అభ్యంతరాలను వ్యక్తం చేశారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పద్మావతిపై నిషేధం కూడా విధించాయి. అయితే సెన్సార్ వారు ఐదు కట్స్ విధించి సినిమా విడుదలకు అనుమతి ఇస్తూనే టైటిల్‌ను 'పద్మావత్'గా మార్చమని సలహా ఇవ్వడం తదితర అంశాలతో పద్మావతి టైటిల్ 'పద్మావత్'గా మారి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇంతకు సినిమా ఎలా ఉందనే విషయాన్ని తెలుసుకోవాలంటే ముందు కథేంటో చూద్దాం...

కథ :

మేవాడ్ రాజు రావల్ రతన్ సింగ్(షాహిద్ కపూర్) తన మొదటి భార్యకు ముత్యాలు తేవడానికి సింహళ దేశానికి వస్తాడు. ఆ దేశ యువరాణి పద్మావతి(దీపికా పదుకొనే) వేటాడే సమయంలో... అనుకోకుండా ఆమె బాణం రతన్ సింగ్‌కు తగిలి ప్రమాదం జరుగుతుంది. అయితే రతన్‌సింగ్‌ను పద్మావతి కాపాడుతుంది. పద్మావతిని తొలి చూపులోనే ప్రేమించిన రతన్ సింగ్ ..ఆమె తండ్రి అనుమతితో విహహం చేసుకుని మేవాడ్‌కు మహారాణిని చేస్తాడు. అదే సమయంలో అఫ్ఘనిస్థాన్‌కు చెందిన జలాలుద్దీన్ ఖిల్జీ ఢిల్లీని తన సైన్యంతో ఆక్రమిస్తాడు. అయితే జలాలుద్దీన్‌ను అల్లావుద్దీన్ ఖిల్జీ హతమార్చి ఢిల్లీ సుల్తానుగా అవతరిస్తాడు. దేశద్రోహ శిక్షకు గురైన మేవాడ్ రాజగురువు రాఘవ చింతనుడు కారణంతో పద్మావతి అంద చందాలు గురించి తెలుసుకున్న అల్లావుద్దీన్ మేవాడ్‌పై దండెత్తుతాడు. తదనంతరం పరిస్థితులు ఏంటి? అల్లావుద్దీన్ పద్మావతిని దక్కించుకున్నాడా? లేదా? అనే విషయాలు తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే..

విశ్లేషణ:

సినిమాలను తెరకెక్కించడంలో సంజయ్ లీలా భన్సాలీది ప్రత్యేకమైన శైలి. ఆయన సినిమాలు లార్జర్ దేన్ లైఫ్ అనేలా ఉంటాయి. ముఖ్యంగా హిస్టారికల్ సినిమాలు జోధా అక్బర్, బాజీరావ్ మస్తానీ వంటి వాటిని తెరకెక్కించి ప్రశంసలు అందుకున్న సంజయ్ లీలా భన్సాలీ.. అంతే గ్రాండియర్‌గా 'పద్మావత్'ను తెరకెక్కించారు. మేవాడ్ కోటలు, రాజపుత్రులు, రాజపుత్ర స్త్రీలు వారి వేషధారణ, వారి నృత్యాలు అన్నింటినీ అద్భుతంగా చూపించాడు. ప్రతి సీన్‌ను చాలా రిచ్‌గా చూపించడంలో సంజయ్ తన మార్కును చూపించారు. ఇక సుదీప్ ఛటర్జీ సినిమాటోగ్రఫీ కూడా చాలా బావుంది. రాజ ప్రాసాదాలు, ఢిల్లీ కోటలు, యుద్ధ సన్నివేశాలు ఇలా అన్నింటినీ చక్కగా తెరపై ప్రెజెంట్ చేశాడు. గూమార్ పాట మినహా మరే ట్యూన్ ఆకట్టుకునేలా లేదు. సంచిత్ బల్హారా నేపథ్య సంగీతం కొన్ని చోట్ల బావుంది.. మరికొన్ని చోట్ల సాధాసీదాగా అనిపించింది. ఇక నటీనటుల విషయానికి వస్తే.. టైటిల్ పాత్రలో నటించిన దీపికా పదుకొనే పాత్రకు తగ్గట్టు హుందాగా నటించింది. అయితే రాణి పాత్రలో దీపికా కొన్ని సన్నివేశాల్లో మరీ పీలాగా అనిపిస్తుంది. కాస్ట్యూమ్స్ ఆమెకు సూట్ కాలేదు. ఇక అల్లావుద్దీన్ ఖిల్జీ పాత్రలో రణవీర్ సింగ్ అద్భుతంగా నటించాడు. నెగిటివ్ షేడ్‌లో మంచి నటనను ప్రదర్శించాడు. షాహిద్ కపూర్ నటన కూడా బావుంది. ఫస్టాఫ్ కూడా సాగదీతగా అనిపిస్తుంది. సెకండాఫ్ కూడా స్లో నెరేషన్ కారణంగా కాస్త విసుగ్గానే ఉంటుంది. అందుకు కారణం బలమైన కథ లేకపోవడం.. అయితే గ్రాండ్‌నెస్ ప్రేక్షకుడిని సీట్ నుండి కదలనీయదు. మరి సామాన్య ప్రేక్షకుడి సంగతి చెప్పలేం. మేకింగ్ పరంగా సినిమా గ్రాండ్‌గా ఉన్నప్పటికీ సినిమాలో పాత్రలు, సన్నివేశాల మధ్య ఎమోషన్స్ సరిగ్గా పండలేదు. వివాదాలతో సినిమాకు కావాల్సినంత పబ్లిసిటీ అయితే దక్కింది. సినిమాపై అంచనాలు కూడా మొదలయ్యాయి. అయితే సినిమా చూసిన సగటు ప్రేక్షకుడికి ఈ సినిమాకు ఇంత వివాదం ఎందుకు చేశారనిపించింది? మొత్తగా గ్రాండియర్‌గా హిస్టారిల్ మూవీని చూడాలనుకునే ప్రేక్షకులు ఈ సినిమాను ఒకసారి చూడొచ్చు.

బోటమ్ లైన్: భావోద్వేగాలు కరువైన 'పద్మావత్'

రేటింగ్ : 2.75/5

మనం రివ్యూ

రిపబ్లిక్ డేకి సోల్జర్ పాట

అల్లు అర్జున్ హీరోగా రామలక్ష్మి క్రియేషన్స్ పతాకంపై వక్కంతం వంశీ దర్శకత్వంలో లగడపాటి శిరీషా శ్రీధర్, బన్ని వాస్ నిర్మిస్తున్న చిత్రం 'నా పేరు సూర్య.. నా ఇల్లు నా ఇండియా'. ఈ చిత్రానికి సంబంధించిన యాక్షన్ పార్ట్ చిత్రీకరణ హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడ స్టూడియోలో జరుగుతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గీత రచయిత రామజోగయ్యశాస్త్రి, నిర్మాత లగడపాటి శ్రీధర్ పాల్గొన్నారు. రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ ''ఈ టైటిల్ వినగానే ఒక పవర్‌ఫుల్ టైటిల్ అనేది అర్థమవుతుంది. వంశీగారికి ఇది మొదటి సినిమా అయినప్పటికీ ఎంతో అనుభవం ఉన్న దర్శకులకు ఏమాత్రం తగ్గకుండా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. వంశీగారికి మంచి మ్యూజిక్ టేస్ట్ ఉంది. నేను ఇందులో నాలుగు పాటలు రాశాను. ఇప్పటివరకు ఎక్కువగా టచ్ చేయని సోల్జర్ సబ్జెక్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఆ సోల్జర్‌కి ఎత్తుపీట వేస్తూ ఈ సినిమాలో ఓ పాట రాశాను. సోల్జర్ యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తూ రాసిన పాట నాకు మంచి పేరు తెస్తుంది'' అన్నారు. నిర్మాత లగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ ''రామజోగయ్య శాస్త్రిగారు చాలా మంచి పాటలు రాశారు. బాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్స్ విశాల్, శేఖర్ ఈ సినిమాకి మ్యూజిక్ చేశారు. బన్నితో సినిమా చెయ్యాలని ప్రతి మ్యూజిక్ డైరెక్టర్‌కి వుంటుంది. ఈ రిపబ్లిక్ డేకి సోల్జర్ సాంగ్ రిలీజ్ చెయ్యడం చాలా హ్యాపీగా వుంది. ఫిబ్రవరి 14న మరో పాటని రిలీజ్ చెయ్యాలనుకుంటున్నాం. ప్రస్తుతం ఇక్కడ పీటర్ హెయిన్స్ యాక్షన్ సీక్వెన్స్ చేస్తున్నారు. ఇది ఇంటర్వెల్ బ్యాంగ్ ఫైట్ సీక్వెన్స్. ప్రేక్షకుల ఆశలకు మించి ఈ సినిమా వుండాలన్నది నా ప్రయత్నం. మరో 25 రోజుల షూటింగ్ వుంది. ఏప్రిల్‌లో సినిమాని రిలీజ్ చెయ్యాలని ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు.



బన్ని వాస్, శ్రీధర్, రామజోగయ్య శాస్త్రి

నా కెరీర్‌లో ది బెస్ట్ 'భాగమతి'

- ఆర్ట్ డైరెక్టర్ రవీందర్



అనుష్క ప్రధాన పాత్రలో యు.వి. క్రియేషన్స్ పతాకంపై అశోక్ దర్శకత్వంలో వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న చిత్రం 'భాగమతి'. జనవరి 26న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా ఆర్ట్ డైరెక్టర్ రవీందర్ మాట్లాడుతూ ''ఇది హండ్రెడ్ పర్సెంట్ హారర్ మూవీ కాదు. హారర్‌కి సంబంధించి చిన్న పార్ట్ వుంటుంది. కథ ప్రకారం 400 సంవత్సరాల క్రితం ఒక బంగ్లా కావాలి. అన్ని సంవత్సరాల క్రితం క్లోజ్ చేసిన ఆ బంగ్లాలో వస్తువులు ఏమీ ఉండవు. వీళ్ళ కోసం దాన్ని ఓపెన్ చేస్తారు. అది ఎలా ఉంటే బాగుంటుంది అనేది ఊహించి ఈ సెట్ వెయ్యడం జరిగింది. ఒకరోజు స్కెచెస్ వేసి మా నిర్మాతలకు చూపించాను. అవి చూసి వాళ్ళు ఓకే అనడంతో వర్క్ స్టార్ట్ చేశాం. అయితే ఈ సెట్‌కి సంబంధించిన ముఖ్యమైన విషయాల్ని ఎవరికీ చెప్పలేదు. ఒక సెట్ వర్క్ జరుగుతుందంటే ఎలా జరుగుతుంది అనేది మానిటర్ చేస్తుంటారు. రోజూ వచ్చి చూసి వెళ్తుంటే కిక్ అనేది ఉండదు. టోటల్‌గా కంప్లీట్ అయిన తర్వాత ఒక్కసారి బంగ్లాలోకి వస్తే వావ్ అనే ఫీల్ రావాలన్నది నా ఆలోచన. మొత్తం కంప్లీట్ అయిపోయింది. సెట్ చూసిన యూనిట్ అంతా ఆశ్చర్యపోయారు. ప్రతి ఒక్కరూ దీన్ని ఒక ఛాలెంజ్‌గా తీసుకున్నారు. రవి కంటే మనం బాగా చెయ్యాలన్న పట్టుదల అందరిలోనూ పెరిగింది. అనుష్క అయితే షాక్ అయింది. నా రెస్పాన్సిబులిటీ పెరిగి పోయింది. నేను అనుకున్న దానికంటే బాగా చెయ్యాలి అనే కసి ఆమెకు వచ్చేసింది. ఇలాంటి సెట్‌ని కంప్లీట్ చెయ్యాలంటే నాకు మూడు నెలలు పడుతుంది. అలాంటిది 29 రోజుల్లో పూర్తి చేశాం. దానికి ఓ కొత్త టెక్నిక్ వాడాం. నా కెరీర్‌లో ఇది బెస్ట్ వర్క్ అని చెప్పగలను. అశోక్ చాలా టాలెంట్ వున్న డైరెక్టర్. అతనికి తెలీని విషయం లేదు. దేని గురించైనా మాట్లాడగల నాలెడ్జ్ ఉంది. సినిమాని చాలా అద్భుతంగా తీశారు. తప్పకుండా ప్రతి ఒక్కరూ ఈ సినిమాని చూసి అప్రిషియేట్ చేస్తారు. ప్రస్తుతం నాగచైతన్య, మారుతి సినిమా, శర్వానంద్, సుధీర్‌వర్మ సినిమా, ఇంద్రగంటి మోహనకృష్ణ సినిమాలు చేస్తున్నాను. తమిళ్‌లో ఓ సినిమా చెయ్యబోతున్నాను'' అన్నారు.



తమన్నా, విక్రమ్

యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'స్కెచ్'

విక్రమ్ హీరోగా కలైపులి ఎస్.థాను సమర్పణలో వి క్రియేషన్స్ పతాకంపై విజయ్‌చందర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'స్కెచ్'. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబు మాట్లాడుతూ ''విక్రమ్ నాకు చాలా మంచి స్నేహితుడు. తను చిన్న రేంజ్ నుండి పెద్ద స్టార్‌గా ఎదిగారు. 25 ఏళ్ల క్రితం తనని కలిసినప్పుడు ఎలా ఉన్నారో ఇప్పుడు కూడా అలాగే ఉన్నారు. ఇండస్ట్రీకి మంచి సినిమాలు అవసరం. ఈ సినిమా పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను అన్నారు. విజయ్‌చందర్ మాట్లాడుతూ ''తమిళంలో విడుదలైన స్కెచ్ చిత్రం పెద్ద సక్సెస్ అయ్యింది. తెలుగులో కూడా సినిమా పెద్ద సక్సెస్ సాధిస్తుందని కోరుకుంటున్నాను'' అన్నారు. తమన్నా మాట్లాడుతూ ''నాకు 'స్కెచ్' ప్రత్యేకమైన సినిమా. విక్రమ్‌గారితో పనిచేయాలని కెరీర్ ప్రారంభం నుండి అనుకున్నాను. 10 సంవత్సరాల తర్వాత ఆయనతో కలిసి నటించే అవకాశం కలిగింది. ఆయన నుండి చాలా విషయాలను నేర్చుకున్నాను. నాకు, విక్రమ్‌గారికి మధ్య ప్రేమ సన్నివేశాలు చాలా చక్కగా వచ్చాయి. ఇది మెమొరబుల్ మూవీగా నిలిచిపోతుంది'' అన్నారు. విక్రమ్ మాట్లాడుతూ ''తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో ఈ సినిమా పెద్ద హిట్ అయ్యింది. చాలా గ్యాప్ తర్వాత ఓ కమర్షియల్ ఎంటర్‌టైనర్ చేశాను. తెలుగులో కూడా తప్పకుండా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. డి.సురేష్‌బాబుగారు సినిమాను విడుదల చేస్తుండటం ఆనందంగా ఉంది'' అన్నారు.

కృష్ణపట్నంలో ఆయిల్ రిఫైనరీ

ఏర్పాటుకు సౌదీ ఆర్మ్ కో సంస్థ ఆసక్తి

- దావోస్‌లో ప్రతినిధులతో చంద్రబాబు భేటీ
- రాష్ట్రంలో పర్యటించిన ప్రతినిధులు
- స్థాపనకు ఏపీ అనువైన రాష్ట్రం: సీఎం
- బాబును అభినందించిన ప్రతినిధులు



అమరావతి, జనవరి 23 (మనం ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌లో 974 కి.మీ మేర సముద్రతీరం ఉందని, కృష్ణా-గోదావరి బేసిన్‌లో అపారమైన చమురు నిక్షేపాలు ఉన్నాయని, పెట్రోలియం శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో అనువైన రాష్ట్రమని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు సౌదీ ఆర్మ్ కో సంస్థకు వివరించారు. దావోస్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి ప్రతినిధుల బృందం రెండో రోజు కార్యక్రమాల్లో భాగంగా సౌదీ ఆర్మ్ కో ప్రెసిడెంట్ సైద్ అల్ హద్రమీతో భేటి అయింది. తమ రాష్ట్రాన్ని గుండా రెండు పారిశ్రామిక కారిడార్లు ఉన్నాయని, కృష్ణపట్నాన్ని లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, రిఫైనరీ ఏర్పాటు వాణిజ్యపరంగా ఎంతో లాభసాటిగా ఉంటుందని చంద్రబాబు వారికి సూచించారు. దేశంలో కా మార్కెటింగ్‌కు అనువుగా ఉంటుందని సౌదీ ఆర్మ్ కో సంస్థ ప్రెసిడెంట్‌కు తెలిపారు. పెట్రోలియం, రసాయన పరిశ్రమల ఏర్పాటుకు, విస్తరణకు తమ రాష్ట్రంలో ఇప్పటికే సానుకూల వాతావరణం ఉందని, హెచ్‌పీసీఎల్, గెయిల్ కార్యకలాపాలు ఆయువుపట్టుగా ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ), సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీఐపీఈటీ) సంస్థలను స్థాపంచనున్నామని, ఇందువల్ల నైపుణ్యం కలిగిన మానవ వనరులు లభిస్తాయని ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రంలో సమీప భవిష్యత్తులో పెట్రోలియం పరిశ్రమల ఏర్పాటుకు మరింత అనువైన వాతావరణ ఏర్పడేందుకు దారితీస్తుందని చెప్పారు. గతంలో సీఎంతో భేటీ అయిన సౌదీ సంస్థలలో సౌదీ ఆర్మ్ కో సంస్థ ప్రధాన సంస్థ కావడం గమనార్హం. కృష్ణపట్నంలో రిఫైనరీ ఏర్పాటుకు ఈ సంస్థ ఇప్పటికే ఆసక్తి చూపింది. సంస్థ ప్రతినిధులు రెండు పర్యాయాలు రాష్ట్రాన్ని సందర్శించారు. వారితో నిరంతర సంబంధాలు కొనసాగించడం ద్వారా రాష్ట్రానికి ఎలాగైనా సౌదీ ఆర్మ్ కో రిఫైనరీ తీసుకురావాలన్న పట్టుదలతో చంద్రబాబు ఉన్నారు. ముంబైలో ఈ నెలాఖరున సౌదీ ఆర్మ్ కో ప్రతినిధులతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధులు మరోసారి భేటీ అయ్యే అవకాశాలున్నాయి. కాగా సౌదీ ఆర్మ్ కో కంపెనీ మహారాష్ట్రలో 40 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడితో ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ కంపెనీల సంయుక్త భాగస్వామ్యంతో మెగా రిఫైనరీ ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు చేసింది. అయితే సంయుక్త భాగస్వామ్యం కార్యాచరణ దాల్చలేదు. ఈ దశలో సౌదీ ఆర్మ్ కో సంస్థ రిఫైనరీ ఏర్పాటుకు అన్ని అవకాశాలూ, సామర్థ్యం ఉన్న కీలక ప్రదేశంగా మన రాష్ట్రంలోని కృష్ణపట్నాన్ని గుర్తించింది. నిరుడు అక్టోబరులో ఈ కంపెనీ దేశ రాజధాని ఢిల్లీలో ఆర్మ్ కో ఏషియా-ఇండియా శాఖ కార్యాలయాన్ని కూడా ప్రారంభించింది. భారత పశ్చిమతీరంలో భారీ చమురు శుద్ధి కర్మాగారం ఏర్పాటుకు నిశ్చయించింది. భారత్ మార్కెట్‌లో మరింత వాటా దక్కించుకోవడానికి ఈ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో 640 చ.కి.మీ. మేర చమురు, రసాయనాలు, పెట్రో కెమికల్స్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (పీసీపీఐఆర్)లో ఉందని, అలాగే 6 సెజ్‌లు ఉన్న విషయాన్ని అధ్యయం చేసిన సంస్థ కృష్ణపట్నాన్ని తన పెట్టుబడులకు ప్రాధ్యాన్యతా కేంద్రంగా ఎంపిక చేసుకుంది. ఈ దిశగా వారిని ఒప్పించి మన రాష్ట్రానికి భారీ రిఫైనరీ తీసుకురావాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్‌లో మరోసారి ఈ సంస్థ ప్రతినిధులతో చర్చించారు.

సౌదీ ఆర్మ్ కో సంస్థకు ఆహ్వానం

వచ్చే నెలలో విశాఖపట్నంలో నిర్వహించనున్న సీఐఐ పెట్టుబడిదారుల సదస్సుకు హాజరు కావాలని సౌదీ ఆర్మ్ కో సంస్థ ప్రెసిడెంట్ సైద్ అల్ హద్రమీని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానించారు. తమ రాష్ట్రంలో ప్రాజెక్టుల ఏర్పాటుకు శరవేగంగా చర్యలు తీసుకుంటున్నామని, వ్యాపార సానుకూల వాతవరణం ద్వారా పారిశ్రామికాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ స్థిరంగా ముందుకు వెళ్తోందని వివరించారు. సౌదీ ఆర్మ్ కో ప్రెసిడెంట్ సైద్ అల్ హద్రమీ స్పందిస్తూ.. ''భారత్‌కు ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పారిశ్రామికవేత్తలను ఆకర్షించేందుకు మీరు చూపిస్తున్న వ్యక్తిగత శ్రద్ధను అభినందిస్తున్నాను'' అని ప్రశంసించారు. సౌదీ ఆర్మ్ కో ప్రధానంగా చమురు అన్వేషణ రంగంలో అపార అనుభవం గడించిన సంస్థ. భూమిలో చమురు, సహజవాయు నిక్షేపాలు (హైడ్రో కార్బన్స్) అన్వేషణ, ఉత్పత్తి, ఎల్పీజీ ఉత్పత్తి, చమురు శుద్ధి, చమురు పంపిణీ, క్రూడ్ ఆయిల్ మార్కెటింగ్‌లో ఎంతో ప్రసిద్ధి చెందింది. ముఖ్యమంత్రి బృందంలో మంత్రులు యనమల రామకృష్ణుడు, నారా లోకేశ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ పరకాల ప్రభాకర్, ముఖ్యకార్యదర్శి జి.సాయిప్రసాద్, ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్, ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈవో జాస్తి కృష్ణ కిషోర్, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి ఇసాల్మన్ ఆరోక్యరాజ్, వ్యవసాయ సలహాదారుడు టి.విజయ్‌కుమార్ ఉన్నారు.

యాదవులకు కార్పొరేషన్

అధికారంలోకి రాగానే ఏర్పాటు: జగన్

నెల్లూరు జిల్లాలోకి ప్రజా సంకల్పయాత్ర



పెళ్లకూరు/నాయుడుపేట, జనవరి 23 (మనం న్యూస్): వైసీపీ అధికారంలోకి రాగానే యాదవులకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఆ పార్టీ అధినేత, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. జగన్ ప్రజా సంకల్పయాత్ర చిత్తూరు జిల్లాలో ముగించుకుని నెల్లూరు జిల్లాలో ప్రవేశించింది. యాత్రలో భాగంగా 69వ రోజు మంగళవారం జిల్లాలో అడుగు పెట్టిన జగన్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పెళ్లకూరు మండలంలో అఖిల భారతీయ యాదవ మహాసభ నాయకులు జగన్‌ను కలిశారు. వైసీపీ నేత పార్థసారథి నేతృత్వంలో 13 జిల్లాలకు చెందిన యాదవ సంఘం నాయకులు వచ్చారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు తమ సమస్యలను జగన్‌కు వివరించారు. జగన్ మాట్లాడుతూ.. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే యాదవుల సంక్షేమం కోసం పనిచేస్తుందని హామీ ఇచ్చారు. యాదవులు ఆర్థికంగా వృద్ధి చెందేందుకు వారికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ప్రత్యేక నిధు లు కేటాయించి ఆదుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీల అభివృద్ధిని విస్మరించాడని విమర్శించారు. బీసీలకు కత్తెరలు, ఇస్త్రీ పెట్టెలు ఇచ్చి వాటితో సరిపెట్టారని అన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక బీసీ విద్యార్థుల ఉన్నత చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తామన్నారు.

యువతకు లోకేశ్ ఆదర్శం

- మంత్రిగా వంద మార్కులు: కళా
- కాబోయే సీఎం లోకేశ్: ఆనంద్‌బాబు
- ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు



అమరావతి, జనవరి 23 (మనం ప్రతినిధి): రాష్ట్ర పంచాయతీరాజ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ యువతకు ఆదర్శమని విద్యుత్ శాఖ మంత్రి కిమిడి కళా వెంకట్రావు ప్రశంసించారు. అహర్నిశలు కష్టపడి, అనతి కాలంలోనే మంత్రిగా నూటికి నూరు శాతం మార్కులు సాధించారని కొనియాడారు. లోకేశ్ 35వ జన్మదిన వేడుకలను మంగళవారం టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నాదెండ్ల బ్రహ్మం చౌదరి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు కళా వెంకట్రావు, నక్కా ఆనంద్‌బాబు, గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, టీడీపీ కార్యాలయ కార్యదర్శి ఏవీ రమణ తదితరులు పాల్గొన్నారు. లోకేశ్ వినూత్న కార్యక్రమాలతో చురుగ్గా ముందుకు పోతున్నారని ఆనంద్‌బాబు ప్రశంసించారు. లోకేశ్‌కు మంచి భవిష్యత్తు ఉందని.. రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతారని జోస్యం చెప్పారు. సుభాష్ చంద్ర బోస్ జయంతి రోజునే లోకేశ్ పుట్టిన రోజు కావడం గొప్ప విషయమని, అంతటి కీర్తిప్రతిష్టలు అందుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. లోకేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 35 కిలోల కేక్‌ను కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. గుంటూరు జిల్లా టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు సాకిరి చైతన్య నగరంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న సుమారు వెయ్యి మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్‌ను అందించారు. గుంటూరు రైల్‌పేటలో లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సాయిబాబా గుడి వద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. వృద్ధాశ్రమం వద్ద పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి

- చంద్రబాబు లక్ష్యం ఇదే: ఆదినారాయణ రెడ్డి



కడప, జనవరి 23 (మనం న్యూస్ బ్యూరో): రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి లక్ష్యమని మంత్రి ఆదినారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం గండికోట వారసత్వ ఉత్సవాలలో మంత్రితో పాటు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ లింగారెడ్డి, కలెక్టర్ బాబురావునాయుడు పాల్గొన్నారు. దేశంలోనే రాష్ట్రాన్ని ఉన్నత స్థానంలో నిలిపేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారని, ప్రజా సంక్షేమం కోసం మున్ముందు మరిన్ని పథకాలు ప్రవేశపెడతారని మంత్రి, ఎమ్మెల్సీ తెలిపారు. నిరుద్యోగులకు త్వరలోనే ముఖ్యమంత్రి తీపికబురు చెబుతారని వెల్లడించారు. కడప జిల్లా అభివృద్ధికి చంద్రబాబు ప్రత్యేకశ్రద్ధ చూపిస్తున్నారని తెలిపారు. ఒట్టిపోయిన జలాశయాలకు ముఖ్యమంత్రి మళ్లీ జీవం పోశారన్నారు. త్వరలోనే కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం కల సాకారం అవుతుందని తెలిపారు. మంత్రి ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి గండికోట ఉత్సవాలలో స్టాల్స్‌ను పరిశీలించారు. సాంప్రదాయ క్రీడలను తిలకించారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు అరెస్ట్



విజయవాడ/తాడేపల్లి, జనవరి 23 (మనం న్యూస్ బ్యూరో): సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధును గుంటూరు జిల్లా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో దళిత కాలనీ సందర్శనకు బయలు దేరిన సీపీఎం బృందాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దళితులపై అగ్రవర్ణాల దాడుల నేపథ్యంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు ఆధ్వర్యంలో పార్టీ నేతలు, పలు ప్రజాసంఘాల సభ్యులు కాలనీ సందర్శనకు బయల్దేరారు. వీరిని పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. దీంతో సీపీఎం నేతలకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు మధుతో పాటు పలువురు నేతలను అరెస్ట్ చేసి తాడేపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అంతకు ముందు తెల్లవారుజాము నుంచే పలువురు సీపీఎం నేతలను ఇళ్లకు వెళ్లి మరీ పోలీసులు అరెస్టు చేశారు. గొట్టిపాడు మండల సీపీఎం కార్యదర్శి గంగాధరరావు, రాజధాని డివిజన్ సీపీఎం కార్యదర్శి ఎం. రవితోపాటు కాకాని పట్టణానికి చెందిన పలువురు సీపీఎం నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. దళితులను పరామర్శించడానికి వెళుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధును అడ్డుకోవడంపై దళిత సంఘాలు మండిపడుతున్నాయి. కాగా, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధును పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడానికి ఏపీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి ఖండించారు. అక్రమంగా అరెస్ట్ చేసిన వారిని భేషరతుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

భోగాపురానికి టెండర్

విమానాశ్రయ టెండర్లు రద్దు



- ఎక్కువ రెవెన్యూ కూడా చేదు
- 30.2 శాతం ఇస్తామన్న ఏఏఐ
- 21.6%కే జీఎంఆర్ పరిమితం
- అనుమతులన్నీ కూడా ఓకే..
- అయినా రద్దు చేసిన ప్రభుత్వం
- అశోక్ గజపతికి తీవ్ర అవమానం
- విమానాశ్రయం కలలు ఇక కల్లలే

విశాఖపట్నం, జనవరి 23 (మనం న్యూస్‌బ్యూరో): భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం టెండర్లను రద్దు చేస్తూ కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం తెలుగుదేశం పార్టీకే చెందిన సీనియర్ నాయకుడు, పౌరవిమానయాన శాఖామంత్రి అశోక్ గజపతిరాజుకు ఇబ్బందికరంగా మారింది. ఆయన శాఖ పరిధిలోకి వచ్చే ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ)కు దక్కిన ఈ టెండర్‌ను ఆ సంస్థ నిర్వహణ పట్ల అనుమానాలు వ్యక్తం చేస్తూ రద్దు చేయడం పరోక్షంగా అశోక్‌గజపతి ప్రతిష్ఠనే దెబ్బతీసేలా మారింది. దేశంలో 18 అంతర్జాతీయ విమానాశ్రయాలతో పాటు మొత్తం 125 విమానాశ్రయాలను నిర్వహిస్తున్న ఏఏఐని పక్కన పెట్టడమంటే అశోక్‌ను ఇరకాటంలో పడేయడమే అన్న వాదన అధికార పార్టీ నేతల్లో సైతం వినిపిస్తోంది.

ప్రభుత్వానికి ఎక్కువ వాటా ఇస్తామన్నా రద్దేనా..

రెవెన్యూలో 30.2% వాటా ఇస్తామని ఏఏఐ, 21.6% మాత్రమే ఇస్తామని జీఎంఆర్ పేర్కొన్నాయి. సహజంగానే ఏఏఐకి టెండర్ ఇవ్వాలని అధికారులు సిఫార్సు చేశారు. అన్ని రకాల అనుమతులు కూడా వచ్చేశాయి. ఇక టెండర్ ఖరారు చేసి పనులు ప్రారంభించడమే లాంఛనమని అందనూ అనుకొంటుండగా... టెండర్‌ను రద్దుచేస్తున్నట్లు సీఎం ప్రకటించడంతో కేంద్ర మంత్రితో పాటు ఆ శాఖాధికారులు షాకయ్యారు. ఇప్పటికే పోలవరం లాంటి విషయాల్లో కేంద్ర- రాష్ట్ర సంబంధాలు అంతంత మాత్రంగా ఉన్నాయి. దాంతో భోగాపురం వ్యవహారం ఎంతవరకూ వెళ్తుందోనన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. కేంద్రంపై అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళతానని సీఎం అంటున్నారు. కానీ ఈ విషయంలో కేంద్రమే రాష్ట్రంపై కేసు నమోదుచేసే అవకాశాన్ని కల్పించిందని విశాఖ విమాన ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు డి. వరదారెడ్డి వ్యాఖ్యానించారు. కేవలం లంచాల కోసమే ప్రభుత్వ సంస్థకు వచ్చిన టెండర్‌ను రద్దుచేసి ప్రైవేటు వారికి కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ నరసింగరావు విమర్శించారు. శ్రీకాకుళంలోని భావనపాడు సీ పోర్టు కోసం అదాని సంస్థ ఒక్కటే టెండర్ దాఖలుచేస్తే రద్దు చేసి తిరిగి పిలవాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ఆ టెండర్‌ను ఖరారు చేసి... దీనిని రద్దు చేయడం దారుణమని పేర్కొన్నారు.

అశోక్ కృషి వృథా?

తన సొంత జిల్లా అయిన విజయనగరానికి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తెప్పించుకోవాలన్న తలంపుతో ఎన్నో ఇబ్బందులు, విమర్శలను ఎదుర్కొని భోగాపురం విమానాశ్రయ ప్రాజెక్టును కేంద్రమంత్రి హోదాలో అశోక్ కానుకగా అందించారు. భోగాపురం భూసేకరణ వివాదాస్పదమైన సందర్భంలో ఆయన జోక్యం చేసుకొని పరిష్కరించారు.

ఈ విమానాశ్రయ నిర్మాణానికి పీపీపీ విధానంలో 2016 జూన్‌లో టెండర్లు ఆహ్వానించారు. అయితే, టెండర్ గడువును 2017 జూలై వరకూ పొడిగిస్తూ వచ్చారు. చివరకు ఏఏఐతో పాటు జీఎంఆర్ సంస్థ కూడా టెండరు దాఖలు చేసింది. రెండింటి సాంకేతిక బిడ్లు సక్రమంగానే ఉండటంతో ఆగస్టు 21న అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ సమక్షంలో ఫైనాన్షియల్ బిడ్లు తెరిచారు. రూ. 2461 కోట్ల వ్యయంతో 2703 ఎకరాల్లో భోగాపురం విమానాశ్రయాన్ని నిర్మించేందుకు టెండర్లు పిలిచారు. ఇందులో విమానాశ్రయానికి 1733.66 ఎకరాలు, వాణిజ్య అవసరాలకు 592.69 ఎకరాలు, రహదారులు ఇతర అవసరాలకు 175.70, భోగాపురం ఎయిర్‌పోర్టు కార్పొరేషన్‌కు 201.21 ఎకరాలను కేటాయించారు.

ఐమాక్స్ కేసులో నోటీసులు

హైదరాబాద్, జనవరి 23(మనం లీగల్ ప్రతినిధి): రాజధానిలోని ప్రసాద్ మల్టీప్లెక్స్ థియేటర్‌లో సీట్ల ఏర్పాటు అశాస్త్రీయంగా ఉన్నాయని, ఏదైనా ప్రమాదం జరిగితే ప్రేక్షకులు బయటకు వెళ్లే పరిస్థితి లేదనే కేసులో తెలంగాణ సర్కార్‌లోని పలువురు అధికారులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు హైకోర్టుకు సికింద్రాబాద్‌కు చెందిన విజయ్‌గోపాల్ అనే వ్యక్తి రాసిన లేఖను ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. మంగళవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఎం.గంగారావుతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. లార్జ్ స్క్రీన్ థియేటర్‌లో పద్నాలుగు వరుసల్లో 630 సీట్లు ఉంటే వాటి మధ్య నుంచి బయటకు వచ్చే ఆస్కారమే లేకుండా సీట్లు ఉంటాయని పిటిషనర్ వాదన. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో హైకోర్టుకు లేఖ రాయాల్సివచ్చిందన్నారు. దీనిని మంగళవారం విచారించిన బెంచ్.. ప్రతివాదులైన తెలంగాణ సీఎస్, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు, డీజీపీ, జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్, థియేటర్ యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసింది. తమ వాదనలతో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

'పాలమూరు' కేసు విచారణ వాయిదా

హైదరాబాద్, జనవరి 23(మనం లీగల్ ప్రతినిధి): పాలమూరు ఎత్తిపోతల పథకంలో ఎలక్ట్రో మెకానికల్ యంత్రాల ధరల పెంపును సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు విచారణ మరోసారి వాయిదా పడింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పరికరాల ధరల పెంపు ఆరోపణలపై ఇప్పటికే నోటీసులు అందుకున్న తెలంగాణ ప్రభుత్వం, బీహెచ్ఇఎల్‌లు తమ వాదనలతో కౌంటర్ వేసేందుకు 3 వారాల గడువు మంజూరు చేసింది. ధరల పెంపు కారణంగా తెలంగాణ సర్కార్‌పై కోట్ల రూపాయల అదనపు భారం పడుతుందని పేర్కొంటూ మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాన్ని మంగళవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఎం.గంగారావుతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. తొలుత ఈ కేసు గురించి నాగం హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దాంతో కౌంటర్ వేసేందుకు సమయం కావాలని బీహెచ్ఈఎల్ కోరడంతో అందుకు బెంచ్ అనుమతి ఇచ్చింది. కౌంటర్ కాపీలను ముందుగా పిటిషనర్ నాగానికి అందజేయాలని బెంచ్ ఆదేశించింది. విచారణ మూడు వారాలకు వాయిదా పడింది.

ఆక్రమణలపై నివేదిక ఇవ్వండి: హైకోర్టు

హైదరాబాద్,జనవరి 23(మనం లీగల్ ప్రతినిధి): హైదరాబాద్ మహానగరంలో ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు జరుగుతుంటే అధికారులు ఆక్రమణల్ని తొలగించేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. అధికారులు మీనమేషాలు లెక్కిస్తుంటే హైకోర్టు చూస్తూ కూర్చోదు. అందుకే నగరంలోని సిద్ధి అంబర్‌బజార్, మహబూబ్‌గంజ్‌లలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణల పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌ను ఆదేశిస్తున్నాం.. అని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఎం.గంగారావుతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ప్రకటించింది. న్యాయాధికారి స్వయంగా ఆయా ప్రదేశాలకు వెళ్లి వాస్తవ పరిస్థితిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. ఫుట్‌పాత్ ఆక్రమణల్ని అధికారులు తొలగించడం లేదని, ఫిర్యాదు చేసిన ఫలితం లేదంటూ లక్ష్మీనివాస్ అగర్వాల్ అనే వ్యక్తి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం రూపంలో ఆశ్రయించారు. ఆక్రమణల తొలగింపు చర్యల్లో భాగంగా కమిటీ ఏర్పాటు చేశామని తెలంగాణ ఏజీ ప్రకాష్‌రెడ్డి చెప్పగా, ఇవన్నీ నామమాత్రపు చర్యలని పిటిషనర్ బెంచ్ దృష్టికి ఫొటోలతో సహా తీసుకొచ్చారు. పైగా పోలీసులు తనను బెదిరిస్తున్నారని కూడా చెప్పారు. దాంతో క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితిని తెలుసుకుని నివేదిక ఇవ్వాలని మేజిస్ట్రేట్‌ను హైకోర్టు ఆదేశించి విచారణను వాయిదా వేసింది.

స్కూలు ఫీజులు పెంచొద్దు

- సర్కారు ఆదేశాలు.. మరోసారి సర్క్యులర్ జారీ

హైదరాబాద్, జనవరి 23: ప్రైవేటు స్కూళ్లు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు మంగళవారం సర్క్యులర్ జారీ చేసింది. ఈ నెల 11 న పాఠశాలల యజమాన్యాలతో భేటీ అయిన పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ..ఫీజులు పెంచుకుంటామని చెప్పిన విషయం తెలిసిందే. దీనిపై సీరియస్ గా స్పందించిన విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆచార్య..1983 ఎడ్యుకేషనల్ ఆక్ట్ ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ అధికారం ఉందని తెలిపారు. చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అవసరమైతే పాఠశాలల గుర్తింపు రద్దు చేసే అధికారం తమకు ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరోసారి సర్క్యులర్ జారీ చేసింది. ఆదేశాలను ధిక్కరిస్తే చర్యలు తప్పవని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఎన్ని కుట్రలు చేసినా..
టీడీపీ జెండా ఎగరవేస్తాం: రమణ

హైదరాబాద్, జనవరి 23(మనం ప్రతినిధి): తెలంగాణలో టీడీపీ లేకుండా చేసేందుకు టీఆర్ఎస్ కుట్రలు చేస్తోందని టీటీడీపీ అధ్యక్షుడు ఎల్ రమణ ఆరోపించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తెలంగాణలో టీడీపీ జెండా ఎగరేసి తీరుతామని ఆయన దీమా వ్యక్తంచేశారు. గతంలో రామ్‌లాల్‌ను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ పార్టీ టీడీపీ ప్రభుత్వాన్ని అక్రమంగా తొలగించగా.. ప్రజల మద్దతుతో పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. పార్టీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణ కార్యక్రమానికి సంబంధించి నాలుగో బ్యాచ్ తరగతులను మంగళవారం రమణ ప్రారంభించారు. అంతకుముందు ఏపీ మంత్రి, టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ జన్మదినోత్సవం సందర్భంగా రమణ కేక్ కట్ చేశారు. టీటీడీపీ తరపున లోకేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంచిర్యాల జిల్లా, నెన్నెల మండల టీడీపీ అధ్యక్షుడు రంగు రామగౌడ్‌పై అక్రమ కేసులు బనాయించి ప్రభుత్వం హింసించడంతో ఆత్మహత్య చేసుకున్నాడని రమణ ఆరోపించారు. ప్రభుత్వ అక్రమాలను ప్రశ్నించిన కారణంగా రామగౌడ్‌పై ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టిందని రమణ తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నేతలెవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని, సమస్యను తమ దృష్టికి తీసుకొస్తే అండగా నిలుస్తామని రమణ సూచించారు. రామగౌడ్ కుటుంబాన్ని ఆదుకుంటామని ఆయన తెలిపారు.

మైండ్‌గేమ్ ఆడుతున్న జగన్

- ఏపీ మంత్రి కామినేని శ్రీనివాస్

అమరావతి, జనవరి 23 (మనం ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తే బీజేపీతో కలుస్తానంటూ వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఏపీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ మండిపడ్డారు. జగన్ లాంటి అవినీతిపరులతో బీజేపీ ఎట్టి పరిస్థితుల్లో కలవబోదని ఆయన స్పష్టం చేశారు. జగన్ కావాలనే మైండ్ గేమ్ ఆడుతున్నారని ఆయన పేర్కొన్నారు. టీడీపీ - బీజేపీ కలిసినందుకే ప్రజలు ఆదరించి ఓట్లు వేశారని ఆయన అభిప్రాయపడ్డారు. మున్ముందు కూడా ఈ బంధం కొనసాగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఫార్మా డీ కోర్సు సాంకేతిక విద్యాశాఖ పరిధిలో ఉంది తప్ప.. వైద్య శాఖలో లేదని మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు. తనను కలిసిన ఫార్మా డీ యూనియన్ నాయకులతో ఆయన మాట్లాడారు.




కొనసాగుతున్న రికార్డులు


నిఫ్టీ మొదటిసారి 11 వేల మైలురాయిని అధిగమించగా, సెన్సెక్స్ 36 వేల పాయింట్ల ఎగువున ముగిసింది

ముంబయి: భారతదేశం 2018-19లో ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ కిరీటాన్ని తిరిగి సంపాదించుకోగలదని ఐ.ఎం.ఎఫ్. పేర్కొనడంతో మంగళవారంనాడు మొదటిసారిగా నేషనల్ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్.ఎస్.ఇ) ఇండెక్స్ 11,000 మైలురాయిని అధిగమించింది. బొంబాయి స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బి.ఎస్.ఇ) సెన్సెక్స్ 36,000 పాయింట్ల ఎగువ స్థాయిన ముగిసింది. 30 షేర్ల బి.ఎస్.ఇ. సూచి 341.97 పాయింట్లు లాభపడి 36,139.98 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్.ఎస్.ఇ. 50 షేర్ల సూచి 'నిఫ్టీ' 117.50 పాయింట్లు లాభపడి 11,083.70 పాయింట్ల వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఇంట్రా-డేలో36,170.83 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. సోమవారంనాటి 35,798.01 పాయింట్ల గరిష్ఠ స్థాయి రికార్డును అది ఆ విధంగా తిరగరాసింది. సెన్సెక్స్ కేవలం ఐదు ట్రేడింగ్ సెషన్లలో (జనవరి 17-23) 35,000 పాయింట్ల స్థాయి నుంచి చరిత్ర సృష్టిస్తూ 36,000 పాయింట్ల స్థాయికి చేరుకుంది. 'నిఫ్టీ' ఆరు నెలల్లో (2017 జూలై 26-ఈ ఏడాది జనవరి 23) 10,000 పాయింట్ల నుంచి 11,000 పాయింట్ల మైలురాయికి చేరుకుంది. 'నిఫ్టీ' మంగళవారం ఇంట్రా-డేలో 11,092.90 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. సోమవారంనాటి 10,966.20 పాయింట్ల గరిష్ఠ స్థాయి రికార్డును అలా మెరుగుపరచుకుంది. కంపెనీలు ప్రకటిస్తున్న త్రైమాసిక ఆదాయాలు మదుపరుల సెంటిమెంట్‌ను పెంపొందించడంతో రెండు సూచీలు వరుసగా ఐదవ సెషన్‌లోనూ రికార్డులు నెలకొల్పుతూ గరిష్ఠ స్థాయిల్లో ముగిసాయి. తాత్కాలికంగా నిధులు సమకూర్చే బిల్లుకు అమెరికా ప్రభుత్వం ఆమోదం తెలుపడం కూడా దేశీయ సెంటిమెంట్‌కు ఊతమిచ్చింది. ప్రపంచంలోని పెద్ద ఆర్థిక వ్యవస్థలో ఆ విధంగా ప్రతిష్ఠంభనకు తెరపడింది. ప్రపంచ మార్కెట్ల సంకేతాలు సానుకూలంగా ఉండడం, విదేశీ నిధులు నిర్విరామంగా వచ్చి పడుతూండడంతో మార్కెట్‌లో పటిష్ఠంగా ఉన్న లిక్విడిటీ, ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ వెలువడనుండగా, ఇన్వెస్టర్ల కార్యకలాపాలు ముమ్మరమవడంతో మార్కెట్లు రికార్డులు నెలకొల్పుతూ హెచ్చు స్థాయిలకు చేరాయని బ్రోకర్లు చెబుతున్నారు. ''ఆదాయాలు ఇంతవరకు సానుకూలంగా ఉన్నాయి. స్థూల ఆర్థిక అంశాలు మార్కెట్ కదలికలకు చోదక శక్తిగా ఉంటున్నాయి'' అని మార్కెట్‌స్మిత్‌లో రిసెర్చ్ కలాపాల విభాగాధిపతి సుధాకర్ పట్టాభిరామన్ చెప్పారు. ఫైనాన్షియల్ సేవలు సమకూర్చే విలియం ఓ నీల్ సంస్థలో మార్కెట్‌స్మిత్ ఒక భాగం. పెద్ద నోట్ల రద్దు, జి.ఎస్.టి. ప్రభావాలపై భయాలు తగ్గుముఖం పడుతున్నాయని కూడా ఆయన చెప్పారు.

తాత్కాలిక డాటా ప్రకారం, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు సోమవారం రూ. 1567.51 కోట్ల విలువ చేసే షేర్లు కొనుగోలు చేశారు. మూడు రోజుల ప్రభుత్వ ప్రతిష్ఠంభనకు తెర దించుతూ అమెరికన్ సెనెటర్లు ఒక ఒప్పందానికి రావడంతో మంగళవారంనాడు ఆసియాలో ఇతర మార్కెట్లు కూడా పురోగమించాయి. వాల్ స్ట్రీట్‌లోని ప్రధాన సూచీలు గరిష్ఠ స్థాయిలు నమోదు చేశాయి. అమెరికా చట్టసభ్యులు సోమవారం ఆమోదించిన తాత్కాలిక చర్యతో అక్కడి ఫెడరల్ ప్రభుత్వానికి ఫిబ్రవరి 8 వరకు నిధుల లభ్యత సమస్య తీరింది.




సెన్సెక్స్ — జనవరి 2018 — 23




పెరిగినవి	%	తగ్గినవి	%
ఎస్‌బిఐ	3.84	విప్రో	-1.50
టాటా స్టీల్	3.72	టాటా మోటార్స్	-0.83
ఓఎన్‌జీసీ	3.60	ఏసియన్ పెయింట్స్	-0.75
ఐసీఐసీఐ బ్యాంక్	3.06	హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్	-0.64
కోల్ ఇండియా	3.04	టీసీఎస్	-0.42

నిఫ్టీ — జనవరి 2018 — 23



పెరిగినవి	%	తగ్గినవి	%
వేదాంత	5.06	అంబుజా	-2.14
హిందాల్కో	3.86	ఐషర్	-2.09
ఎస్‌బిఐ	3.78	విప్రో	-1.96
టాటా స్టీల్	3.66	జీ ఎంటర్‌టైన్‌మెంట్	-1.92
సీప్లా	3.53	హెచ్‌పీసీఎల్	-1.47

పేమెంట్ - సెటిల్‌మెంట్ సిస్టమ్‌లు



ఆధారం: ఆర్.బి.ఐ

'భారత్ స్థితి ఆశాజనకం'

న్యూఢిల్లీ: భారతదేశ వృద్ధి సామర్థ్యంపై అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐ.ఎం.ఎఫ్) ఆశాజనంగానే ఉంది. స్థూల జాతీయోత్పత్తి (జి.డి.పి)లో భారత్ 2017-18లో 6.7 షాచం. 2018-19లో 7.4 శాతం వృద్ధి రేటు కనబరచగలదని అంచనా వేసింది. భారతీయ ఆర్థిక వ్యవస్థ 2019లో 7.8 శాతం చొప్పున వృద్ధి చెందగలదని ప్రపంచ ఆర్థిక దృక్పథ తాజా నివేదికలో ఐ.ఎం.ఎఫ్. అంచనా వేసింది. దీన్నిబట్టి 2018లోను, 2019లోను ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందే ఆర్థిక వ్యవస్థ భారతదేశమేనన్నమాట. ఈ టాప్ ర్యాంక్‌ని భారత్ 2017లో కొద్ది కాలం చైనాకు కోల్పోయింది. ''ప్రవర్థమాన మార్కెట్లు, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల 2018 సంవత్సర, 2019 సంవత్సర సగటు వృద్ధి అంచనాలో ఎలాంటి మార్పూ లేదు...భారతదేశంలో మాత్రం వృద్ధి పుంజుకోవచ్చని భావిస్తున్నాం...'' అని దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల సందర్భంగా విడుదలైన ఆ నివేదిక వెల్లడించింది. ఈ అంచనా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జి.డి.పి. వృద్ధి 6.5 శాతం ఉండగలదని కేంద్ర గణాంకాల కార్యాలయ అధికారిక అంచనాలకు అనుగుణంగానే ఉంది. వాషింగ్టన్ డి.సి. కేంద్రంగా ఉన్న ఐ.ఎం.ఎఫ్. 2017 అక్టోబరులో భారతదేశపు వృద్ధి అంచనాను తగ్గించింది. ''2016 నవంబరులో ప్రవేశపెట్టిన కరెన్సీ మార్పిడి చర్యకు సంబంధించి కొనసాగుతున్న అవాంతరాలు, జాతీయ వస్తువులు, సేవల పన్ను ప్రవేశపెట్టడంతో పరిణామక్రమ వ్యయాలను'' దృష్టిలో పెట్టుకుని ఆ పని చేసినట్లు తెలిపింది. ఇదే ఐ.ఎం.ఎఫ్. భారతదేశపు జి.డి.పి. వృద్ధి 2017లో 7.2 శాతంగా, 2018లో 6.6 శాతంగా ఉండగలదని గత ఏప్రిల్‌లో అంచనా వేసింది. దీనికి విరుద్ధంగా, చైనా వృద్ధి మందగించగలదని, 2017లో ఉన్న 6.8 శాతం నుంచి 2018లో 6.6 శాతానికి, 2019లో మరింతగా క్షీణించి 6.4 శాతానికి తగ్గగలదని ఐ.ఎం.ఎఫ్. అంచనా.



ప్రపంచ ఆర్థిక వ్యవస్థ

అయితే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైన మాత్రం ఐ.ఎం.ఎఫ్. మరింత ఆశాభావాన్ని కనబరచింది. ప్రపంచ ఉత్పత్తి 2018లో, 2019లో 3.9 శాతం చొప్పున పెరగగలదని అంచనాను పెంచింది. అక్టోబరులో వెల్లడించిన అంచనాకన్నా అది 0.2 శాతం ఎక్కువ. ప్రపంచ వృద్ధి 2017లో 0.1 శాతం పెరిగి 3.7 శాతంగా ఉండగలదని అది అంచనా వేసింది. ''ఈ సవరణ ప్రపంచ వృద్ధి గతిలో పెరిగిన వేగాన్ని, ఇటీవల ఆమోదం పొందిన అమెరికా పన్ను విధాన మార్పులు చూపగల ప్రభావాన్ని ప్రతిబింబిస్తోంది'' అని ఐ.ఎం.ఎఫ్. పేర్కొంది. అమెరికా పన్ను విధాన మార్పులు ఆర్థిక కార్యకలాపాలను ఉద్దీపింపజేయగలవని తెలిపింది. కార్పొరేట్ ఆదాయ పన్నుల్లో కోత స్వల్పకాలంలో ఇన్వెస్ట్‌మెంట్ పరంగా ఉండవచ్చని చెప్పింది. అమెరికా 2017లో 2.3 శాతం, 2018లో 2.7 శాతం, తదుపరి సంవత్సరం 2.5 శాతం ఉండగలదని ఐ.ఎం.ఎఫ్. అంచనాను గణనీయంగా పెంచింది.

ఎల్.టి.టి.ఎస్‌కి పెరిగిన లాభం

L&T Infotech

న్యూఢిల్లీ: టెక్ సంస్థ ఎల్. అండ్ టి. టెక్నాలజీ సర్వీసెస్ (ఎల్.టి.టి.ఎస్) 2017 డిసెంబరు త్రైమాసికానికి రూ. 126.3 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం అదే కాలంలో చూపిన రూ. 108.7 కోట్ల నికర లాభంతో పోలిస్తే అది 16.1 శాతం పెరిగినట్లు లెక్క. కంపెనీ రాబడి గత ఆర్థిక సంవత్సరం క్యూ 3లో ఉన్న రూ. 810.4 కోట్ల నుంచి 2017 డిసెంబరు క్వార్టరులో రూ. 969.1 కోట్లకు పెరిగింది. ''మళ్ళీ దశ ఎత్తుకున్న ప్రాసెస్ ఇండస్ట్రీతో సహా అన్ని వెర్టికల్స్ వృద్ధిని కనబరుస్తూండడంతో మా వృద్ధి మరింత విస్తృతమైనదని చెప్పవచ్చు. వస్తూత్పత్తి, ఐ.ఐ.ఓ.టి., తదుపరి తరం ప్లాట్‌ఫాం డెవలప్‌మెంట్, అటానమస్ డ్రైవింగ్‌కు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించడం వంటి అంశాలపై మేం క్లయింట్లతో చర్చిస్తున్నాం'' అని ఎల్. అండ్ టి. టెక్నాలజీ సర్వీసెస్ సి.ఇ.ఓ., మేనేజింగ్ డైరెక్టర్ కేశబ్ పాండా చెప్పారు. కంపెనీకి చెందిన డిజిటల్ ఇంజనీరింగ్ పోర్ట్‌ఫోలియో స్థిర వేగంతో పెరుగుతూ వస్తోందని, రాబడులలో దాని వాటా 20 శాతంగా ఉందని కేశబ్ తెలిపారు. ఎల్.టి.టి.ఎస్.కు 2017 డిసెంబర్ క్వార్టరుకు 151 మిలియన్ అమెరికన్ డాలర్ల రాబడి లభించింది. ఈ ఆర్థిక సంవత్సరం క్యూ 3 ముగిసేనాటికి, ఎల్.టి.టి.ఎస్.కు చెందిన పేటెంట్ల పోర్ట్‌ఫోలియో వద్ద 300 పేటెంట్లు ఉన్నాయి. వాటిలో 228 పేటెంట్లు కస్టమర్లతో కలసి గడించినవి కాగా, 72 పేటెంట్లు కంపెనీ దాఖలు చేసినవి. నార్త్ అమెరికా నుంచి 58.7 శాతం, ఐరోపా మార్కెట్ నుంచి 17.2 శాతం, ఇండియా నుంచి 11.5 శాతం, ప్రపంచంలోని మిగిలిన ప్రాంతాల నుంచి 12.6 శాతం వ్యాపారం లభించినట్లు ఎల్.టి.టి.ఎస్. నివేదించింది. దానివద్ద 2017 డిసెంబరు ముగిసేనాటికి 11,941 మంది పనిచేస్తున్నారు.

ర్యాలీస్ ఇండియాకు తగ్గిన నికర లాభం



న్యూఢిల్లీ: వ్యవసాయ సొల్యూషన్ల సంస్థ ర్యాలీస్ ఇండియా 2017 డిసెంబర్ త్రైమాసికానికి రూ. 24.94 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని మాత్రమే చూపగలగడంతో ఆ సంస్థ షేర్ల విలువ మంగళవారం 7 శాతంపైగా పడిపోయింది. ర్యాలీస్ ఇండియా షేర్ ధర బి.ఎస్.ఇ.లో మంగళవారం 7.10 శాతం పైగా తగ్గి, రూ. 251.90 వద్ద ముగిసింది. ఇంట్రా-డేలో అది రూ. 250.25 కనిష్ఠ స్థితిని చూసింది. ఎన్.ఎస్.ఇ.లో కూడా ఈ కంపెనీ షేర్ ధర 6.82 శాతం క్షీణించి రూ. 252.45 వద్ద ముగిసింది. టాటా గ్రూప్‌నకు చెందిన ఈ సంస్థ గత ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో రూ. 25.34 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. కంపెనీ నికర ఆదాయం గత ఆర్థిక సంవత్సరం క్యూ 3లో ఉన్న రూ. 352.19 కోట్ల నుంచి ఈ ఆర్థిక సంవత్సరం అక్టోబరు-డిసెంబరు కాలంలో రూ. 393.86 కోట్లకు పెరిగింది.

సింఫనీకి పెరిగిన నికర లాభం

Symphony

న్యూఢిల్లీ: ఎయిర్ కూలింగ్ సంస్థ సింఫనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో ఒంటరిగా రూ. 66.31 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అహ్మదాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థ గత ఆర్థిక సంవత్సరం అక్టోబర్-డిసెంబర్ కాలంలో చూపిన రూ. 54.93 కోట్ల నికర లాభంతో పోలిస్తే అది 20.71 శాతం పెరిగినట్లు లెక్క. అలాగే, దాని మొత్తం ఆదాయం కూడా 2017-18 డిసెంబరు క్వార్టరులో రూ. 225.67 కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం అదే కాలంలో దాని ఆదాయం రూ. 189.57 కోట్లుగా ఉంది. రూ. 2 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేరుకు రూ. 1 చొప్పున 2017-18 మొత్తం ఆర్థిక సంవత్సరానికి కంపెనీ డైరెక్టర్ల బోర్డు తాత్కాలిక డివిడెండు ప్రకటించింది. సింఫనీ షేర్ ధర బి.ఎస్.ఇ.లో మంగళవారం రూ. 1989.35 వద్ద ట్రేడయింది.

బుల్లితెరపై 'లిటిల్ సింగం'



న్యూఢిల్లీ: లిటిల్ సింగం పేరుతో కొత్త యానిమేషన్ సిరీస్ రూపొందించడానికి అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్ సంస్థ రిలయన్స్ యానిమేషన్‌ను తోడు చేసుకున్నట్లు డిస్కవరీ కమ్యూనికేషన్స్ ఇండియా మంగళవారం ప్రకటించింది. హిందీ చిత్రసీమలో ఘన విజయం సాధించిన 'సింగం' ఈ సిరీస్‌కి ప్రేరణ. భారతదేశంలో బాలల ఒరిజినల్ కంటెంట్‌కి డిస్కవరీ కమ్యూనికేషన్స్ ఇండియా ఇంతవరకు ఇంతపెద్ద పెట్టుబడి ఎక్కడా పెట్టలేదని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఫైనాన్షియల్ వివరాలను మాత్రం అది వెల్లడించలేదు. ''ఇండియాలో బాలల విభాగంలో లిటిల్ సింగం ఐ.పి. (మేధా హక్కు) ఈరోజు వరకు నిస్సందేహంగా మా పెద్ద పందెం అవుతుంది. వినియోగదార్ల పరిశోధనలో లభించిన సానుకూల ఫీడ్‌బ్యాక్ ఆధారం చేసుకుని దాన్ని ఎంపిక చేశాం'' అని డిస్కవరీ కమ్యూనికేషన్స్ ఇండియా సీనియర్ ఉపాధ్యక్షుడు, దక్షిణాసియా విభాగ జనరల్ మేనేజర్ కరణ్ బజాజ్ చెప్పారు. ఇండియాలో పిల్లల జనర్‌లో రారాజుగా వెలుగొందాలన్న కంపెనీ అభిమతానికి పెట్టుబడుల స్థాయి, లిటిల్ సింగం వెనుక చేసే కృషి ప్రతీకాత్మకంగా ఉంటాయని ఆయన అన్నారు. రిలయన్స్ యానిమేషన్ ఈ ప్రాజెక్టులోకి దాదాపు 250 మంది యానిమేషన్ ఆర్టిస్టులను తీసుకుంది. సిరీస్ ప్రారంభమయ్యే సమయానికి ఈ సంఖ్య ఇంకా పెరుగుతుందని భావిస్తున్నట్లు రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సి.ఓ.ఓ. శివాశీస్ సర్కార్ చెప్పారు. డిస్కవరీ కిడ్స్ చానల్‌లో 2018 ఏప్రిల్‌లో లిటిల్ సింగం మొదటిసారి బుల్లితెరపై దర్శనం ఇవ్వనుంది. నాలుగు నుంచి ఎనిమిదేళ్ళ వయసు బాలలను దృష్టిలో పెట్టుకుని దీన్ని రూపొందిస్తున్నారు. ఇది ఇంగ్లీషు, హిందీ, తమిళ, తెలుగు భాషల్లో ప్రసారమవుతుంది.

ఎన్.ఐ.ఐ.టి. లాభం 350 శాతం జంప్




న్యూఢిల్లీ: ప్రతిభ, నైపుణ్యాల అభివృద్ధి కంపెనీ ఎన్.ఐ.ఐ.టి. 2017 డిసెంబర్ 31తో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత నికర లాభంలో 350 శాతం పెరుగుదలను కనబరుస్తూ రూ. 19.7 కోట్లను నమోదు చేసింది. కార్పొరేట్ లెర్నింగ్ వ్యాపారంలో పటిష్ఠమైన వృద్ధితో అలా నికర లాభాన్ని పెంచుకోగలిగినట్లు తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం అదే కాలంలో దాని నికర లాభం రూ. 4.4కోట్లుగా మాత్రమే ఉంది. కంపెనీ నికర రాబడి కూడా ఏడాది క్రితం అదే కాలంలో ఉన్న రూ. 202 కోట్ల నుంచి 2017-18 మూడవ త్రైమాసికంలో 4 శాతం పెరిగి రూ. 209.4 కోట్లకు చేరుకుంది. కార్పొరేట్ లెర్నింగ్ గ్రూప్ (సి.ఎల్.జి)లో కొనసాగుతున్న బలమైన వృద్ధి ఇతర వ్యాపారాలలో పటిష్ఠమైన నిర్వహణా నియంత్రణలు కాన్‌స్టెంట్ కరెన్సీలో గో ఫార్వర్డ్ బిజినెస్‌లో గత ఆర్థిక సంవత్సరంకన్నా 8 శాతం వృద్ధిని సాధించడానికి దోహదపడ్డాయని ఎన్.ఐ.ఐ.టి. ప్రధాన కార్యనిర్వహణాధికారి సప్నేశ్ లాలా చెప్పారు. వడ్డీ, పన్నులు, తరుగుదల, రుణవిముక్తికి ముందు ఆదాయంలో వృద్ధి క్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే, ఈ ఆర్థిక సంవత్సరం క్యూ 3 నాటికి 69 శాతం వృద్ధి చెందినట్లు ఆయన తెలిపారు. సీజన్‌పరంగా అది బలహీనమైన త్రైమాసికం అయినప్పటికీ, వృద్ధిని కనబరచగలిగినట్లు ఆయన చెప్పారు. కాన్‌స్టెంట్ కరెన్సీలో ఈ ఆర్థిక సంవత్సరం క్యూ 3లో సి.ఎల్.జి. రూ. 129.4 కోట్ల నికర రాబడిని నమోదు చేసింది. స్కిల్స్ అండ్ కెరీర్స్ గ్రూప్ (ఎస్.ఎన్.సి) రూ. 69.1 కోటి నికర రాబడి చూపింది. మైండ్ చాంపియన్ లెర్నింగ్ సిస్టమ్స్ (ఎం.ఎల్.ఎస్.ఎల్) 2017 డిసెంబరు త్రైమాసికంలో రూ. 9.2 కోట్ల నికర రాబడిని నమోదు చేసింది. ఎం.టి.ఎస్. కాంట్రాక్టు పునరుద్ధరణ వల్ల కంపెనీ 199 మిలియన్ డాలర్ల రాబడిని చూడగలిగింది. ఎన్.ఐ.ఐ.టి.లో 2017 డిసెంబరు క్వార్టరు అంతానికి 3,741 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. కంపెనీ షేర్ ధర బి.ఎస్.ఇ.లో రూ. 108.50 వద్ద కోట్ అవుతోంది.

పెరిగిన మెట్రో అమ్మకాలు



న్యూఢిల్లీ: మెట్రో క్యాష్ అండ్ క్యారీ ఇండియా 2017 డిసెంబర్‌తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో అమ్మకాలలో 16 శాతం పెరుగుదలను 798 మిలియన్ల యూరోలుగా (సుమారుగా రూ.6,242 కోట్లు) నమోదు చేసింది. జర్మనీ రిటైలింగ్ దిగ్గజం మెట్రో ఏ.జి.లో భాగమైన ఈ సంస్థ జనవరి-డిసెంబరు కాలాన్ని తన ఆర్థిక సంవత్సరంగా పాటిస్తుంది. ''భారత్ మాకు కీలక వృద్ధి మార్కెట్. లాభదాయకమైన, స్థిరమైన వృద్ధిని సాధించడంపై మేం దృష్టి కేంద్రీకరించాం. మా ఉనికిని పెంచుకోవాలని, వివిధ ప్రాంతాల్లో స్వతంత్ర వ్యాపారాలకు ఆలంబనగా నిలవాలని కృత నిశ్చయంతో ఉన్నాం'' అని మెట్రోస్ హోల్‌సేల్ (ఇండియా) మేనేజింగ్ డైరెక్టర్, సి.ఇ.ఓ. అరవింద్ మెదిరట్ట చెప్పారు. కంపెనీ ఆర్డరు, చెల్లింపు, డెలివరీ (ఓ.పి.డి)ని ప్రారంభించడం వల్ల 2016-17 ఆర్థిక సంవత్సరం వ్యూహాత్మకంగా ముఖ్యమైన సంవత్సరమని ఆయన చెప్పారు. దీని వల్ల వర్తకులు, కిరాణా దుకాణాలవారికి ఆన్‌లైన్‌లో ఆర్డరు చేస్తే దుకాణం ముంగిటకు సరుకులొచ్చే సదుపాయం ఏర్పడిందని చెప్పారు. హోటళ్ళు, రెస్టారెంట్లు, కేటరర్ల విభాగానికి ప్రత్యేక విలువ ప్రతిపాదనను రూపొందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నైపుణ్యాన్ని ఉపయోగించుకోవడం ద్వారా ఆ పని చేస్తున్నట్లు తెలిపారు. ఆవిష్కరణలతో ఆ విభాగాన్ని పటిష్ఠపరుస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం బెంగళూరు, హైదరాబాద్, ముంబయి, ఢిల్లీ, కోల్‌కతా, జైపూర్, జలంధర్‌లతో సహా కంపెనీ దేశవ్యాప్తంగా 24 స్టోర్సులు నిర్వహిస్తోంది. కంపెనీ 2020 నాటికి దేశంలో 50 స్టోర్సులు పనిచేసేట్లు చేయాలని భావిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా 25 దేశాలలో మెట్రో క్యాష్ అండ్ క్యారీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

'భారత్‌లో పెట్టుబడులకు సాటిలేని అవకాశం'



దావోస్: భారతదేశంలో విదేశీ పెట్టుబడుల ఉధృతి కొనసాగేందుకు అపారమైన అవకాశం ఉందని, దాన్ని ప్రపంచంలో మరే ప్రాంతంలో అందుబాటులో ఉన్నదానితోనూ పోల్చలేమని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారతదేశ పాత్ర పెరుగుతోందని, 'బీటలువారిన ప్రపంచంలో' సమస్యలను పరిష్కారం చూపగల నాయకునిగా భారత్‌ను చూస్తున్నారని ఆయన అన్నారు. ''రానున్న రోజుల్లో, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశ పాత్ర, (సామాజిక ఉద్రిక్తతలను, వాతావరణ మార్పు సమస్యలను తగ్గించడంలో, ఉగ్రవాదంపై పోరాడడంలో) పెరుగుతుందేకానీ తగ్గదు'' అని పీయూష్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యక్తిగత జనాకర్షణ, ఆమోదయోగ్యత చాలా అధికంగా ఉందని, ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలను గమనించడంలో ఆయన నాయకత్వ సామర్థ్యాన్ని కనిపెట్టి ప్రపంచ నాయకులందరూ గౌరవంతో చూసే నాయకునిగా మోదీ అవతరించారని పీయూష్ చెప్పారు. ''ఒక రకంగా, ఆ గౌరవం 125 కోట్ల మంది భారతీయులకు దక్కినట్లు భావించవచ్చు'' అని ఆయన అన్నారు. భారతదేశం ఒక అగ్ర రాజ్యంగా రూపాంతరం చెందుతున్న విధానం, నూతన ఆర్థిక వ్యవస్థ, నూతన భారతదేశంలోకి, ప్రపంచం మొత్తం ఎంతో ఆసక్తితో చూస్తోందని అన్నారు. ''కడచిన మూడేళ్ళుగా మనం వేగంగా వృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నాం. భారతదేశం మౌలిక వసతులు అభివృద్ధిపరచుకోవడంతో, భారత్‌లో భారీ పెట్టుబడి అవకాశాన్ని జనం చాలా స్పష్టంగా చూస్తున్నారు. 2 ట్రిలియన్ల డాలర్ల ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌తో మనం మౌలిక వసతులను గమనిస్తున్నాం. ఈ రకమైన అవకాశం పోల్చదగినది మొత్తం ప్రపంచంమీద మనకు మరెక్కడా కనిపించదు'' అని పీయూష్ అన్నారు. భారత్‌లో పెట్టుబడి అవకాశాన్ని చూస్తున్నవారి సంఖ్య ఇప్పటికే పెరుగుతూ వస్తోంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఇదివరకే పెద్దయెత్తున వృద్ధి చెందాయి. భారత్‌లో పెట్టుబడులుకు ఇప్పటికీ పెద్ద అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది'' అని ఆయన చెప్పారు. ఎవరికివారే యమునాతీరే అన్న చందంగా ఉన్న ప్రపంచంలో అందరూ పంచుకోదగిన భవిష్యత్‌ను సృష్టించుకోవడం దావోస్ శిఖరాగ్ర సమావేశాల ప్రధాన భావనగా ఉంది. భారత్‌ను ఇప్పుడు కేవలం ఒక పెద్ద మార్కెట్‌గానేకాక, వివిధ ఉద్రిక్తతలు, రిస్కులను ఎదుర్కొంటున్న ప్రపంచంలో (అందుకే దాన్ని బీటలువారిన ప్రపంచంగా అభివర్ణిస్తున్నారు) అందరినీ కలసిగట్టుగా ఉంచగల శక్తిగా చూస్తున్నారని ఆయన అన్నారు. ''ప్రపంచంలో ప్రస్తుతం ఉన్న ఉద్రిక్తతలను సడలింపజేయడంలో భారతదేశం ముఖ్యమైన పాత్ర పోషించబోతోంది. భారత్ పాత్రకు దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వంటి వేదికలలో తప్పకుండా గుర్తింపు లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తపరచారు. ''భారత్ వైపు చూడండి. భారత్‌లో పెట్టుబడులు పెట్టే విషయాన్ని ఆలోచించండి అన్నదే తాము ప్రపంచానికి ఇద్దే సందేశం'' అని పీయూష్ అన్నారు. భారతీయులు నవ యుగ టెక్నాలజీలను కూడా అందిపుచ్చుకోగలరని ఆయన అన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో మనం మన ఆధిపత్యాన్ని నిరూపించుకున్నాం. ప్రపంచంలోని అన్ని పెద్ద ఐ.టి. కంపెనీలలోను భారతీయులు పనిచేస్తున్నారని, కృత్రిమ మేధ, 3డి మాన్యుఫ్యాక్చరింగ్ వంటి కొత్త రంగాల్లో కూడా మనం అటువంటి విజయాలను ఆశించవచ్చని ఆయన చెప్పారు. ''ఈ నూతన ఆవిష్కరణలు ప్రపంచానికి సేవ లందించడంలో భారతదేశపు శక్తిని మరింత పెంచుతాయి'' అని ఆయన అన్నారు.

మనం
వికాస్
బుధవారం 24 జనవరి 2018
www.manamnews.com

రీ-స్కిల్లింగ్



ఫ్రెషర్, ట్రైనీ, సీనియర్.. స్థాయి ఏదైనా ఇప్పుడందరి దృష్టి రీ-స్కిల్లింగ్‌పైనే! స్కిల్స్, స్కిల్ గ్యాప్ గురించి తెలుసు..'రీ-స్కిల్లింగ్' అంటే ఏమిటి? నిపుణుల అభిప్రాయంలో రీ-స్కిల్లింగ్ అంటే.. నూతన టెక్నాలజీ, నైపుణ్యాలపై నిరంతరం అవగాహన పెంపొందించుకోవడం!

కంపెనీలు తమ ఉత్పత్తులు, సేవల ప్రక్రియలో ప్రవేశపెడుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఉద్యోగులకు సరైన అవగాహన ఉండాలని కోరుకుంటున్నాయి. అలాంటి వారినే ప్రోత్సహిస్తున్నాయి. అంటే.. రీ స్కిల్లింగ్‌తోనే కెరీర్‌లో ముందుకు సాగే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో రీ స్కిల్లింగ్ గురించి తెలుసుకుందాం..

మరికొద్ది రోజుల్లో సర్టిఫికెట్ చేతికందనుందనే ఆనందం! నాలుగేళ్ల కృషి ఫలితంగా బీటెక్ పూర్తవుతోందనే సంతోషం! మరోవైపు జాబ్ మార్కెట్లో సరికొత్త ట్రెండ్స్, తాజా సర్వేలపై ఆందోళన! సర్టిఫికెట్లు సరే.. స్కిల్స్ మాటేంటి?' అంటున్న కంపెనీల ఎథోరణితో భవిష్యత్పై బెంగ!

రాత పరీక్ష, ఇంటర్వ్యూలను దాటి.. కొలువులో చేరి ఇంకా సంవత్సరం కూడా కాలేదు. కానీ, కంపెనీలో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాల్సిందేనంటూ యాజమాన్యం నుంచి హెచ్చరికలు! ప్రొబేషన్ పూర్తికాకుండానే ఉద్యోగ భద్రతపై ఆందోళన!



సంస్థలో పదేళ్ల అనుభవం.. అంచెలంచెలుగా ఎదుగుతూ టీమ్ను నడిపించే స్థాయి! ఎన్నో టాస్క్‌లను విజయవంతంగా పూర్తిచేసి కంపెనీ వృద్ధిలో కీలకంగా నిలిచిన ఘనత! అయినా ఉద్యోగాన్ని కాపాడుకోవాలంటే కొత్త నైపుణ్యాలు నేర్చుకోక తప్పదనే సంకేతం!

ఇలా.. ఫ్రెషర్స్, ట్రైనీ, మిడిల్ లెవల్, సీనియర్ లెవల్.. ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ ఎదురవుతున్న సమస్య.. స్కిల్లింగ్, రీ-స్కిల్లింగ్. కాబట్టి కాలేజీలో చదువుతున్న విద్యార్థులతోపాటు ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్నవారు సైతం తమ తమ రంగాలకు సంబంధించిన నూతన నైపుణ్యాలు, టెక్నాలజీల గురించి తెలుసుకోవాలి. వాటిని పరిశ్రమలో ఏ స్థాయిలో అమలుచేస్తున్నారనే దానిపై అవగాహన పెంపొందించుకోవాలి.

సమయం విలువ



మనిషి జీవిత చక్రంలో సమయం అత్యంత కీలకమైంది. దీని విలువ తెలుసుకుని నడుచుకుంటే జీవితంలో వృద్ధిలోకి వస్తారు. లేకుంటే.. సోమరిపోతుగానే జీవితాన్ని గడపక తప్పదు. అలాంటి విలువైన సమయంలో మీరు వృధా చేసే సమయం విలువ నేటి యువత తెలుసుకోవాల్సిందే. లేకుంటే వారి జీవితాలు వ్యర్థం కావడం ఖాయమని శాస్త్రవేత్తలు చెపుతున్నారు. అలాగే, ఈ ఆధునిక టెలికామ్ యుగంలో ఒక యేడాదిలో ఒక వ్యక్తి ఫోన్ మాట్లాడే సమయం గరిష్టంగా మూడు నెలలుగా ఉంటుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఇలాంటి అనేక విషయాలను పరిశీలించినపుడు ఒక మనిషి జీవితకాలంలో ఎంత సమయాన్ని వృధా చేస్తున్నారో ప్రతి ఒక్కరూ గ్రహించాలి. ముఖ్యంగా, నేటి యువత ఒక కార్యాన్ని లేదా పనిని అనుకున్నప్పుడు దాన్ని వాయిదా వేస్తుంటారు. ఇలా వాయిదా వేయడమంటే వారికి మహా సరదా కూడా. కానీ, ముఖ్యమైన పనులన్నీ పక్కన పెట్టి కొన్ని టీవీ ఛానల్స్‌లో వచ్చే ఏమాత్రం ఉపయోగంలేని కార్యక్రమాలను చూడడానికి అత్యుత్సాహం చూపుతారు. దీనివల్ల ఎంతో సమయం వృధాగా కరిగిపోతుంది.



డేటా సైన్స్

ప్రస్తుతం ఉన్న కంప్యూటర్ యుగంలో అన్ని ఐటీ కంపెనీలు డేటా సైన్స్‌ను ఆశ్ర యిస్తున్నాయి. సంస్థ ఏదైనప్పటికీ ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో ముందుండాలంటే పదునైన పథక రచన చేసి, అమలు చేసే సామర్థ్యం కావాలి. లేదంటే అపజయమే.. అందుకే ఇప్పుడు ఆ కంపెనీ, ఈ కంపెనీ అని కాకుండా అన్నీ 'డేటా సైన్స్'ను ఆశ్రయిస్తున్నాయి. ఈ వారం వికాస్‌లో డేటా సైన్స్ గురించి తెలుసుకుందాం...

కొత్త కొలువుల వెల్లువ..

సరైన సమాచార విశ్లేషణతోనే సక్సెస్ సాధ్యమని గట్టిగా నమ్ముతున్నాయి. ఈ క్రమంలో తయారీ బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, టెలికం, ఆరోగ్య సంరక్షణ ఇలా అన్ని రంగాల్లోనూ 'డేటా సైన్స్' నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. తగిన నైపుణ్యాలతో జాబ్ మార్కెట్‌లోకి అడుగుపెడితే చాలు.. ఆకర్షణీయ వేతన ప్యాకేజీలతో కొలువులు లభిస్తున్నాయి. అందుకే నేడు ఆధునిక యువతకు 'డేటా సైన్స్' ఆకర్షణీయ కెరీర్ ఆప్షన్‌గా నిలుస్తోంది.

డేటా సైన్స్?



సమాచార ఉత్పత్తి జరగని ప్రాంతమంటూ ఉండదు. నేటి కంప్యూటర్ ప్రపంచంలో రోజురోజుకూ డిజిటల్ డేటా శరవేగంగా పెరుగుతోంది. ప్రస్తుతం దాదాపు 2.7 జెటాబైట్ల (ఒక జెటా బైట్=10007 బైట్లు) మేర ఉన్న డేటా, 2025 నాటికి 180 జెటాబైట్లకు చేరుతుందని అంచనా. ఈ డేటాలో ఫేస్‌బుక్‌లో అప్‌డేట్ చేసిన ఫొటో దగ్గరి నుంచి 'ఫార్చ్యూన్ 500' కంపెనీల ఆర్థిక సమాచారం వరకు ఏదైనా ఉండొచ్చు. అందుబాటులో ఉన్న ఈ సమాచారంలో అవసరమైన దాన్ని సేకరించి.. సాంఖ్యక (స్టాటిస్టికల్), పరిమాణాత్మక (క్వాంటిటేటివ్), సాంకేతిక (టెక్నికల్) పద్ధతులు ఉపయోగించి విశ్లేషించడాన్ని డేటా సైన్స్‌గా చెప్పొచ్చు. ఇందులో పనిచేసే నిపుణులను డేటా సైంటిస్టులుగా పిలుస్తారు. వ్యాపార కార్యకలాపాల విస్తృతికి, అభివృద్ధికి అవసరమైన నిర్ణయాలు తీసుకోవడంలో డేటా సైంటిస్టులు సంస్థలకు సహాయపడతారు.

పెరుగుతున్న డిమాండ్...

ఈ-కామర్స్, ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ), ఫైనాన్షియల్ సర్వీసెస్, హెల్త్‌కేర్, టెలికం... ఇలా వివిధ రంగాల కంపెనీలు విజయపథంలో నడిచేందుకు 'డేటా సైన్స్'ను ఆసరాగా చేసుకుంటున్నాయి. అయితే ప్రస్తుతం డిమాండ్‌కు తగిన విధంగా మానవ వనరులు అందుబాటులో లేవు. ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ (ఐడీసీ) అంచనాల ప్రకారం బిగ్ డేటా టెక్నాలజీ, సర్వీసుల మార్కెట్ 26.4 శాతం వార్షిక వృద్ధితో 2018 ముగిసే నాటికి 41.5 బిలియన్ డాలర్లకు చేరనుంది. అదే విధంగా డేటా సైంటిస్టుల డిమాండ్ 2020 నాటికి 28 శాతం మేర పెరగనున్నట్లు ఐబీఎం అంచనా వేసింది. జాబ్ పోర్టల్స్‌లో డేటా సైంటిస్టుల జాబ్ పోస్టింగ్స్ రోజురోజుకూ పెరుగుతున్నాయి.


సుస్థిర కెరీర్ సొంతం

సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో సాఫ్ట్‌వేర్ కంపెనీలకు 'డేటా సైన్స్ సన్ రైజ్' విభాగంగా కనిపిస్తోంది. ఈ క్రమంలో రోజురోజుకూ డేటా సైన్స్ విభాగంలోకి అడుగుపెడుతున్న ఐటీ కంపెనీలు అధికమవుతున్నాయి. దీన్నిబట్టి చూస్తే ఐటీ రంగంలోనూ డేటా సైన్స్ నిపుణులకు తీవ్ర డిమాండ్ ఏర్పడనుంది. ప్రస్తుతం ఉన్న ఐటీ ఉద్యోగుల్లో 50 శాతం మంది డేటా సైన్స్ వంటి ఇతర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఒంటబట్టించుకోకుంటే కెరీర్ పరంగా ఒడుదొడుకులను ఎదుర్కొనే ప్రమాదముందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. సాధారణ ఐటీ నిపుణుడితో పోలిస్తే అదే వయసు, అనుభవం ఉన్న డేటా సైన్స్ నైపుణ్యాలున్న వ్యక్తికి 20 నుంచి 40 శాతం అధిక వేతనాలు లభిస్తున్నాయి. ఇలాంటి సానుకూల వాతావరణం కారణంగా డేటా సైన్స్ నైపుణ్యాలున్న వారికి సుస్థిర కెరీర్ సొంతమని చెప్పొచ్చు.

ప్రవేశ మార్గాలు..

ప్రస్తుతం భారత్‌తో పాటు ప్రపంచ వ్యాప్తంగా డేటా సైన్స్ నిపుణులకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు సంబంధిత కోర్సులను యువత ముందుంచుతున్నాయి. ఇవి ఫ్రెషర్స్, వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు టెక్నికల్, మేనేజ్‌మెంట్ స్కిల్స్ మెళవింపుతో కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్- కలకత్తా; ఐఐఎం-బెంగళూరు; ఐఐఎం-లక్నో; ఐఐటీ-హెచ్ తదితర సంస్థలు డేటా సైన్స్ కోర్సులను అందిస్తున్నాయి. సంస్థలు ఆన్ క్యాంపస్, ఆన్‌లైన్ బోధనా పద్ధతులను అవలంబిస్తున్నాయి. బెంగళూరు, హైదరాబాద్ తదితర నగరాల్లో ప్రైవేటు శిక్షణ సంస్థలు కూడా డేటా సైన్స్ కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి. ప్రముఖ సంస్థలతో పోల్చితే ఇవి తక్కువ ఫీజుల్లో కోర్సులను అందిస్తున్నాయి. అదే విధంగా మైక్రోసాఫ్ట్ సర్టిఫికేషన్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా డేటా సైన్స్‌లో ఉన్నత అవకాశాలు అందుకోవచ్చు. త్వరలోనే అధిక సంఖ్యలో యూనివర్సిటీలు డేటా సైన్స్ సంబంధిత కోర్సులను ప్రవేశపెట్టే అవకాశముంది.

కోర్సుల్లో ప్రవేశాలకు కొన్ని ఇంజనీరింగ్/బిజినెస్ మేనేజ్‌మెంట్, కామర్స్, మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్ తదితర అంశాల్లో బ్యాచిలర్ డిగ్రీని అర్హతలుగా పేర్కొంటున్నాయి. మరికొన్ని మాస్టర్స్ డిగ్రీని అర్హతగా నిర్దేశిస్తున్నాయి. పని అనుభవం ఉన్నవారికి కూడా ప్రత్యేకంగా కోర్సులు ఉంటున్నాయి.





కరిక్యులమ్ వివరాలు...

డేటా సైన్స్ బేసిక్స్ (డేటా క్వైరీస్, డేటా అనాలిసిస్, డేటా విజువలైజేషన్ తదితర), ఎక్సెల్, డేటా సైన్స్ ప్రోగ్రామింగ్ లాంగ్వే జెస్, మెషీన్ లెర్నింగ్, ఆర్-ఫర్ డేటా సైన్స్, పైథాన్ ఫర్ డేటాసైన్స్, హడూప్, స్పార్క్, ఎస్క్యూఎల్ డేటా బేస్/కోడింగ్, ఎస్ఏఎస్, అండర్ స్టాడింగ్ స్టాటిస్టిక్స్, కోర్ డేటా సైన్స్ కాన్సెపట్స్ తదితర అంశాలను కరిక్యులంలో భాగంగా బోధిస్తున్నాయి. డేటా సైన్స్ కోర్సుల్లో ప్రాక్టికల్స్, రియల్‌టైమ్ ప్రాజెక్టులు ముఖ్యమైనవి.

ఉద్యోగావకాశాలు...

డేటా సైంటిస్టు ఉద్యోగాన్ని 21వ శతాబ్దపు సెక్సీయెస్ట్ జాబ్‌గా హార్వర్డ్ బిజినెస్ రివ్యూ (హెచ్‌బీఆర్) అభివర్ణించింది. డేటా సైన్స్ నైపుణ్యాలున్న వారికి బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఈ-కామర్స్, ఫార్మా/హెల్త్ కేర్, ఐటీ-ఐటీఈఎస్, ఎనర్జీ, యుటి లిటీస్, మీడియా, ఎంటర్టైన్మెంట్, రిటైల్, సీపీజీ, ఆటోమొబైల్, ట్రావెల్ అండ్ హాస్పిటాలిటీ తదితర రంగాల్లో అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. 2016లో డేటా అనలిటిక్స్‌లోని 42 శాతం ఉద్యోగాలను బ్యాంకింగ్ రంగం అందించగా, ఇది 2017లో 46 శాతంగా నమోదైంది. డేటా ఉద్యోగాల కల్పనలో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, హెచ్‌సీఎల్, ఐబీఎం, గోల్డ్‌మన్ శాచ్, యాక్సెంచర్, కేపీఎంజీ, ఈ అండ్ వై, క్యాప్జెమిని తదితర సంస్థలు ముందంజలో ఉన్నాయి. ఢిల్లీ/గుర్గావ్, ముంబై, పుణె, బెంగళూరు, కోల్కతా, హైదరాబాద్ తదితర నగరాలు డేటా ఉద్యోగాలకు వేదికలుగా నిలుస్తున్నాయి.

జాబ్ ప్రొఫైల్స్

సంపాదించిన నైపుణ్యాల ఆధారంగా సంస్థల్లో వివిధ హోదాల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. అవి.. డేటా సైంటిస్ట్, డేటా అనలిస్ట్, అనలిటిక్స్ మేనేజర్, స్టాటిస్టికల్ అనలిస్ట్, ఎస్ఏఎస్ అనలిస్టు, డేటా కన్సల్టెంట్, డేటా డెవలపర్, బిగ్ డేటా ఇంజనీర్ తదితర ప్రొఫైల్స్‌లో ఉద్యోగాలు ఉంటాయి.

కార్పొరేట్ కంపెనీలు ప్రతిభ, అనుభవం ఆధారంగా వేతనాలు అందిస్తున్నాయి. ప్రతిభ ఉన్న డేటా సైన్స్ నిపుణులకు కంపెనీలు సగటున రూ.12 లక్షల వరకు వార్షిక వేతనం అందిస్తున్నాయి.

రీసెర్చ్ అనాలసిస్ వింగ్

రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ భారత్‌కు చెందిన విదేశీ గుఢచార ఏజెన్సీ. దీని ప్రధాన కార్యాలయం రాజధాని న్యూఢిల్లీలో ఉంది. 1969 సెప్టెంబరు 21 న ఏర్పడింది. రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ భారత విదేశీ గుఢాచార సంస్థ. 1962లో జరిగిన భారత్ చైనా యుద్ధం, 1965లో జరిగిన భారత్-పాకిస్తాన్ యుద్ధం అనంతరం విదేశాలపై గట్టి నిఘా ఉంచేందుకు ఒక సంస్థ అవసరం ఏర్పడింది. అప్పటివరకూ విదేశీ, స్వదేశీ నిఘా వ్యవ స్థను ఇంటలిజెన్స్ బ్యూరో(ఐబీ) పర్యవేక్షించేది. 1968 సెప్టెంబరులో ఇంట లిజెన్స్ బ్యూరో నుంచి వేరుగా నిఘా కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ పేరటి మరో సంస్థను ఏర్పాటు చేశారు. 'రా'కు ప్రత్యేకంగా విదేశాలపై నిఘా పెట్టే బాధ్యతను అప్పగించారు. ఇంటలిజెన్స్, బ్యూరో, ఇతర నిఘా సంస్థల మధ్య సంబంధాలను పర్యవేక్షి స్తుంది. 'రా' కేంద్ర కేబినెట్‌లో భాగం. ఇది పార్లమెంట్‌కు సమాధానం చెప్పనవసరం లేదు. సమాచార హక్కు చట్టం నుంచి దీనికి మినహాయింపు ఉంది. 'రా' కు ఆర్క్ (ఏఆర్‌సీ-ఏవియేషన్ రీసెర్చ్ సెంటర్) వైమానిక నిఘా వ్యవస్థ కూడా ఉంది. వివిధ దేశాల నిఘా సంస్థలతోనూ 'రా' కు సత్సంబంధాలు ఉంటాయి. 'రా' గూఢచారుల బహుళజాతి సంస్థలు, ఎంబసీలు, వివిధ ఆఫీసుల్లో పనిచేస్తూ తమ కార్యకలాపాలను నిర్వహిస్తూ ఉంటారు. పొరుగు దేశాల రాజకీయ, రక్షణ అభివృద్ధి కార్యకలాపాలు ఏవైతే భారతదేశ రక్షణ, విదేశీ వ్యవహారాలను ప్రభావితం చేయగలవో వాటిపై నిఘా ఉంచుతుంది. ఇతర దేశాల నుంచి దేశ భద్రతకు ఉన్న ముప్పును ముందుగానే పసిగట్టడం రక్షణ దిగుమతులు తదితరాలపై కన్నేసి ఉంటుంది.



మనం స్పోర్ట్స్
బుధవారం, 24 జనవరి, 2018
www.manamnews.com

నాదల్ రిటైర్

క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ మధ్యలో తప్పుకున్న స్పెయిన్ ఆటగాడు


మెర్టెన్స్



- సెమీఫైనల్లో ఎడ్మండ్ • మెర్టెన్స్ కూడా
- మూడో సీడ్ డిమిట్రోవ్‌కు చుక్కెదురు
- ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్ శ్లామ్

మెల్బోర్న్: ప్రపంచ నంబర్ వన్, స్పెయిన్ బుల్ రాఫెల్ నాదల్ ఆస్ట్రేలియన్ ఓపెన్ మ్యాచ్ మధ్యలో తప్పుకున్నాడు. మంగళవారమిక్కడ జరిగిన పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో మారిన్ సిలిక్ 3-6, 6-3 (5), 6-7, 6-2, 2-0తో ఉన్నప్పుడు నాదల్ రిటైర్ అయ్యాడు. 3 గంటల 47 నిమిషాలు జరిగిన ఈ పోరులో ఐదో సెట్ ఆరంభంలోనే నాదల్ కుడికాలులో తీవ్ర నొప్పి కలిగింది. ట్రీట్‌మెంట్ ఇచ్చినప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోవడంతో పోటీ నుంచి తప్పుకున్నాడు. 2010లో ఇదే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆండీ ముర్రేతో క్వార్టర్ ఫైనల్లోనూ నాదల్ రిటైర్ అయ్యాడు. నాదల్ తప్పుకోవడంతో సెమీఫైనల్‌కు చేరుకున్న మారిన్ సిలిక్ బ్రిటన్ ఆటగాడు కైల్ ఎడ్మండ్‌తో తలపడతాడు. మరో మ్యాచ్‌లో ఎడ్మండ్ అద్భుత ప్రతిభ కనబరిచి సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఎడ్మండ్ 6-4, 3-6, 6-3, 6-4తో మూడో సీడ్ గ్రిగర్ డిమిట్రోవ్‌ను చిత్తు చేశాడు. అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగిన 23 ఏళ్ల ఎడ్మండ్ తొలిసారి గ్రాండ్ శ్లామ్ క్వార్టర్ ఫైనల్ ఆడాడు. ఈ మ్యాచ్‌లో ఎడ్మండ్ ఏ దశలోనూ ఒత్తిడికి గురికాలేదు. అతని బెదురులేని ఫోర్‌హ్యాండ్ షాట్లకు డిమిట్రోవ్ టెన్షన్ పడ్డాడు. గత రౌండ్ మ్యాచ్‌లో హోం ఫేవరెట్ నిక్ కిర్గియోస్‌ను ఇంటికి పంపిన డిమిట్రోవ్ మళ్లీ ఫామ్‌లోకి వచ్చేందుకు నానా ఇబ్బందులు పడ్డాడు. తొలి సెట్‌లో 4-4తో స్కోరు సమానంగా ఉన్న సమయంలో డిమిట్రోవ్ సర్వీస్‌ను ఎడ్మండ్ బ్రేక్ చేశాడు. తర్వాత రెండో సెట్‌ను డిమిట్రోవ్ సొంతం చేసుకున్నాడు కానీ ఏ దశలోనూ సౌకర్యవంతంగా కనిపించలేదు. ఇక మూడో సెట్‌లో ఎడ్మండ్ 3-4తో ఉన్నప్పుడు డిమిట్రోవ్ డబుల్ ఫాల్ట్ చేయడంతో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఇక నాలుగో సెట్‌లోనూ డిమిట్రోవ్ సర్వీస్‌ను ఎడ్మండ్ బ్రేక్ చేసి సెమీఫైనల్‌కు చేరుకున్నాడు.

మహిళల విభాగంలోనూ ఆస్ట్రేలియన్ ఓపెన్ అరంగేట్ర ప్లేయర్, బెల్జియంకు చెందిన అన్‌సీడెడ్ ఎలైస్ మెర్టెన్స్ సంచలనం సృష్టించింది. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో మెర్టెన్స్ 6-4, 6-0తో ప్రపంచ 4వ ర్యాంక్ ప్లేయర్ ఎలినా స్విటోలినాను వరుస సెట్లలో ఓడించి సెమీఫైనల్‌కు చేరుకుంది. 1 గంట 13 నిమిషాల్లో ప్రత్యర్థిపై గెలిచింది. ఇప్పటి వరకు ఒక్క సెట్ కూడా కోల్పోని మెర్టెన్స్ 2012 తర్వాత సెమీఫైనల్‌కు చేరిన తొలి బెల్జియన్‌గా రికార్డుల్లోకెక్కింది. 'నాకు మాటలు రావట్లేదు. ఏం చెప్పాలో తెలియడం లేదు. ఈ రోజు బాగా ఆడానని మాత్రమే చెప్పగలను' అని మెర్టెన్స్ చెప్పింది. 22 ఏళ్ల మెర్టెన్స్ కిమ్ క్లిస్టర్స్ ఆకాడమీలో తన బాయ్‌ఫ్రెండ్, కోచ్ రాబ్ సెస్సెన్స్ వద్ద శిక్షణ తీసుకుంటోంది. రెండో సీడ్ కరోలిన్ వోజ్నియాకి కూడా సెమీఫైనల్ చేరుకుంది. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో వోజ్నియాకి 6-0, 6-7 (3-7), 6-2తో సారెస్ నవర్రోపై గెలిచింది.


డిమిట్రోవ్

జ్వెరెవ్‌కు భారీ జరిమానా

జర్మనీకి చెందిన మిచా జ్వెరెవ్‌కు భారీ జరిమానా పడింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ తొలి రౌండ్ మ్యాచ్‌లో ఆమె రిటైర్మెంట్ తీసుకుంది. దీంతో కొత్త నిబంధనల ప్రకారం ఆమెకు 45 వేల యూఎస్ డాలర్ల జరిమానా విధించారు. ఇది ఆమెకు భారీ జరిమానా అని చెప్పాలి. ఎందుకంటే ఈమె తొలి రౌండ్ మ్యాచ్ ప్రైజ్‌మనీ 47 వేల డాలర్లు. కొత్త నిబంధనల ప్రకారం 'ఏ ప్లేయర్ అయినా మెయిన్ డ్రా సింగిల్స్ తొలి రౌండ్‌లో పాల్గొని రిటైర్మెంట్ ఇచ్చినా లేదా స్థాయికి తగ్గట్టు ఆడకపోయినా తొలి రౌండ్ ప్రైజ్‌మనీని జరిమానా విధిస్తారు' కేవలం తొలి రౌండ్ ఆడినందుకే లక్షలాది డాలర్లు చెల్లించాల్సి వస్తోంది. అలాంటిది తొలి రౌండ్ కూడా సరిగా ఆడకుండా వేలాది డాలర్ల ప్రైజ్‌మనీని సొంత చేసుకునే వారి ఆట కట్టించేందుకు ఈ కొత్త నిబంధనను తెరపైకి తెచ్చారు.



మమ్మల్నీ గుర్తించండి

- మంత్రిత్వ శాఖకు బ్లైండ్ క్రికెటర్ల విజ్ఞప్తి

న్యూఢిల్లీ: బ్లైండ్ క్రికెట్ వరల్డ్ కప్‌ను గెలిచిన భారత జట్టు స్వదేశం చేరుకుంది. షార్జాలో జరిగిన ఈ టోర్నీ ఫైనల్లో భారత్ 2 వికెట్లతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. అయితే తమ అసోసియేషన్‌కు కూడా గుర్తింపు ఇవ్వమని బ్లైండ్ క్రికెటర్లు క్రీడా మంత్రిత్వ శాఖకు విజ్ఞప్తి చేశారు. తాము కూడా దేశానికి కీర్తి ప్రతిష్టలు సంపాదిస్తున్నప్పటికీ తమకు ఎటువంటి గుర్తింపు లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 1998లో ఇండియన్ బ్లైండ్ క్రికెట్ జట్టు ఏర్పాటైంది. ప్రస్తుతం ఈ జట్టు క్రికెట్ అసోసియేషన్ ఫర్ బ్లైండ్ ఇన్ ఇండియా (సీఏబీఐ) సంరక్షణలో నడుస్తోంది. దీనికి లాభాపేక్ష లేని సంస్థ సమర్థనం ట్రస్ట్ అండగా నిలుస్తోంది. 'సీఏబీఐని క్రీడల మంత్రిత్వ శాఖ గుర్తించాలి. యూఏఈకి వెళ్లేటప్పుడు క్రీడల మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ కనీసం మా వద్దకు వచ్చి బెస్ట్ విషెస్ కూడా చెప్పలేదు. ఇప్పుడైనా గుర్తింపునివ్వాలని కోరుకుంటున్నాం. ఆయన ప్రవర్తనకు మా పిల్లలు చాలా నిరుత్సాహం చెందారు. ఒక క్రీడాకారుడిగా ఆయన మాకు గుర్తింపునివ్వాలి. చాలా దేశాల్లో ప్రధాన బోర్డులు బ్లైండ్ క్రికెట్‌కు గుర్తింపునిచ్చాయి. మద్దతునిస్తున్నాయి. అదేవిధంగా బీసీసీఐ కూడా గుర్తించాలి. వారు మా నుంచి ఇంకేం ఆశిస్తున్నారో తెలీదు. మా పిల్లలు నాలుగు వరల్డ్ కప్‌లు గెలిచారు. కేవలం 59 నెలల్లో రెండు టీ20, రెండు వన్డే, ఒక ఆసియా చాంపియన్‌షిప్ టైటిల్ గెలిచారు' అని సీఏబీఐ అధ్యక్షుడు జీకే మహంతేష్ అన్నారు.



మహిళల వరల్డ్ టీ20కి... వెస్టిండీస్ ఆతిథ్యం

దుబాయ్: మహిళల టీ20 వరల్డ్ కప్‌కు వెస్టిండీస్ ఆతిథ్యమివ్వనుంది. కరేబియన్‌లోని నాలుగు వేదికల్లో (ఆంటిగ్వా, బార్బుడా, గుయానా, సెయింట్ లూసియా) ఈ ఏడాది నవంబర్ 9 నుంచి 24 వరకు జరుగుతుందని ఐసీసీ ప్రకటించింది. డిఫెండింగ్ వెస్టిండీస్ జట్టు టైటిల్‌ను నిలబెట్టుకునే ప్రయత్నం చేయనుంది. ఎందుకంటే 2016లో కోల్‌కతాలో జరిగిన ఫైనల్లో వెస్టిండీస్ 8 వికెట్లతో ఆస్ట్రేలియాను ఓడించింది. గతేడాది 2017 ఐసీసీ మహిళల టీ20 జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైన స్టఫనీ టేలర్ భారత్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచింది. ఇప్పుడు సొంత అభిమానుల ముందు వెస్టిండీస్ జట్టును ఆమె ముందుండి నడిపిస్తుందని భావిస్తున్నారు. మూడు వేదికలను వెస్టిండీస్ క్రికెట్ బోర్డు బిడ్డింగ్ ప్రాసెస్ ద్వారా ఎంపిక చేసింది. దానికి ఐసీసీ ఆమోదం తెలిపింది. ప్రిలిమినరీ రౌండ్ మ్యాచ్‌లు గుయానా నేషనల్ స్టేడియం, సెయింట్ లూసియాలోని డారెన్ సమ్మి స్టేడియంలలో జరుగుతాయి. కాగా ఆంటిగ్వాలోని సర్ వివియన్ రిచర్డ్స్ స్టేడియం, బార్బుడా స్టేడియాలు సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లకు ఆతిథ్యమిస్తాయి. 'వెస్టిండీస్ మహిళల ప్రస్తుతం చాంపియన్లుగా కొనసాగుతున్నారు. తమ సొంత గడ్డపై టైటిల్‌ను నిలబెట్టుకుంటారనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఈ మెగా ఈవెంట్‌కు భారీ ఎత్తున ప్రచారం చేస్తాం. అభిమానులు పెద్ద సంఖ్యలో తమ అభిమాన క్రికెటర్లకు స్వాగతం పలుకుతారని భావిస్తున్నాను' అని ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డేవిడ్ రిచర్డ్సన్ అన్నారు. డిఫెండింగ్ చాంపియన్స్‌గా టైటిల్‌ను నిలబెట్టుకోవడంపైనే ప్రధానంగా దృష్టిపెడతామని వెస్టిండీస్ జట్టు కెప్టెన్ స్టఫనీ టేలర్ చెప్పింది. ఆతిథ్య వెస్టిండీస్‌తో పాటు ఇండియా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, పాకిస్థాన్, సౌతాఫ్రికా, శ్రీలంక జట్లు ఇప్పటికే అర్హత పొందాయి. మిగిలిన రెండు స్థానాలకు జూలై 3 నుంచి 14వ తేదీ వరకు నెదర్లాండ్స్‌లో జరగనున్న క్వాలిఫయింగ్ టోర్నీలో బంగ్లాదేశ్, హాలండ్, ఐర్లాండ్, పపువా న్యూ జెనీవా, స్కాట్లాండ్, థాయ్‌లాండ్, ఉగాండా లేదా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ జట్లు తలపడతాయి.

పరువు కోసం పోరు

- నేటి నుంచి ఇండియా, సౌతాఫ్రికా చివరి టెస్టు



జొహన్నెస్‌బర్గ్: సౌతాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో ఇక పరువు నిలబెట్టుకోవడమే మిగిలింది. వరుసగా రెండు టెస్టు మ్యాచ్‌ల్లో గెలిచి 2-0తో సిరీస్‌ను సొంతం చేసుకున్న సౌతాఫ్రికా జట్టు టీమిండియాను వైట్‌వాష్ చేసేందుకు సిద్ధమైంది. ఇండియా, సౌతాఫ్రికా మధ్య బుధవారమిక్కడ చివరి, మూడో టెస్టు మ్యాచ్ ప్రారంభం కానుంది. పూర్తి స్థాయి కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ సేనకు ఇది తొలి విదేశీ టెస్టు సిరీస్ ఓటమి. గతంలో అంటే 2014లో ఆస్ట్రేలియా పర్యటనలో కోహ్లీ ఒక మ్యాచ్‌కు కెప్టెన్సీ చేశాడు. కానీ అప్పుడు ధోనీ ఫుల్‌టైమ్ కెప్టెన్‌గా ఉన్నాడు. అంతేకాదు 2015 నుంచి తొమ్మిది టెస్టు సిరీస్‌ల వరుస విజయాలకు ఈ సిరీస్ ఓటమి బ్రేక్ వేసింది. ఒకవేళ మూడో టెస్టులోనూ కోహ్లీ సేన ఓడిపోయినా టీమిండియా నంబర్ వన్ ర్యాంక్‌కు ఎటువంటి ప్రమాదమూ లేదు. విమర్శలు తీవ్రం కావడంతో మూడో టెస్టుకు భువనేశ్వర్‌ను తీసుకునే అవకాశముంది. గత రెండు మ్యాచ్‌లకు ఎంపికై అందరినీ ఆశ్చర్యంలో ముంచిన జస్‌ప్రీత్ బుమ్రా డ్రెస్సింగ్ రూమ్‌కు పరిమితమయ్యే అవకాశముంది. సోమవారం నెట్ ప్రాక్టీస్‌లో ఐదుగురు బౌలర్లు ముమ్మరంగా బౌలింగ్ ప్రాక్టీస్ చేశారు. కానీ వాళ్లల్లో భువనేశ్వర్ కుమార్, ఇషాంత్ శర్మ, ఉమేష్ యాదవ్, మహ్మద్ షమీ బ్యాటింగ్ కూడా ప్రాక్టీస్ చేశారు.

ఈ చివరి టెస్టుకు తుది జట్టులో కెప్టెన్ కోహ్లీ మరో మార్పు చేసే సూచనలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే అజింక్య రహానే నెట్స్‌లో చాలా సేపు ప్రాక్టీస్ చేశాడు. గత రెండ్రోజుల్లో నాలుగుసార్లు సుదీర్ఘ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. అందరూ ఎదురు చూస్తున్నట్టు రహానేను జట్టులోకి తీసుకోవడంతో పాటు రోహిత్‌కు జట్టులో చోటు దొరకడం అనుమానంగా మారింది. మరోవైపు జొహన్నెస్‌బర్గ్ పిచ్‌ను కూడా పేస్, బౌన్సీగా తయారు చేశారు. మొత్తానికి పరిస్థితులన్నీ మళ్లీ కోహ్లీకి వ్యతిరేకంగా మారాయి. ఆరు నెలల క్రితం శ్రీలంకలో టీమిండియా 3-0తో గెలిచింది. అలాంటి విజయాన్ని గతంలో భారత జట్టు ఎన్నడూ సాధించలేదు. ఇప్పుడు కూడా కోహ్లీ సేన 3-0 స్కోరులైన్ వద్ద ఉంది. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. గతంలో టీమిండియా ఎన్నడూ సౌతాఫ్రికా గడ్డపై వైట్‌వాష్‌కు గురికాలేదు. 1992 నుంచి ఇప్పటి వరకు టీమిండియా ఆరుసార్లు సౌతాఫ్రికా పర్యటనకు వచ్చింది. 1996-97 సీజన్‌లో సచిన్ టెండుల్కర్ నేతృత్వంలో టీమిండియా మూడు టెస్టుల సిరీస్‌ను 2-0తో దారుణంగా ఓడిపోయింది. 2006 నుంచి చివరి మూడు పర్యటనల్లో టీమిండియా కనీసం ఒక టెస్టు గెలవడం లేదా డ్రా చేసుకోవడం జరిగింది. వాండరర్స్ స్టేడియం రికార్డు బహుశా టీమిండియాకు ఉపయోగపడే అవకాశముంది. ఈ మైదానంలో టీమిండియా నాలుగు టెస్టు మ్యాచ్‌లు (నవంబర్ 1992, జనవరి 1997, డిసెంబర్ 2006, డిసెంబర్ 2013) ఆడింది. అయితే ఒక్క మ్యాచ్‌లో కూడా ఓడిపోలేదు. అయితే 2006లో ద్రవిడ్ నేతృత్వంలో టీమిండియా ఈ మైదానంలో గెలిచింది. శ్రీశాంత్ 8 వికెట్లు తీశాడు. 11 ఏళ్ల తర్వాత ఇప్పుడు అదే గ్రీన్, బౌన్సీ పిచ్‌పై టీమిండియా మూడో టెస్టు ఆడబోతోంది. పిచ్‌పై పెరిగిన గడ్డిన ఎటువంటి పరిస్థితుల్లో తీసివేయబోమని క్యూరేటర్ బెథుయెల్ బుథెలెజి గత ఆదివారం అన్నారు. ఆయన చెప్పినట్టుగానే గ్రీన్ కార్పెట్ పరిచినట్టు కనిపిస్తున్న పిచ్ ఇరు జట్లనూ ఆహ్వానిస్తోంది.

విరాట్ నాయకత్వంపై స్మిత్ అనుమానం



జొహన్నెస్‌బర్గ్: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ నాయకత్వ లక్షణాలపై సౌతాఫ్రికా మాజీ కెప్టెన్ గ్రేమ్ స్మిత్ అనుమానాలు వ్యక్తం చేశారు. 29 ఏళ్ల విరాట్ ఎక్కువ కాలం కెప్టెన్‌గా కొనసాగలేకపోవచ్చన్నారు. 'ఎందుకో నాకు తెలీదు. కానీ కోహ్లీని చూస్తుంటే టీమిండియాకు అతను ఎక్కువ రోజులు కెప్టెన్‌గా ఉండడనిపిస్తోంది. నువ్వు ప్రపంచంలోనే ఉత్తమ ప్లేయర్ కావచ్చు. ఆ దూకుడును నువ్వు ఇష్టపడుతుండొచ్చు. నీ సహచరుల గురించి నువ్వు ఆలోచించకపోవచ్చు. అయితే కళ్లు తెరిచి తన చుట్టూ ఏం జరుగుతోందో తెలుసుకున్నప్పుడు.. కోపాన్ని, దూకుడును విడిచి నిర్మాణాత్మక ధోరణితో సాధ్యాసాధ్యాల గురించి ఆలోచించినప్పుడు నిజంగా గొప్ప లీడర్ అవుతాడు' అని స్మిత్ అన్నారు. మైదానంలో కోహ్లీ ప్రవర్తన జట్టుపై నెగెటివ్ ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు.



సౌతాఫ్రికాలో పరాజయాలపై సీఓఏ సమీక్ష

న్యూఢిల్లీ: సౌతాఫ్రికాలో టీమిండియా ఘోర పరాజయాలపై ప్రస్తుతం బీసీసీఐని నడిపిస్తున్న కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ (సీఓఏ) సమీక్షించనుంది. కేప్‌టౌన్, సెంచూరియన్ టెస్టులలో టీమిండియా ఘోరంగా ఓడిపోయి సిరీస్‌ను కోల్పోయింది. టీమిండియాకు ఏమాత్రం ఉపయోగపడని చివరి, మూడో టెస్టు బుధవారం జొహన్నెస్‌బర్గ్‌లో ప్రారంభం కానుంది. 'టీమ్ మేనేజర్ పూర్తి నివేదిక అందిన తర్వాత క్రికెటర్ల ప్రతిభపై సమీక్ష చేస్తాం. ప్రస్తుతం ప్లేయర్స్, అధికారులు సౌతాఫ్రికాలో ఉన్నారు కాబట్టి ఇప్పుడు ఎటువంటి చర్యలూ ఉండవు' అని మంగళవారమిక్కడ జరిగిన సీఓఏ సమావేశానికి హాజరైన బీసీసీఐ అధికారి ఒకరు చెప్పారు. ఈ సమావేశంలో సీఓఏ చీఫ్ వినోద్ రాయ్, సభ్యురాలు డయానా ఎడెల్జీ, బీసీసీఐ సీఈఓ రాహుల్ జొహ్రి పాల్గొన్నారు. బీసీసీఐ ఉన్నతాధికారులెవ్వరికీ అంటే తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నాకు గానీ, కార్యదర్శి అమితాబ్ చౌదరికి గానీ ఈ సమావేశానికి ఆహ్వానం లేదు. సిరీస్‌ను కోల్పోవడంతో కోహ్లీ నేతృత్వంలోని టీమిండియాపై తీవ్రంగా విమర్శలు వచ్చాయి. అయితే ఎటువంటి ప్రాక్టీస్ లేకుండా నేరుగా తొలి టెస్టులో టీమిండియా ఆడిందని కొంత మంది మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు. కానీ సౌతాఫ్రికా పర్యటనకు ముందు శ్రీలంకతో సిరీస్ సరైంది కాదని హర్భజన్ అన్నాడు. పది రోజులు ముందుగానే ఇక్కడికి వచ్చివుంటే పరిస్థితి మరోలా ఉండేదని స్వయంగా కోచ్ రవిశాస్త్రి చెప్పిన సంగతి తెలిసిందే. మ్యాచ్‌ల టైమింగ్‌ను మారుస్తూ ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయానికి ఈ సమావేశంలో సీఓఏ ఆమోద ముద్ర వేసింది. ఐపీఎల్-11 ఏప్రిల్ 7వ తేదీ నుంచి మే 27వ తేదీ వరకు జరుగుతాయని గవర్నింగ్ కౌన్సిల్ ప్రకటించిన విషయం విదితమే. అంతేకాకుండా మ్యాచ్ టైమింగ్స్ కూడా మార్చారు. రాత్రి 8 గంటల మ్యాచ్‌ను 7 గంటలకు, సాయంత్రం 4 గంటల మ్యాచ్‌ను 5-30కు నిర్వహిస్తారు. ఈనెల 29న సుప్రీం కోర్టు విచారణ అనంతరం సీఓఏ సమావేశమయ్యే అవకాశముంది.

టీ20 జట్టుకు హర్మన్‌ప్రీత్ నేతృత్వం

- వన్డే జట్టు కెప్టెన్‌గా మిథాలీ • సౌతాఫ్రికాతో టీ20 సిరీస్‌కు మహిళల జట్టు ఎంపిక



ముంబై: భారత మహిళల క్రికెట్ టీ20 జట్టుకు స్టార్ ఆల్ రౌండర్ హర్మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్‌గా నియమితురాలైంది. సౌతాఫ్రికా పర్యటనకు వెళ్లనున్న భారత మహిళల క్రికెట్ జట్టు ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడుతుంది. తొలి మ్యాచ్ ఫిబ్రవరి 13న జరుగుతుంది. స్మృతి మంధన వైస్ కెప్టెన్‌గా కొనసాగుతుంది. సౌతాఫ్రికా పర్యటనకు వన్డే, టీ20 జట్లను మంగళవారం ఆలిండియా వుమెన్స్ సెలెక్షన్ కమిటీ ఎంపిక చేసింది. టీ20 సిరీస్ కంటే ముందు జరగనున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు మిథాలీ రాజ్ నేతృత్వం వహిస్తుంది.

టీ20 జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధన (వైస్ కెప్టెన్), మిథాలీ రాజ్, వేద కృష్ణమూర్తి, జెమెమీ రోడ్రిగ్వెజ్, దీప్తి శర్మ, అనుజ పాటిల్, తనియ భాటియా (వికెట్ కీపర్), నుజ్హాట్ పర్వీన్ (వికెట్ కీపర్), పూనమ్ యాదవ్, రాజేశ్వరీ గైక్వాడ్, ఝులన్ గోస్వామి, శిఖా పాండే, పూజ వస్త్రాకర్, రాధా యాదవ్.

శాస్త్రి అభిప్రాయంతో విభేదించిన కోహ్లీ

- వివాదానికి తెరలేపిన టీమిండియా కెప్టెన్



జొహన్నెస్‌బర్గ్: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ ఊహించని వివాదానికి తెరలేపాడు. తాము సౌతాఫ్రికా పర్యటనకు బాగా సిద్ధపడే వచ్చామని మూడో టెస్టు మ్యాచ్ సందర్భంగా మంగళవారం కోహ్లీ అన్నాడు. పది రోజుల ముందే సౌతాఫ్రికాకు వచ్చివుంటే బాగుండేదని ఇంతకుముందు కోచ్ రవిశాస్త్రి చెప్పిన సంగతి తెలిసిందే. 'ఈ సిరీస్‌కు మేము బాగా సిద్ధపడలేదని నేను అనుకోవడం లేదు. సిరీస్ కోల్పోయిన తర్వాత ఇక్కడ కూర్చొని ఏవేవో కారణాలు చెప్పదలచుకోలేదు. సిరీస్‌కు సిద్ధపడటానికి మాకు వారం రోజుల సమయం ఉండింది. ఒక రోజంతా ప్రయాణాలతో గడిచింది. కనుక ఆ సమయంలోనే సిద్ధపడ్డాం. ఆ సిద్ధపాటుతోనే బరిలోకి దిగాం. ఇంతకుముందే చెప్పినట్టుగా ఓటమికి ఇతర కారణాల గురించి ఆలోచించ దలచుకోలేదు. సిరీస్ ఓటమి పూర్తిగా మాతప్పే. పరిస్థితులను మావైపు తిప్పుకోవడంలో పూర్తిగా విఫలమయ్యాం. ఆ కారణంగానే 0-2తో సిరీస్ కోల్పోయాం. బాధ్యత అనేది ఏ ఒక్కరిదీ కాదు. ప్రతి ఒక్కరూ బాధ్యులే. ఒక కెప్టెన్‌గా అందరూ గర్వించేలా పరిస్థితులను మార్చాలి. ఎంత ఒత్తిడి ఉన్నా మ్యాచ్ చేజారకుండా సరైన నిర్ణయాలు తీసుకోవాలి' అని కోహ్లీ అన్నాడు. అసలే పేలవ ప్రదర్శనతో టీమిండియా సిరీస్‌ను కోల్పోయిందని విమర్శలు వెల్లువెత్తుతున్న సమయంలో కోచ్ రవిశాస్త్రి అభిప్రాయాన్ని విభేదించి కోహ్లీ మాట్లాడటం కొత్త వివాదానికి తెరలేపినట్టయింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id. manamtelugudaily1@gmail.com.